

అక్షరమణమాల

# అక్షరమణమాల

# అక్షరమణమాల


| | |
|---|---|
| సేకరణ | : భక్తులు |
| ప్రథమ ముద్రణ | : **శ్రీ శోభకృత్** నామ సంవత్సరం<br>**26, నవంబరు, 2023**<br>**దీపోత్సవం సందర్భంగా** |
| ప్రతులు | : 3000 కాపీలు |
| ప్రతులకు | : **శ్రీ రమణ క్షేత్రం**<br>జిన్నూరు - 534 265, ప.గో. జిల్లా |
| డి.టి.పి.<br>& డిజైనింగ్ | : ఎమ్. మహాలక్ష్మి బాయి<br>మొ : 8247708638 |
| ముద్రణ | : **శ్రీ రమణ ప్రింటర్స్**<br>గాంధినగర్, విజయవాడ.<br>సెల్ : 95810 24318, 99850 68630 |





# గురుధ్యానము

దక్షిణామూర్తి సమారంభం
శంకరాచార్య మధ్యమామ్ !
అస్మదాచార్య పర్యంతాం
వందే గురు పరంపరామ్ !!

గురుః బ్రహ్మ గురుః విష్ణుః
గురుః దేవో మహేశ్వరహః !
గురుః సాక్షాత్ పరబ్రహ్మ
తస్మై శ్రీ గురవే నమః !!

# ముందుమాట

శ్రీ భగవాన్ రమణులు మానవాళిని ఉద్ధరించడం కోసం ఆయన యొక్క కరుణ, దయతో స్వహస్తాలతో వ్రాసి అందించిన ఈ అక్షరమణమాల ద్విపదలకు సద్గురు శ్రీ నాన్నగారు లోతైన భావములను ప్రేమతో మనకు వివరించారు.

**అక్షరమణమాల :** ఇది పెళ్ళినాటిమాల ఇక్కడ పెళ్ళి కూతురు రమణస్వామి పెళ్ళికొడుకు అరుణాచలేశ్వరుడు ఇది పుష్పాలతో చేసిన మాల కాదు అక్షరములతో చేసిన మాల మణమాల అంటే పెళ్ళినాటిమాల. ఈ మాల వాడి పోదు, ఇది నశించేది కాదు. ఇది కలకాలం, చిరకాలం ఉండే మాల. నేను నీకు అక్షరాలతో చేసిన మాలను నీ మెడలో వేస్తున్నాను. నీవు నీ కరుణ, దయ అనే మాల నా మెడలో వేసి నన్ను అనుగ్రహించు. ఈ అక్షర మణమాలలో రమణస్వామి అరుణాచలేశ్వరుడి గురించి అనేక కోణాలలో వివరించారు. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు కల్పితమే అని చెప్పిన రమణస్వామికి ఈ అక్షరమణమాలతో పనేమి లేదు. ఈ మాల ఆయన కోసం కాదు మన కోసమే.

మనందరికి పెళ్ళి అయ్యింది. ఎవరితోటి కన్పిస్తున్న ఈ ప్రపంచముతో, లోకంతో అయ్యింది. మరి ఇది అటువంటి పెళ్ళికాదు ఇది డివైన్ మ్యారేజీ, ఆత్మతోటి పెళ్ళి.

లోకాన్ని గురించే చింతిస్తున్న మన మనస్సును, లోకాన్నించి, ఈశ్వరుని వైపు, ఆత్మవైపు, సౌందర్యం వైపు మళ్ళించటం కోసం ఈ మాలను తయారు చేశారు భగవాన్. మనం సత్యంతోటి, ఆత్మతోటి పెళ్ళిచేసుకోవాలి. అది ఎక్కడవుంది? మన హృదయంలోనే ఉంది. మన శరీరం మరణిస్తుంది కాని మన హృదయంలో ఉన్న వస్తువుకు మరణం లేదు. ఒక జ్ఞానిని ప్రేమించటం వలన, జ్ఞాని జీవితం గురించి వినటంవల్ల జ్ఞానం గురించి ఇంకా తెలుసుకోవాలనే కోరిక వస్తుంది. కనుక మన స్నేహం, మన అనుబంధం, ఒక అవతార పురుషుడి తోటి కాని, ఒక జ్ఞానితోటి కాని, ఒక మహాత్ముడితోటి కాని ఉండాలి దానివలన ఎక్కువ నేర్చుకుంటాం. అనేక గ్రంథాలు చదవడం కంటే ఈశ్వరుడి పట్ల ఇష్టం వలన ఎక్కువగా జ్ఞానం పొందగలుగుతారు. మీకు తెలియ కుండానే మీ జీవితం మారిపోతుంది. మీకు ప్రయాణం చేస్తున్నట్లు కూడా తెలీదు.

ఒక జ్ఞానిని స్మరించటంవలన మనం కెరటాలు లేని సముద్రం ఎంత ప్రశాంతంగా ఉంటుందో అటువంటి ప్రశాంత స్థితిలోకి వెళతాం. మన హృదయంలో ఉన్న శాంతి సముద్రంలోకి మనం ప్రవేశించటానికి ఈ అక్షరమణ మాలను తయారు చేశారు శ్రీ భగవాన్ రమణమహర్షులు. మనం ఏదైనా చదివేటప్పుడు యాంత్రికంగా చదువకూడదు దాన్ని అర్థం చేసుకోవాలి అర్థం చేసుకోవడం కూడా ఒక యోగమే. అర్థం చేసుకోవడంవలన ఆచరించాలి అనే బుద్ధి

కలుగుతుంది. ఎప్పుడైతే మనకు ఆత్మతో సంబంధం ఏర్పడుతుందో, ఈ బాహ్యమైన జీవితంలో ఒడిదుడుకులు వచ్చినప్పటికి కష్టసుఖాలు వచ్చినప్పటికి అవి మనల్ని తాకవు. తత్వం మనచేతిలో ఉన్నప్పుడు ఎంత దుఃఖం ఉన్నాకూడా మిమ్మల్ని కదపదు. అటువంటి ఉన్నతమైన స్థితికి మనలను చేర్చుటానికి ఈ అక్షరమణమాలను తయారుచేశారు భగవాన్.

మీలో ఎంతకాలము అయితే అజ్ఞానం ఉందో అంత కాలం శారీరక బాధలు, మానసిక బాధలు, చిత్తవృత్తికి సంబంధించిన బాధలు ఎన్ని జన్మలు ఎత్తినా ఏ లోకానికి వెళ్ళినా మిమ్ముల్ని వెంటాడుతూనే ఉంటాయి. ఎప్పటి వరకు? మీకు ఆత్మానుభవం కలిగేవరకు. అందుచేత మీరు ఆత్మానుభవం పొందడం కోసం ఈ అక్షరమణమాలను తయారుచేసారు రమణస్వామి. శాశ్వతమైన శాంతి కావాలి అంటే, ఈ ప్రకృతి నుండి బయటపడాలి అంటే మీరు మోక్షం పొందితీరాల్సిందే. అంతకంటే ఇంకొక గమ్యం లేదు. అలా మోక్షం సాధించడం కోసం, దానిని పొందింప చేయడం కోసం అనుగ్రహమూర్తి అయినటువంటి **భగవాన్ శ్రీ రమణమహర్షి** ఈ **అక్షరమణమాలను** తయారు చేశారు.

ధ్యానం : సాక్షాదరుణ గిరీశ్వర వరార్హమగు
అక్షరమణమాల నమరించుటకును ॥
కరుణాకరుండగు గణపతియొసగి
కరమభయ కరము కాపాడుగాక ॥

భగవాన్ విఘ్నేశ్వరుడుని ఏమని ప్రార్థిస్తున్నారు అంటే

మామూలు వెళ్ళికొడుకు అయితే బజారులోకి వెళ్ళి ఒక 20 రూ.లు పెట్టి ఒక దండ తెచ్చి మెడలో వేయవచ్చు. నేను మామూలు పెళ్ళికొడుకు కోసం తయారుచేయటం లేదు మాల. సాక్షాత్తు అరుణాచలేశ్వరుడు అనే పెళ్ళి కుమారుడికి దండ వేయటానికి నేను పూనుకున్నాను.

ఈ పెళ్ళికొడుకు ఎవరు? పరమేశ్వరుడు. ఈ దేహాభిమానాన్ని ప్రేమిస్తున్న జీవుడిని, మనస్సును అభిమానిస్తున్నటువంటి జీవుడిని, ఆత్మ వైపు తిప్పటం కోసం మనస్సుని అంతర్ముఖం చేయటం కోసం, ఆత్మానుభవం కలిగించటం కోసం నేనొక దండను తయారుచేస్తున్నాను. ఓ గణపతిస్వామి నీవు విఘ్నాలు రాకుండా చూసే స్వామివి అటువంటి నిన్ను దండను తయారుచేయటానికి మొట్టమొదటగా ప్రార్థిస్తున్నాను. నువ్వు అభయం ఇచ్చి ఈ పని పూర్తి అయ్యేలా నన్ను ఆశీర్వదించు ఓ గణపతి! అని గణపతి స్వామిని స్తుతించి తన దండను ప్రారంభించారు రమణస్వామి.

అరుణాచలశివ - అరుణాచల శివ ।
అరుణాచలశివ - అరుణాచలా ॥
అరుణాచలశివ - అరుణాచల శివ ।
అరుణాచలశివ - అరుణాచలా ॥



## 1. అరుణాచలమనచు స్మరియించు వారల, అహము నిర్మూలింతు వరుణాచలా

**భావం :** అరుణాచలా! తమ మనసులో 'అరుణాచలా' 'అరుణాచలా' యని ధ్యానించు భక్తుల అహంకారంను మూలంతో సహా నాశనం చేసేస్తావు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! రాత్రి అనక, పగలు అనక గంటలు మరిచిపోయి రోజులు మరిచిపోయి, అమావాస్య, పౌర్ణమి తిథులను, నక్షత్రాలను కూడా మరిచిపోయి ఎవరైతే తమ ఇంద్రియాలని, మనస్సుని, అరుణాచలేశ్వరుడి స్మరణలో నానపెట్టుకుంటున్నారో వారి యొక్క అహంకారం మూలంతో సహా తీసేసే స్వభావం నీకున్నది. ఎవరైతే అరుణాచలా! అరుణాచలా! అంటూ స్మరిస్తున్నారో, ఎవరైతే ఆ స్మరణలో జీవిస్తున్నారో, ఆ స్మరణలోనే ఎవరి ప్రాణం పోతుందో వారికి మోక్షం వస్తుందని భగవాన్ చెబుతున్నప్పుడు...

ఒకరు అరుణాచలాన్ని స్మరించుకుంటేనే మోక్షం వచ్చేస్తుందా? అంత తేలికా అని అడిగితే, భగవాన్ ఇది ఈశ్వరుడి ఆజ్ఞ ప్రశ్నించటానికి నీవు ఎవరు? అసలు నీవు అరుణాచలాన్ని స్మరించి చూడు. అసలు సాధన చేయకుండా, స్మరణ చేయకుండా కాలు మెదపకుండా, చేయిమెదపకుండా, ఏమీ చేయకుండా నీవు ప్రశ్నించటం ఏమిటి ముందు స్మరించు.

నీ దేహాన్ని నీ అహంకారాన్ని మర్చిపోయి, నీ రూప నామాలు, గౌరవాలు, అగౌరవాలు మరిచిపోయి నిరంతరం అరుణాచలేశ్వరుడిని స్మరించగలవా! నీ హృదయంలోనే అరుణాచలేశ్వరుడు ఉన్నాడు. ఎవరైతే హృదయ పూర్వకంగా, ప్రేమ పూర్వకంగా కపటం లేకుండా స్మరిస్తారో వారి యొక్క అహంకారాన్ని నిర్మూలిస్తావు అరుణాచలా!

నిన్ను ఏమీ ప్రాణాయామాలు చేయమనడం లేదు. యజ్ఞయాగాలు చేయమనడం లేదు. కేవలం 'అరుణాచలా! అరుణాచలా!' అని స్మరిస్తూ ఉంటే నీకు తెలియకుండానే నీ అహంకారాన్ని కాల్చి బూడిద చేసేస్తాడు. నీకు ఏది మంచిదో నీకు తెలియదు, కాని నీలో ఉన్న పరమేశ్వరుడికి తెలుసు.

నేనేమి రికమండేషన్ చేయడం లేదు. అది నీ వృత్తి అయ్యా! నీ ధర్మం అయ్యా! ఎవరైతే అరుణాచలా! అంటూ వాడి బుద్ధిని, శక్తిని కేంద్రీకరించి నిన్నే స్మరిస్తున్నారో వారి అహంకారాన్ని సమూలంగా నాశనం చేస్తావయ్యా.

## 2. అళగు (అంద) సుందరమువలె చేరి నేను, నీవుందమభిన్నమై యరుణాచలా

**భావం :** అరుణాచలా ! అందం, సుందరం అనే రెండు పదాలు భావంలో వేరుకాని విధంగా నీవు, నేను అనే ఉపాధులు నిజస్వరూపంలో వేరుకాదు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నువ్వే నాకు తల్లీ, నువ్వే నాకు తండ్రి. మా అమ్మ అళగమ్మ అంటే సౌందర్యం నా తండ్రి పేరు సుందరంఅయ్యర్ అంటే సౌందర్యం. అందం, అందం కలిసిపోతే ఎలా ఉంటుందో పాలు, పాలు కలసిపోతే ఎలాగ ఉంటుందో నీరు, నీరు కలసిపోతే ఎలా ఉంటుందో అలా నువ్వు నేను కలిసిపోయి ఉందాం అరుణాచలేశ్వరుడా!, మన ఇద్దరికి వేరు కాపురం వద్దు, లోపల ఉన్న వస్తువు ఒక్కటే అందుచేత నీకు నాకు ఇంక బేధం లేదు. అళగుసుందరముల వలే ఎంతో అన్యోన్యంగా, ఎంతో ఐక్యమత్యంగా ఎంతో అందంగా వారిద్దరూ సంసారం చేసారో, అదే విధంగా నువ్వు నేను కలిసిపోయి ఉందాం అరుణాచలేశ్వరుడా !

రమణస్వామిని అరుణాచలేశ్వరుడి కంటే భిన్నంగా మీరు చూడకండి. రమణస్వామి నోటి నుండి వాక్కు వస్తే అది అరుణాచలేశ్వరుడు అన్నట్లే, రమణస్వామి ఏదైనా రచన చేస్తే, అది అరుణాచలేశ్వరుడు చేసినట్టే. ఆ కొండే రూపం ధరించి వచ్చింది, మళ్ళీ రూపం విడిచిపెట్టి ఆ కొండలో కలిసిపోయింది.

## 3. లోదూరి లాగి నీ లోగుహను చేరగా,
## నమరించి తేమొకో యరుణాచలా

**భావం :** అరుణాచలా ! నీవు నా మనస్సులో దూరి నన్ను లాగి నీ హృదయగుహలో బంధించావు. నీ అనుగ్రహం యొక్క విచిత్రం ఏమని చెప్పను?

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నా లోపలకి నువ్వే దూరావు. నేను తిరుచ్చిళిలో అందరితోపాటు చదువుకుంటున్నాను, ఆడుకుంటున్నాను. అలాంటి నాలోకి నీవు ఎలా వచ్చావో ఎప్పుడు వచ్చావో నాకు తెలియదు. అరుణాచలేశ్వరుడా! నాకు మోక్షం కాని, జ్ఞానం కాని నాకు ఏమి తెలియవు, అలాంటివాడినైన నాకు తెలియకుండానే నాలో దూరి నా కొంపముంచావయ్యా. ఓ అరుణాచలా ! నేను అందరి లాంటివాడినే, నాలో ఏ ప్రత్యేకత లేదు, నా బాధలతో, నా కష్టసుఖాలతో, నా రాగద్వేషాలతో నేను ఉన్నాను. అలా ఉన్న నన్ను నాకు తెలియకుండానే నా ఇంటిలోనుండి లాగేశావు. నేను నీ గురించి ఉపన్యాసాలు చెప్పలేదు, దండాలు పెట్టలేదు, దండలు వేయలేదు. మరి నన్నెందుకు అనుగ్రహించావో తెలియదు. నన్ను నా ఇంటిలోనుండి బయటకు లాగేసి నన్ను రోడ్డుమీద వదిలి వేయలేదు, ప్రకృతిలో వదిలి వేయలేదు. ఈ జననమరణ ప్రవాహం అనే ఈ సంసారంలో కొట్టుకొని పోకుండా నన్ను నీ హృదయంలోనికి చేర్చుకున్నావు. నీ స్వరూపాన్ని నాకు ఇచ్చావు. నీ అంతటి వాడిని చేశావు. నీవు నాకు ఉపకారం చేస్తున్నావని నాకు తెలియకుండా, నాకు ఇసుమంతయు బాధలేకుండా నన్ను మోక్షసామ్రాజ్యానికి అధిపతిని చేశావు.

అసూయలతో, కార్పణ్యాలతో కాలిపోతున్న రోజులలో, ఈ కలియుగంలో ఎంత పనిచేశావు అరుణాచలా! నన్ను

అందలమెక్కించావు. నువ్వు నన్ను స్మరించావు కాబట్టి నేను నిన్ను స్మరించగలిగాను. ఇది అంతా నీ అనుగ్రహం అంటున్నారు రమణస్వామి.

ఈశ్వరుడికి, గురువుకి తెలుస్తుంది ఎవరు ఈశ్వర కోటివాళ్ళో వాళ్ళని ఈశ్వరానుగ్రహంలో ముంచివేస్తాడు అంటున్నారు రమణస్వామి.

## 4. ఎవరికిగా నన్ను ఏలితి, విడిచిన, అఖిలము నిందించు నరుణాచలా

**భావం :** అరుణాచలా! నీవు నన్ను ఎవరికోసం ఏలుకొన్నావు? ఇంతకుముందు కరుణతో ఏలిన నీవు ఇప్పుడు ఉదాసీనంగా, పట్టించుకోకుండా నన్ను వదిలేస్తే ఈ ప్రపంచమంతా నిన్ను నిందిస్తుంది.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! ఎవరికోసం నన్ను తీసుకొని వచ్చావు? ఏదో తిరుచ్చిళిలో ఉన్నవాడిని, బడిలో చదువు కుంటూ, ఆటపాటలతో కాలక్షేపం చేస్తున్న నన్ను మా ఇంటికి, మా అమ్మకు దూరం చేశావు. ఎంతోమంది జీవులు ఈ లోకంలో ఉన్నారు. నీకు ఎవరూ దొరకలేదా! నేనే దొరికానా! నాకు ఇక్కడ పనేముంది? నన్ను ఇక్కడకు తీసుకువచ్చి విడిచి పెట్టేస్తే లోకం నిన్ను నిందిస్తుందయ్యా! లోకనిందకు నీవు గురికావద్దు. నన్ను విడిచిపెట్టకు. నేను ఎంతటి వాడను నిన్ను

పట్టుకోవడానికి, నీవే నన్నుగట్టిగా పట్టుకోవయ్యా అంటున్నారు రమణస్వామి.

మన తెలివితేటలతో భగవంతుడిని పట్టుకోలేం ఆయన దయతో మనలను పట్టుకొనేవిధంగా మనం జీవించాలి అని రమణస్వామి మనకు చెపుతున్నారు. అంటే ఎవరైతే హృదయంలో పవిత్రంగా ఉన్నారో, ఎవరైతే భగవంతుడిని విశ్వసిస్తున్నారో, వారిని అరుణాచలేశ్వరుడు విడిచిపెట్టడు అని అంటున్నారు భగవాన్.

## 5 ఈ నింద తప్పు నిన్నేటికి తలపించి, తిక విడువారెవ రరుణాచల

**భావం :** అరుణాచలా! అకారణమైన ఈ నింద నుండి నిన్ను నీవు విడిపించుకో! నన్ను ఎందుకు నిన్ను తలచుకొనేటట్లు చేసితివి? ఇక నిన్ను విడిచేవారెవరు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! నేను నిన్ను స్మరించేటట్లు నువ్వే చేశావు. చిన్న వయస్సులోనే నీ పేరు తలపెట్టుకొనేటట్లు నీవే చేశావు. నీ సుఖ స్వరూపాన్ని చూపించాక మరి నిన్ను ఇప్పుడు విడవమంటే ఎలా సాధ్యం. నీ అనుగ్రహానికి పాత్రుడనయిన నన్ను నీవు విడిచిపెడితే లోకం నిన్ను నిందిస్తుందివయ్యా ఈ లోకనింద నుండి నువ్వు తప్పుకో అరుణాచలా! నిన్ను నేను నా తెలివితేటలతో తలచుకొన్నానా లేదే, నీ అనుగ్రహం వలన నన్ను నీ స్మరణ చేసేటట్లు చేశావు.

నిన్ను ఎలా విడిచిపెడతాను? నువ్వు పొమ్మన్నా ఎలా పోతాను? ఒకసారి నీ ప్రేమరుచి చూసాక దానిని ఎలా వదలుకుంటాను? నీవు నన్ను వదిలిపెడితే అది నీ తప్పే అవుతుంది.

ఓ అరుణాచలేశ్వరుడా! ఆత్మవైభవం ఎలా ఉంటుందో నాకు చూపించావు ఏ శాంతిని పొందాక, ఏ సుఖాన్ని పొందాక, ఏ స్థితిని పొందాక దానిని మించిన సుఖం కాని, శాంతి కాని లేదో అటువంటి అమృతస్థితిని పొందిన తరువాత ఇక నిన్ను వదిలి వెళ్ళడానికి నాకు చోటెక్కడ ఉంది? ఒక జ్ఞానినో, అవతార పురుషుడినో దర్శించినప్పుడు, వాళ్ళలో ఉన్న ఔన్నత్యాన్ని, ప్రేమను చవిచూసిన తరువాత ప్రపంచ విషయాల మీద ప్రేమ ఎలా ఉంటుంది? జ్ఞాని చూపుతో నీలో ఉన్న అహంకారానికి నిప్పు పెట్టేసి, ఆయన సమక్షంలోనే ఉండేటట్లు, ఆయనను విడిచి ఉండలేని స్థితి భక్తుడికి కల్గిస్తాడు. అటువంటి స్థితికి భక్తుడిని చేర్చమని అరుణాచలేశ్వరుడుని భగవాన్ అడుగుతున్నారు.

## 6. కనిన జననికన్న ఘనదయాదాయకా, ఇదియా యనుగ్రహ మరుణాచలా

**భావం :** అరుణాచలా ! భక్తులకు కన్నతల్లి కన్నా ఎక్కువ ప్రేమ అందించావు. ఇది కదా నీ అనుగ్రహము.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! లోకంలో తల్లిప్రేమ, తండ్రిప్రేమ చూసినవారున్నారు. భౌతికంగా చూస్తే లోకంలో

అన్ని ప్రేమల కన్నా తల్లి ప్రేమ ఎక్కువ. లోకములో చెడ్డపిల్లలు ఉంటారు, కాని చెడ్డతల్లులు ఉండరు. అందరూ చెడ్డవాడు అనుకున్నా తల్లి మాత్రము తన కొడుకు మంచివాడే అని చెపుతుంది. తప్పిపోయిన గొర్రెలు అంటే నాకిష్టం అన్నాడు ఏసు. అంటే నలుగురు పిల్లల్లో ఎవరైనా పాడైపోయినవాడు ఉంటే తల్లి వారి మీద ఎక్కువ ప్రేమ చూపిస్తుంది. అంటే ఎవరైతే మోక్షమార్గం నుండి తప్పిపోతున్నారో వారిని తిరిగి దారిలో పెట్టాలని ప్రయత్నం చేస్తాడు ఏసు ప్రభువు. అలాగే తల్లికూడా పాడైపోతున్న కొడుకును మంచి మార్గంలో పెట్టాలని చూస్తుంది.

ఓ అరుణాచలేశ్వరుడా ! తల్లి ప్రేమ భౌతికంగా ఎక్కువ అయినా నీప్రేమ ముందు, నీ ఆప్యాయత ముందు, నీ కరుణ ముందు అది ఏ పాటిది. నీతో పోల్చలేం తల్లి ప్రేమను. తల్లి భౌతికమైన అవసరాలను తీరుస్తుంది కాని నీవు భౌతికంగా, ఆధ్యాత్మికంగా నన్ను ఎదిగేటట్లు చేసి ఆత్మసామ్రాజ్యానికి చక్రవర్తిని చేసావు. నీవు నాకున్న బేధబుద్ధిని తొలగించి నీ వాడిని చేసుకున్నావు. ఎంత దయ, కరుణ చూపించావు అరుణాచలా! నీ ప్రేమతో ప్రపంచంలో ఏ ప్రేమసాటిరాదయ్యా అంటున్నారు రమణ స్వామి. అలాంటి ప్రేమను ఎవరు పొందగలరు, ఎవరైతే త్రికరణశుద్ధిగా భగవంతుని విశ్వసిస్తున్నారో వారి మీద అరుణాచలేశ్వరుడి దయ ఎలా ఉంటుందో ఇక్కడ రమణ స్వామి చెబుతున్నారు.

## 7. నిన్నేమార్చి యరుగనీక యుల్లము పైని,
## ఉఱుదిగా నుండుమా యరుణాచలా

**భావం :** అరుణాచలా! నిన్ను ఏమార్చి ప్రాపంచిక విషయములవైపు పరుగులు పెడుతున్న నా మనస్సును అటుఇటు కదలనివ్వకుండా నీవు దానిపై స్థిరముగా ఉండి నన్ను అనుగ్రహించు.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! ఈ మనస్సును చూశావా నేను పడలేకపోతున్నాను ఈ మనస్సుతో నీవు కూడా పడలేవయ్యా. వ్యవసాయం చేసుకోవడం, ఉద్యోగం చేసుకోవడం, వ్యాపారం చేసుకోవడం, ఇల్లు కట్టుకోవడం, వంట చేసుకోవడం, ఇవి అన్నీ మా పనులు అనుకుంటున్నాం. కాని మనస్సును నిగ్రహించుకోవడం కూడా ఒక పనే అని ఎవరం అనుకోవడం లేదు. నిన్ను బంధంలో పెట్టినా నీ మనస్సే, నిన్ను మోక్షంలోకి తీసుకువెళ్ళినా నీ మనస్సే అని భగవద్గీతలో వాసుదేవస్వామి మనసుకు అగ్రస్థానం ఇచ్చారు. అలాంటి మనస్సుని నిగ్రహించుకోకుండా మనం కీర్తి సంపాదించుకోవడం, ధనం సంపాదించుకోవడం మాత్రమే మన వృత్తి అనుకుంటున్నాం. మన కూడా జన్మ జన్మలకు వస్తున్న మనసుని బాగుచేసుకోవడం మానేసి అనవసరమైన విషయాలకు ప్రాముఖ్యతను ఇస్తున్నాం. అంటే ఇది అంతా మాయ.

ఓ అరుణాచలేశ్వరుడా! సత్‌సంగానికి వెళ్ళాలని అనుకుంటూ వుంటే నాకు చాలా పనులు ఉన్నాయని చెప్పే ఈ మనస్సుని నిగ్రహించుకోవడానికి నాకు సహాయం చేయమని నిన్ను అడిగితే, నాకు ఖాళీ లేదు చాలా పనులు ఉన్నాయని అంటావేమో! అలాంటి మాటలు అనకు, అసలు ఈ మనస్సు ఒక పట్టానా లొంగదు, అది నిన్ను ఏమార్చుతుంది. నన్ను పీడిస్తున్నటువంటి ఈ మనస్సుని అటుఇటు కదలకుండా, మెదలకుండా, చెదరకుండా నీవు స్థిరంగా కూర్చో. ఎప్పుడైతే నీవు స్థిరంగా కూర్చుంటావో అప్పుడు ఈ ప్రపంచమనే మాయలో నా మనసు పడదు. నీవు అండగా ఉండగా నా మనస్సు కదలనే కదలదు. అటువంటి స్థితిని అనుగ్రహించమని భగవాన్ అరుణాచలేశ్వరుడుని వేడుకొంటున్నారు.

## 8. ఊరూరు తిరుగక ఉల్లము నినుగని, యణగ నీద్యుతి జూపు మరుణాచలా

**భావం :** అరుణాచలా! ప్రాపంచిక విషయాలవైపు అటూఇటూ చెంచలంగా తిరుగుతున్న మనస్సును నీ దర్శన భాగ్యంతో నిశ్చలమై(చలించనిది) ఉండేటట్లు నీ వైభవాన్ని ప్రదర్శించు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! ఇక్కడోగంతు, అక్కడ ఒక గంతు వేయకుండా మా మనస్సు చలించకుండా చూడవయ్యా! మా మనసుకు చాపల్యం సహజం కదా! గాలి వీస్తుంటే ఆకులు

అటూ ఇటూ కదులుతూ ఉంటాయి. అలాగే విషయచింతన వచ్చినప్పుడు మా మనస్సు అటూఇటూ కదులుతుంది. మేము లోకవిచారణ చేస్తూ ఆత్మవిచారణ చేస్తున్నామని అను కుంటున్నాం. ఈ ఊరు అని, ఆ ఊరు అని మేం ప్రపంచాన్ని పట్టుకొని తిరుగుతున్నాం. మేం నిన్ను పట్టుకోవడం లేదు. మేం స్థిరబుద్ధి లేకుండా రోజుకో మార్గం రోజుకో గురువుని మార్చివేస్తుంటాం. మేం విశ్వాస హీనులం మాకు చపలత్వం ఎక్కువ. మేం నీకు దూరమైపోయి ప్రపంచానికి దగ్గరగా ఉన్నాం. ప్రాణం పోయేటప్పుడు కూడా మాకు ప్రాపంచిక తలంపే.

ఈ జీవుల ప్రేమలు చర్మం ఎంత లోతుగా ఉందో అంతే లోతుగా ఉంటాయి. ఇవి అన్నీ నమ్మడానికి లేదు. నీ వైభవం, నీ ప్రేమను, నాకు చూపిస్తే అక్కడ నా మనస్సు ఆగిపోతుంది. హృదయంలో ఎంత సుఖం, శాంతి ఉన్నాయి అంటే సముద్రంలో ఎంత నీరు ఉందో అంత ఉన్నాయి. అది భౌతికంగా కాదు నిజంగా ఉన్నాయి. కాని అవి మేలుకోవాలి అంటే ఈశ్వరానుగ్రహం, గురువు అనుగ్రహం లేకుండా సాధ్యం కాదు. మనకు నిజమైన శాంతి, సుఖం అనుభవంలోకి వచ్చేవరకు ప్రతి జన్మలోను గురువు వెంటాడుతూ వుంటాడు. గురువు మనలను విడిచిపెట్టడు.

అరుణాచలేశ్వరుడే ఆయన దయతో ఆయన ఔన్నత్యం మనకు చూపిస్తే మనస్సు అణిగిపోతుంది. ఇంద్రియాలు

అణిగిపోతాయి అప్పుడు ఊరూరా తిరగడం మానివేస్తాం మనస్సుకు చాపల్యం పోతుంది. సాధనకు కొంచెం సమయం పడుతుంది కాని ఆయన అనుగ్రహం కొన్ని క్షణాలలో వచ్చేస్తుంది. అప్పుడు ఈ మనస్సు చలనం ఆగిపోతుంది అంటున్నారు భగవాన్.

## 9. నను చెఱచి యిపుడు నను కలియక, విడు టిది మగతనమొక్కొ యరుణాచలా

**భావం :** అరుణాచలా ! నేను పక్వం చెందినప్పుడే నా అహంకారంను పూర్తిగా నాశనం చేసి, నాతో ఏకమై కలియక పోయినచో పురుషోత్తముడనైన నీ అనుగ్రహంనకు భంగం కలుగుతుంది.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! నన్ను నా జీవలక్షణాలలో నుండి బయటకు లాగేశావు నన్ను ఇహానికి, పరానికి పనికి రానివాడిగా చెడగొట్టావు. ఏదో ప్రపంచ ఆకర్షణలలో ఉన్న నన్ను పూర్తిగా నీ వశం చేసుకొన్నావు. నా అహంకారాన్ని పూర్తిగా నాశనంచేసి నీలో కలుపుకోకపోతే పురుషోత్తముడవైన నీ పౌరుషానికే భంగం కలుగుతుందయ్యా!.

జీవుడు తనని తాను నాశనం చేసుకోవడానికి ఇష్ట పడడు. తనను తాను ఎలా పోగొట్టుకుంటాడు? ఎన్నో జన్మల నుండి పోగుచేసుకున్న జీవలక్షణాలు అంత తొందరగా వదలవు. అరుణాచలేశ్వరుడి కృప వలన భగవాన్ ఆత్మస్థితి

పొందారు. ఇక్కడ భగవాన్ అరుణాచలేశ్వరుడితో నన్ను బాహ్యప్రపంచానికి పనికి రాని వాడిగా చేసేశావు. ఇంకా ఏదైనా అహంకారం మిగిలి ఉంటే దానిని కూడా నీవు నాశనం చేసేసి నన్ను నీలో ఐక్యం చేసుకోకపోతే నేను ఈ లోకానికీ, పరలోకానికి కూడా పనికి రాని వాడినైపోతాను. నీ అనుగ్రహంతో నన్ను నీలో ఐక్యం చేసుకో అరుణాచలా! అంటున్నారు రమణస్వామి.

## 10. ఏటి కీ నిదుర నన్నితరులు లాగగ, యిది నీకు న్యాయమా అరుణాచలా

**భావం :** అరుణాచలా ! ఎందుకో నీవింత మాయ నిద్రలో నున్నావు ! నీకే సొంతమైన నన్ను దుష్టులు నా అభీష్టంనకు వ్యతిరేకంగా తీసుకునిపోతుంటే నీవు చూస్తూ పరాకుగా ఉన్నావు. ఇది నీకు న్యాయం కాదు.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! అలా నిద్రపోతున్నావు ఏమిటీ? నన్ను ఇంద్రియాలు బయటకు లాక్కొని పోతున్నాయి. నన్ను నాశనం చేసేస్తున్నాయి, నన్ను పతనం చేసేస్తున్నాయి. భవిష్యత్తులో ఎన్నో జన్మలు రావటానికి కారణమైన విషయాలలో నన్ను ముంచేస్తున్నాయి. ఒక ఇంద్రియాన్ని కూడా నేను కంట్రోల్ చేసుకోలేకపోతున్నాను. నన్ను పతనం చేసి ఎక్కడకు లాగుకొని పోతున్నాయో నాకు తెలియడం లేదు. నిన్ను నమ్ముకొని ఇక్కడకు వచ్చాను. నీవేమో ఏమీ

తెలియనట్లు మాయనిద్ర పోతుంటే నన్ను ఎవరు రక్షిస్తారయ్యా! నీవే సర్వస్వం అనుకొని ఇక్కడకు వచ్చాను నిన్నే శరణాగతి కోరాను. నా భారమంతా నీ మీద వేశాను, నీవేమో తెలియనట్లు నిద్రనటిస్తున్నావు ఏమిటీ? ఇది నీకు న్యాయ సమ్మతమా, ధర్మమా! ఎంతకాలం ఇలా నిద్రపోతావు? నిజంగా నిద్రపోతున్నవాడిని లేపవచ్చుకాని నిద్ర నటించే వారిని ఎలా లేపగలం.

అరుణాచలేశ్వరుడా! నీ స్వభావం ఏమిటి సదా చైతన్యంగా ఉండటమే! అలాంటి నీకు నిద్ర ఉందా! ఇది నీ నటనయే కదా! ఇది నీకు శోభ నివ్వదు వయ్యా! లేచి నన్ను కాపాడి అనుగ్రహించు ఈ ఇంద్రియాల బారి నుండి రక్షించు అని వేడుకోమంటున్నారు రమణస్వామి.

## 11. పంచేంద్రియ ఖలులు మదిలోన దూరుచో, మదిని నీ వుండవో అరుణాచలా

**భావం :** ఓ అరుణాచలా! పంచేంద్రియాలను దొంగలు నీ స్థానమైన నా హృదయంలో జొరబడినపుడు అచ్చట ఆ హృదయంలో సాక్షివైన నీవు లేకపోయితివా?

**నాన్నగారు :** ఓ అరుణాచలా! పంచేంద్రియాలను దొంగలు నీ స్థానమైన నా హృదయంలో జొరబడుతున్నారయ్యా అక్కడ నీవు ఉన్నావు కదా! మరి యజమాని ఉండగా దొంగలు రావటానికి సాహసం చేస్తారా? ఈ మనస్సు ఎవరి వస్తువు?

అది నీదే కదా, దానిని ఈ పంచేంద్రియాలు అనే దొంగలు బయటకు లాగేస్తున్నాయి. ఈ ఇంద్రియాలను దొంగలు అంటున్నారేమిటి భగవాన్. ఇవి నావే అనుకుంటున్నాం మనస్సు నాదే అనుకుంటున్నాం. మరి నా జేబులో ఉన్న డబ్బుని నేనే తీసుకుంటూ ఉంటే నన్ను దొంగ అంటున్నారు ఏమిటీ భగవాన్. ఈ దొంగలు నా మదిలో ప్రవేశిస్తే ఆ మదిలో నీవుండవు నీవు బయటకు వెళ్ళిపోతావు.

మనవేమని అనుకుంటున్నాం ఈ ఇంద్రియాలు స్మశానంలో కాలిపోతాయి అనుకుంటున్నాం. ఇవి అగ్నిలో కాలవండి జ్ఞానాగ్నికి మాత్రమే కాలిపోతాయి. నేనేమో ఒకోసారి జాగ్రత్తగా ఉంటాను ఒకోసారి అజాగ్రత్తగా ఉంటానయ్యా, నువ్వు మాత్రం జాగ్రత్తగా ఉండవయ్యా! నువ్వు అజాగ్రత్తగా ఉంటే ఈ ఇంద్రియాలనే దొంగలు నా కొంప ముంచేస్తాయి. నిన్ను కూడా మోసం చేసే లక్షణాలు ఈ ఇంద్రియాలకు ఉన్నాయి.

గీతలో పరమాత్మ చెప్పాడు మనస్సు అనేది భగవంతుడి సొత్తేనని, ఇంద్రియాల సొత్తు కాదు. అందుకే ఇంద్రియాలను దొంగలు అన్నారు. జీవుడు నావాడే! జీవుడికి పుట్టిల్లు ఆత్మే కాని ఇంద్రియాలు కాదు. దేవుడు సొత్తు అయిన మనస్సుని ఈ ఇంద్రియాలు దోచుకొనిపోతున్నాయి. మరి నీ సొత్తు నీవే కాపాడుకోవయ్యా! అంటే ఎవరైతే తన మనస్సుని ఈశ్వరుడి చింతనలో ఉంచితే ఈ ఇంద్రియాలు ఏమీ చేయవు

ఎందుకంటే ఆయన సొత్తుని ఆయనే కాపాడుకుంటారు అంటున్నారు రమణస్వామి.

## 12 ఒకడవౌ నిను మాయ మొనరించి, వచ్చువా రెవరిది నీ జాల మరుణాచల ॥అరుణాచల శివ॥

**భావం :** అరుణాచలా ! సర్వవ్యాపుడవగు ఏకాంత స్వరూపుడు అయిన నిన్ను మాయచేసి (కళ్ళుగప్పి) అట్టులోనికి రాగల సమర్థుడెవరు? ఇది నీ యొక్క మాయాజాలమే గాని వేరు కాదు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! ఉన్నది నీవు ఒక్కడివే నీవే సర్వవ్యాపకుడవు, ఏకాత్మస్వరూపుడివి అట్టి నీ కళ్ళుగప్పి నా లోపలకు రాగల సమర్థులెవరు? ఇదంతా నీలీలే, నీమాయా జాలమే తప్ప వేరు కాదు. నా హృదయంలో అంతర్యామిగా ఉన్నవాడవు నీవేకదా నీకు తెలియకుండా నా రాగద్వేషాలు నా ఇంద్రియాలు నన్ను ఇబ్బంది పెడతాయా. అంతర్యామిగా ఉండి దేహప్రారబ్ధాన్ని బట్టి మమ్ములను ఆడిస్తున్నావు. నీ ఆజ్ఞ లేకుండా సృష్టిలో ఏ కార్యమైన జరుగుతుందా? నిన్ను మాయ చేయగల శక్తి ఎవరికి ఉన్నదయ్యా! నీవే నీ యొక్క మాయాజాలంలో మమ్మల్ని ప్రారబ్ధాన్ని అనుభవించేటట్లు చేస్తున్నావు.

నీ ఇంద్రజాలం నుండి నీ మయాజాలం నుండి తప్పుకునే శక్తి ఈ జీవుడికి వుందా? మేం ద్వంద్వాలలో పడి





కొట్టుకునేటట్లు చేస్తున్నావు ఇది అంతా నీ క్రియేషన్. ఇందులో నుండి బయటపడాలి అంటే నీ పాదాలకు శరణాగతి చేయాలి కదా. అప్పుడు నీవు నీ మాయకి ఆజ్ఞని ఇస్తావు. వీళ్ళు ఏదో కష్టపడుతున్నారు నా పాదాలకు శరణాగతి అవుతున్నారు దారి ఇవ్వు అని, అప్పుడు కదా ఈ జీవుడికి విడుదల అంటున్నారు భగవాన్.

## 13 ఓంకార వాక్యార్థ ఉత్తమసమహీన, నిన్నెవ రెరుగు వా రరుణాచలా

**భావం :** అరుణాచలా! ఓంకార శబ్దం యొక్క అంతరార్థ తత్వంగా, నీకు సరితూగగలవారు గాని, నిన్ను మించిన వారు గాని ఎవ్వరూ లేక వెలింగెడి వాడా నిన్ను నిజముగ నెఱుగు శక్తి గలవారెవరు? అటువంటివారున్నారా?

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! ఓంకార వాక్యానికి అర్థమే నువ్వు. నీకు సరితూగ గలిగినవారు ఎవరున్నారయ్యా నీతో సమానమైన వారే లేనప్పుడు నిన్ను మించినవారు ఎవరు ఉంటారు అయ్యా! అలాంటి నిన్ను తెలుసుకొనగలవారు ఎవరు ఉన్నారు? నీకై నీవు ఎఱుక పడితే మేము నిన్ను తెలుసుకోగలమే కాని మా తెలివితేటలతో నిన్ను తెలుసుకోలేం కదయ్యా. ఎవరైతే త్రిగుణాలు దాటారో ఎవరైతే ప్రకృతిని దాటారో వారికి మాత్రమే నీవు ఎఱుకపడతావు. జీవలక్షణాలు ఏమిటి మూడు గుణాలు, మూడు అవస్థలు, మూడు శరీరాలు.

జీవుడు ఎప్పుడూ ఏదో ఒక గుణంతోనో, ఏదో ఒక శరీరం తోనో, ఏదో ఒక అవస్థతోనో తాదాత్మ్యం చెందుతూ ఉంటాడు. ఇలాంటి ప్రకృతి గుణాలలో ఉన్న జీవుడికి పరమాత్మ స్వరూపం ఎఱుక పడటం సాధ్యమా.

ఎవరు తమ ధ్యాస, ద్యానంతో విచారణ చేస్తున్నారో, భగవంతునికి శరణాగతి అవుతున్నారో వారికి మాత్రమే నీవు తెలియబడతావు. అప్పుడు జీవుడి యొక్క అహంకారం (దేహంతో తాదాత్మ్యం) నశించి ప్రశాంతమైన మౌనస్థితికి, అమనస్కస్థితిని చేరుకుంటారు. ఎక్కడ ఆలోచనలు లేవో, ఎక్కడ మాటలు లేవో అది మాత్రమే పూర్ణస్థితి అవుతుంది. అట్టి స్థితిలోకి జీవులను మేల్కొల్పటానికి అవతరించిన అరుణాచలేశ్వరుడుని నీ యొక్క కృపావీక్షణాలను ఈ జీవులపై ప్రసరింపచేసి నీ స్వరూపానుభవం ప్రసాదించమని వేడుకుంటున్నారు భగవాన్.

## 14 అవ్వ బోలె యొసగి నాకు నీ కరుణ, న న్నేలుట నీభార మరుణాచలా

**భావం :** అరుణాచలా! ప్రేమలో మిన్నయైన తల్లివంటి నీవే దిక్కు అనుచు వచ్చిన నాకు నీ సహజమైనటువంటి కరుణ ప్రసాదించి, నిన్నే శరణొందిన నన్ను అనుగ్రహించి పాలించి నన్నేలుట నీ భారమే అగును.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నీవే దిక్కంటూ నీ సన్నిధికి వచ్చాను. నేను నిన్నే శరణొందాను. నీవు జీవులను ప్రేమించుటలో, అనుగ్రహించుటలో ఎంతో మిన్న అయిన వాడవు. నిన్నే శరణు అంటూ దరిచేరిన నన్ను నువ్వు ఎలా అనుగ్రహిస్తావు అంటే "అవైయార్" అను భక్తురాలిని ఎలా అనుగ్రహించావో పెరియపురాణంలో తెలుసుకున్నాను అలా నన్ను నీవు నీ ప్రేమతో కరుణతో అనుగ్రహించు.

భగవాన్ పెరియపురాణం చదివి అందులో 63 మంది నయనారులను అరుణాచలేశ్వరుడు ఎలా అనుగ్రహించారో తెలుసుకొని, ఆయన అర్ధభాగమైన మీనాక్షి దేవికి మొరపెట్టు కునేవాడు నేను ఈ 63 మందిలో ఒకరినైనా అవుతానా అని. మరి తల్లి తన బిడ్డ యొక్క మొర ఆలకించకుండా ఉంటుందా! అమ్మ అనుగ్రహంతోపాటు నీ అనుగ్రహం కూడా కలిపి నన్ను రప్పించుకున్నావు. అవైయార్‌ను ఎలా అనుగ్రహించావో అలా నన్ను ఏలుకొనుట నీదే భారమయ్యా అరుణాచలా అంటున్నారు భగవాన్.

భగవాన్ ఆర్తి ఎలా ఉండేది అంటే మధురమీనాక్షి గుడికి వెళ్ళి 63 మంది నయనారుల విగ్రహాలను చూచి వాళ్ళలో తాను ఒకడిగా కావాలని వేసుకున్న షర్ట్ తడిచి పోయేటట్లుగా కన్నీరు కార్చేవారంట. భక్తుడిని భగవంతుడు ఎప్పుడు ఎలా అనుగ్రహిస్తాడు అంటే. తల్లి తన బిడ్డ ఆడుకోవటానికి

బొమ్మలు ముందు వేసి తన పనులు చేసుకుంటుంది. బిడ్డ వాటితో ఆడుకున్నంతసేపు ఆడుకొని వాటిమీద విసుగుచెంది అమ్మే కావాలని ఏడుస్తాడు. అప్పుడు ఆ తల్లి వచ్చి వాడిని ఎత్తుకొని లాలిస్తుంది. అలాగే భక్తుడు ఈ ప్రపంచ ఆకర్షణలకు విరక్తి చెంది ఎప్పుడైతే పరమాత్మ కోసం ఏడుస్తాడో అప్పుడు పరమాత్మ వాడిని దగ్గరకు తీసుకొని ప్రేమతో అనుగ్రహిస్తాడు అని అంటున్నారు భగవాన్.

## 15 కన్నుకు కన్నయి కన్నులేక కను నిన్, గనువా రెవరు గను మరుణాచలా

**భావం :** అరుణాచలా! ప్రపంచంలోని సమస్తమును చూడ గలిగే కంటికి కూడా వెలుగునిచ్చే కన్నువై వెలుగొందువాడా? నేత్రములు లేకనే సర్వమును చూడగల నిన్ను కనువారెవరు? అలాంటివారు ఎవరైనా ఉన్నారేమో చూడవయ్యా!

**నాన్నగారు :** ఓ అరుణాచలా! కళ్ళు లేకుండా చూసే నిన్ను చూడగలిగినవారు ఎవరైనా ఉన్నారేమో చూడవయ్యా! కళ్ళు లేకపోయినా మమ్ములందరినీ, మా మనస్సులో ఉన్నవన్నీ చూస్తున్నావు. మాకు కళ్ళు లేకపోతే మేము ఏమి చూడలేము అయ్యా. లోకంలో ఎక్కడ ఏమి జరిగినా నీవు చూడకుండా మూయలేం. మా లోపల ఏముంది, బయట ఏముంది లోకంలో ఎక్కడ ఏమి జరుగుతుంది ఏ మనిషి దేహప్రారబ్ధాన్ని అనుసరించి ఎలా ఆడించాలి, నీవు కళ్ళు లేకుండానే అన్నీ

చూస్తున్నావు. అసలు కళ్ళు లేకుండా చూసే నిన్ను చూడగల వాడు ఎవరైనా ఉన్నాడేమో చూడు అరుణాచలా! బ్రాహ్మిస్థితి పొందిన వాడు తప్పించి నిన్ను చూడగలవారు ఎవరూ లేరు. బ్రాహ్మిస్థితి పొందిన వారికొక్కరికే అరుణాచలేశ్వరుడి వైభవం తెలుస్తుంది కాని మనకు తెలియదు.

జీవుడు వాడికి ఉన్న అహంకారంతో నిన్ను గాంచలేడు. నీ కృప లేకుండా నిన్ను చూడలేమయ్యా. కన్ను లేకనే సర్వం చూడగల ఈ సత్యదృశ్యం చాలా విచిత్రమైనదివయ్యా. అసలు చూడటానికి కారణమైన చైతన్యం లేకుండా దృశ్యం కనబడు తుందా. అంటే చూచేది కన్ను అయినా దానికి ఆధారంగా ఉన్నది చైతన్యమే. భౌతికమైన నేత్రములతో నిన్ను చూడలేం ఎప్పుడైతే ఈ సృష్టికి ఆధారమైన చైతన్యంతో, తాదాత్యం పొందుతామో అప్పుడు మాత్రమే నిన్ను చూడగలమయ్యా అరుణాచలా! అలాంటి చైతన్యంలోకి జీవులను నడిపించ డానికి ఈ మాటలు చెబుతున్నారు రమణస్వామి.

నీవు కళ్ళు లేకుండా చూడగలవు, చెవులు లేకుండా వినగలవు. నోరు లేకుండా మాట్లాడగలవు. అలాంటి నిన్ను మా తెలివితేటలతో ఎలా తెలుసుకోగలమయ్యా, అది నీ యొక్క అనుగ్రహం చేతనే జీవుడికి నిన్ను చూడగల జ్ఞాననేత్రం ఇస్తావయ్యా. జీవుడిలోని అజ్ఞానం నశింపచేసి సత్యాన్ని అవగతం చేస్తావు. అలాంటి జీవులు ఎవరైనా ఉన్నారేమో చూడవయ్యా అంటున్నారు రమణస్వామి.

## 16. కాంతమినుమునువలె గవిసి నన్ విడువక,
## కలసి నాతోనుండు మరుణాచలా

**భావం :** అరుణాచలా! అయస్కాంతపు రాయి తన ఆకర్షణ శక్తి చేత, ఇనుమును తనవైపు లాగుకొనునట్లు, ఎల్లప్పుడు బహిర్ముఖం అవుతున్న మా మనస్సును నీవు కూడా అయస్కాంతమువలె నీవైపునకు ఆకర్షించుకొని వదలకుండ నాతో ఏకమయి ఉండుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! అయస్కాంతం తన ఆకర్షణ శక్తి చేత ఇనుమును తన వైపు లాగుకొను విధముగా, ఎప్పుడూ బాహ్య విషయాల ఆకర్షణలో పడిపోయిన మా మనస్సులను నీవు కూడా అయస్కాంతం వలె ఆకర్షించుకొని వదలి పోకుండా మాతో ఏకమై ఉండవయ్యా అని అడుగుతున్నారు భగవాన్.

మాకున్న అల్పబుద్ధితో, అల్పమైన మనస్సుతో నిన్ను చేరగలమా! మాకెన్నో ఆకర్షణలు, ఈ రోజు ఒకలాగా ఉంటాం రేపు ఇంకోలాగా ఉంటాం. మాకు ఎప్పుడు విషయచింతనే, ఇంక మేము నిన్ను ఎలా చేరగలం అయ్యా! నీవే నీ అనుగ్రహంతో ప్రపంచ విషయాలపట్ల విరక్తి కలిగించి నీపై ఆకర్షణ కలిగేటట్లు చేయవయ్యా. మరి ఎప్పుడు విరక్తి కలుగుతుంది విషయాలపట్ల? ఈశ్వరుడు మనకు బాగా ఇష్టమైన వాళ్ళతో మనని తిట్టిస్తాడు. మనకున్న మమకారం తీసేయడానికి. జీవులను కట్టిపడేసే ఈ అహంకార

మమకారాల నుండి బయటపడాలి అంటే వాటిలోని నిస్సారత మనకు అర్థం అవ్వాలి కదా! అందుకే అరుణాచలేశ్వరుడు గురురూపములో మనలను తనవైపు ఆకర్షించుకొంటాడు. జీవితంలో నిత్యా, అనిత్యాల వివేకాన్ని తన బోధల ద్వారా తెలియపరుస్తాడు. బాహ్యముఖంగా పరుగెడుతున్న మనస్సును అంతర్ముఖం చేసి హృదయగుహలో ఉన్న పరమాత్మతో అనుసంధానం చేస్తాడు. ఇంక ఆ పరమాత్మ చింతనలో ఉన్న భక్తుడు బాహ్యాకర్షణలకు లొంగడు. పరమాత్మతో కలిసి వుండాలని ఆయనను తన నుండి దూరం చేయవద్దు అని భక్తుడు అరుణాచలేశ్వరుడుని వేడుకొనేటట్లు చేస్తాడు.

## 17. గిరి రూపమైనట్టి కరుణాసముద్రమా, కృపచేసి నన్నేలు మరుణాచలా

**భావం :** అరుణాచలా! చర్మ చక్షవులకు కఠినమైన రాతి కొండవలె కన్పించిననూ, జ్ఞాన చక్షువులకు అతి మృదు స్వభావం గల కరుణా సముద్రునివలె కనబడుచున్నావు. నీ కృపను ప్రేమతో నాకు అనుగ్రహించి నన్నేలుకో!

**నాన్నగారు :** ఓ అరుణాచలా! పైకేమో రాళ్ళ గుట్టలాగా, రాతి కొండలాగా కన్పిస్తున్నావు. కాని లోపలచూస్తే నీవు కరుణాసముద్రుడువి, దయాసముద్రుడువి, మృదుస్వభావం కలవాడివి కదయ్యా. మమ్ముల్ని మాయలో పెట్టటానికి పైకి రాతి కొండలాగా కనుబడుతున్నావు. నీ సహజ లక్షణం ఏమిటంటే జీవుల అహంకారాన్ని తీసేసి మోక్షమివ్వటం.

జీవులలో ఉన్న అవలక్షణాలన్నీ బయటకి తెలిసేటట్లు నీవు చెప్పకుండానే మాకు తెలియపరుస్తున్నావు. ఏమి దయ చూపుతున్నావు అరుణాచలా! నీ దగ్గర ఉన్నదే కరుణ, నీ దగ్గర ఉన్నదే అనుగ్రహం. నీ చూపు అనుగ్రహం, నీ స్పర్శ అనుగ్రహం, నీ మాట అనుగ్రహం అంతా అనుగ్రహమే. ఎప్పుడు మౌనంగానే ఉంటావు కాని మాట్లాడవు. ఇందులో ఒక రహస్యం ఉంది, మనోనిగ్రహం సాధించాలి అనుకున్న వాళ్ళు తక్కువ మాట్లాడటం మంచిది. అధికంగా మాట్లాడే వాళ్ళకి, మనోనిగ్రహం కష్టమవుతుంది. మితంగా మాట్లాడటం వలన మనోనిగ్రహం కలుగుతుంది.

అరుణాచలేశ్వరుడి వైభవం ఏమిటంటే పైకి మౌనంగా, గంభీరంగా, అచలంగా కూర్చునప్పటికి అక్కడకు వెళ్ళేసరికి ఆ గిరి నుండి వచ్చే జ్ఞాన తరంగాలు, కాంతి తరంగాలు జీవుడిని ఉత్తేజపరిచి జన్మకు కారకాలను విశ్లేషించేటట్లుగా చేసేస్తాడు. ఇది అంతా మౌనంగానే జరిగిపోతుంది. అలాంటి కృపగల వాడివయ్యా నువ్వు. మరి నీ దరికి వచ్చిన జీవుడిలోని జీవలక్షణాలను తీసేసి నీ యొక్క కృపతో వాళ్ళను ఏలు కొంటావు కదయ్యా అంటున్నారు భగవాన్.

చాలామంది అరుణాచలంలో కన్నా ఇంట్లోనే బావుంది, ఇక్కడ భరించలేనంత ఆలోచనలు వస్తున్నాయి ఏమిటి అనుకుంటారు. మరి అరుణాచలేశ్వరుడు మీలో ఉన్న జీవ లక్షణాలను బయటకు చూపించి అప్పుడు వాటి నుండి

తప్పిస్తాడు అదే ఆయన కృప. నిరంతరం ఆ కొండను తలపెట్టుకుంటూ వుంటే మనలో ఉన్న ప్రపంచ ఆకర్షణలు దూరమవుతాయి. మన మనస్సు కదలని స్థితికి వెళ్ళి ద్వంద్వాలకు అతీతమవుతుంది అంటున్నారు భగవాన్.

## 18. క్రింద మీదెటను చెన్నొందు కిరణమణి నా క్రిందుగతిమాపు మరుణాచలా

**భావం :** అరుణాచలా! అంతటా వ్యాపించిన హద్దులు లేని అనంత కాంతిస్వరూపడవైన నీవు నా అజ్ఞానాంధకారాన్ని పోగొట్టుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నువ్వు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నావు. మా గుణాలు కాని, మా అర్హతలను కాని నీవు చూడవు. అందరి హృదయాలలో సమానంగా ఉన్నావు. కాని జీవులకు అనుభవంలో లేదు ఈ సత్యం.

గీతలో పరమాత్మ చెప్పినట్లు జీవుడు దేవుడివాడే ఆత్మ స్వరూపుడే. అజ్ఞానాన్ని పైన మూతగా పెట్టేసి హృదయంలో ఉన్న నిన్ను మాకు అనుభవంలోకి రాకుండా చేస్తున్నది కూడా నీవే కదా! అందరి హృదయాలలో అంతర్యామిగా ఉండి దేహప్రారబ్ధాన్ని పట్టి ఆడిస్తున్నావు. కనిపించేది అంతా నిజమనుకొని జీవిస్తున్నవాళ్ళం. మా శరీరాలు, మా గుణాలతో తాదాత్మ్యం చెందుతూ నీకు దూరమయిపోయాం. మాకు శరీరం మనస్సు అనుభవంలో ఉన్నాయి. కాని హృదయంలో ఉన్న నువ్వు అనుభవంలో లేవు.

మీ హృదయంలో ఉన్నది మీ యొక్క అజ్ఞానంతో మూసుకునిపోయి ఉంది. బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో ఎంత నీరు ఉందో అంత మహానందం మీలో ఉంది. దానిని మేల్కొల్పాలంటే ఈశ్వరానుగ్రహం, గురువానుగ్రహం కావాలి. నదికి వరద వచ్చినప్పుడు ఎంత వేగంగా వస్తుందో హృదయంలో ఉన్న ఆనందం మేల్కొన్నప్పుడు, ఆ ఆనందం అంతే వేగంగా నీ సహస్రారంలోకి వచ్చి ముంచేస్తుంది. అప్పుడు మీ మాట పడిపోతుంది. మీ సహస్రారం ఆనందం తోటి, శాంతి తోటి, కాంతి తోటి నిండిపోతుంది.

జీవుడి అజ్ఞానమే అన్ని అనర్ధాలకు మూలం. అజ్ఞానం అంటే దేహాత్మ భావనయే. తాను ఆత్మననే విషయం భగవంతుడి మాయ వలన మరుగున పడింది. అరుణాచలేశ్వరుడి యొక్క జ్ఞానకిరణాలను ప్రసరింప చేసి జీవుల అజ్ఞాన అంధకారాన్ని తొలగించమని భగవాన్ అరుణాచలేశ్వరుడిని వేడుకొనుచున్నారు.

## 19 కుత్రయంతయు గోసి గుణముగ పాలించు, గురురూప మైవెలు గరుణాచలా

**భావం :** అరుణాచలా ! జ్ఞానగురు స్వరూపముగా వెలుగొందువాడా నా అహంకార తప్పులన్నింటిని పూర్తిగా సమూలంగా నాశనం చేసి నన్ను గుణవంతునిగా అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నేను మోక్షం పొందటానికి మోక్షస్థితిని సంపాదించటానికి నా మనస్సులో ఉన్నటువంటి కుట్ర అంతా కూడా నీవు నా చేత కక్కించి దానిని బయటికి తొలిగించేస్తావు. అది ఈశ్వరుడు చేసే పని. అంటే మోక్షం పొందటానికి ఏ వికారాలు అయితే మాకు అడ్డు వస్తున్నాయో ఆ వికారాలు తొలగించే పని నువ్వు చేస్తావు. నిన్నుస్మరించటం వలన మాకు వచ్చే లాభం అది. కృష్ణుడు కూడా గీతలో చెప్పాడు భగవంతుని స్మరించినవాడికి, పదిమందికి ఉపయోగపడే పనులు చేసిన వాడికి దుర్గతి లేదు సద్గతే అని. అయితే మీరు ఏదైనా మంచి పనిచేశారు అనుకోండి మీరు ఆశించకపోయినా ఫలితంవస్తుంది. ఫలితం ఈశ్వరునికి అక్కర లేదు. మీరు చేసినది మీకే ఇచ్చేస్తాడు.

నాలో ఉన్న కుట్ర అంటే నాలో ఉన్న ద్వంద్వాలను, నాలో ఉన్న చెడ్డ గుణాలనన్నింటిని తీసేసి నన్ను పవిత్రుడిని చేయి నన్ను మంచిగుణాలతో అలంకరించు అరుణాచలా!

చైతన్యంలో ద్వంద్వాలు ఏమీలేవు అన్నీ నీ మనసులోనే ఉన్నాయి. చైతన్యస్థితి అంటే గుణాలు లేనిస్థితి. చెడ్డగుణాలు ఉంటే చైతన్యస్థితిని అందుకోలేవు. మంచి అలవాట్లు మంచి గుణాల వల్ల మీలో ఉన్న చైతన్యం యొక్క ఎఱుక మీకు తెలుస్తుంది. రాముడు మర్యాద పురుషోత్తముడు, అన్నీ కళ్యాణ గుణాలే ఆయనను తలపెట్టుకోవడం వల్ల లోపలవున్న సత్యాన్ని తెలుసుకోవడం తేలిక అవుతుంది.

మన మనస్సు మాట చేత ఒకటిగా ఉంటే ఈశ్వరుని దయకు పాత్రులవుతాం. నువ్వు మాట్లాడేమాట నీ మనస్సులో వచ్చే తలంపులు, నీవు చేసే పనులు ఈశ్వరుని యొక్క అనుగ్రహానికి అనుగుణంగా వుండాలి అప్పుడు నది వెళ్ళి సముద్రంలో ఐక్యమయినట్లు మిధ్యా నేను నశించిపోతుంది. సాధారణంగా మానవులు అహంకారం కోసమే పనిచేస్తారు. కాని దాన్ని తీసి ప్రక్కన పెట్టి ఈశ్వరుని అనుగ్రహం కోసమే జీవిస్తే, వాడు తరిస్తాడు. మన లోపల ఉన్న సత్యం ఎఱుక లోనికి రాకుండా ఏ బలహీనతలు అడ్డు వస్తున్నాయో వాటిని తొలగించమని వేడుకోవాలి. నాలో ఉన్న ఈ జీవలక్షణాలన్నీ కోసివేసి నన్ను గుణవంతుడిని చేయి. నన్ను నీ అనుగ్రహానికి పాత్రుడుగా చేయి అరుణాచలా! అంటూ వేడుకోమని అంటున్నారు భగవాన్.

## 20 కూచి వాల్గన్నుల కోతబడక, కృప చేసినన్ జేరి కా వరుణాచలా

**భావం :** అరుణాచలా! పదునైన కత్తికి సరిసమానమైన కంటి చూపు గల వంచకులు విసిరిన వలలో పడి చిక్కి బాధ పడకుండ, నీ యొక్క కరుణతో నన్ను వారి బారినుండి నన్ను రక్షించి అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నేను వంచకుల బారిన పడకుండా నీవే నన్ను రక్షించు. నాకు దొరికే స్నేహాలు కూడా మంచిగా వుండేటట్లు ఆశీర్వదించు. నేను ఆధ్యాత్మికంగా

బాగుపడే స్నేహితులను నాకు అనుగ్రహించు. నాకున్నది కొద్దిపాటి భక్తి ఆ భక్తిని పడగొట్టే వాళ్ళతో నాకు సహవాసం ఏర్పాటు చేయకు. నాకున్న భక్తిని పెంచి పోషించే వాళ్ళను నాకు స్నేహితులుగా చేయి. ఒకవేళ నేను చెడు స్నేహాలు పట్టి పూర్తిగా పాడైపోతానేమో కొంచెం దయతో చూడు, నేను పూర్తిగా పాడైపోయిన తరువాత నన్ను ఏమి బాగుచేస్తావు. కుళ్ళిపోయిన కాయి తినటానికి పనికిరాదుకదా ! అందుకే నేను చెడ్డ మార్గములోకి వెళ్ళకుండా నన్ను వంచించి, మోసగించి ఇంకా ఇంకా పాపంలోకి తీసుకువెళ్ళే దుష్టుల బారిన నన్ను పడనివ్వకుండా రక్షించు అరుణాచలా! దుష్టులు, వంచకులు ఎవరండీ మన అరిషడ్వర్గాలే బయట వంచకుల బారి నుండి తప్పించుకోవచ్చేమో కాని మనలోని దుష్టవాసనల నుండి బయటపడడం కష్టం. అందుకే ఓ అరుణాచలా! నేను పూర్తిగా కుళ్ళిపోకముందే నీ కృప వర్షించి ఈ కాయను పండుగా మగ్గించి నువ్వు మింగివేయి అరుణాచలా! రోగంతో ఉన్నప్పుడు డాక్టరు కావాలి కాని రోగంతో చచ్చిపోయిన తరువాత డాక్టరు వస్తానంటే ఏమి లాభం. నేను మాయగాళ్ళ వలలో పడకుండా నాకున్న ఈ భవరోగం లోనుండి బయటకు తీసుకొని రా అరుణాచలా! నీవు దయతో నన్ను అనుగ్రహించి రక్షించకపోతే నేను ఈ మోసగాళ్ళు, వేటగాళ్ళ వలలో పడిపోయి జన్మ పరంపరలో కొట్టుకుపోతాను. నన్ను అలా వదిలేస్తావా ! నన్ను ఈ ప్రకృతిలో కొట్టుకొని పోకుండా నీ

యొక్క కృప చూపి నన్ను రక్షించి నీవానిగా చేసుకో అరుణాచలా ! అని అంటున్నారు భగవాన్.

## 21 వంచకా వేడియున్ కొంచెమున్ కరుగవే, అభయమం చేలుమా అరుణాచలా

**భావం :** అరుణాచలా! కఠినమైన రాయి కూడా కరిగి పోవునట్లు నేను ఎంతగా వేడుకొన్నా, నీవు నాపై కొంచమైనను జాలినిగాని, దయగాని చూపించకున్నావు. నా కొరకు యిప్పుడైనను కనికరించి, నీ అభయహస్తముతో నన్ను అనుగ్రహించుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! నీవే దైవమని నమ్మి నీ దగ్గరకు వచ్చాను. ఏమిటి నా మొర నీకు వినపడడం లేదా, రాయిలాగా ఉలుకూ పలుకూ లేకుండా కూర్చున్నావేమిటి? నువ్వే నీ వైపు ఆకర్షింపబడేటట్లు చేసావు. మరి ఇదేమిటి నేను ఇంతగా వేడుకుంటున్నానే నీవు నీ అనుగ్రహాన్ని వర్షించుట లేదు. ఎంత కఠినమైన బండరాయి కూడా కరిగిపోతుంది కదయ్యా భక్తుడు యొక్క మినహాయింపులు లేని వేడుకోలుకి. కాని నీవేమిటి నా మీద, జాలిగాని దయగాని చూపించుట లేదు. నేను అల్పుడనే, కానీ నిన్నే నమ్ముకొని, నీవే శరణని రక్షింపమని వేడుకొంటున్నాను. ఒక వేళ నాలో ఏదైనా ఇంకా లోటుపాట్లు, తప్పుఒప్పులు ఉంటే నువ్వే అనుగ్రహించి వాటిలోనుండి నన్ను బయట పడవేయి. ఇది

అంతర్యామిగా ఉన్న నీకు సాధ్యం కాని జీవుడిని నాకెలా సాధ్యమౌతుంది. అరుణాచలేశ్వరుడా నువ్వే దిక్కు అని, నీవే గతి అని నమ్మి నిరంతరం నిన్నే జపిస్తూ, నీకై తపిస్తూ ఉన్న భక్తుడిని నీవు వదిలిపెట్టవు. వాడిలో తగిన పరిపక్వత వచ్చే వరకు వాడిని పరీక్షలకు గురిచేసి వాడిని పూర్ణశరణాగతి అయ్యేట్లు చేసి వాడిని నీ అనుగ్రహానికి పాత్రుడిని చేస్తావు. ఈ ప్రక్రియలో జీవుడు ఎంతగా ప్రార్థించినా విని కూడా విననట్లు ఉంటావు. హృదయంలో వాడు డిసర్వ్ అయ్యే వరకు వారిని ప్రిపేర్ చేసి అప్పుడు నీ అభయహస్తం వేసి వాడిని నీలో ఐక్యం చేసుకుంటావు అరుణాచలా! ఇది అంతా నీ యొక్క ప్రేమే అని మాకు అర్థము అవ్వాలి కదా! అంటున్నారు భగవాన్.

## 22. అడుగ కిచ్చెడు నీదు అకళంకమగు కీర్తి, హానిసేయకబ్రోవు మరుణాచలా

**భావం :** అరుణాచలా! భక్తులు నిన్ను అడగకుండానే వారి అభీష్టములను తెలుసుకుని నెరవేర్చువాడవను పేరుప్రతిష్ఠలకు భంగం రాకుండా నామొర ఆలకించి నన్ను అనుగ్రహింపుము.

**నాన్నగారు :** అరుణాచలా! ఒక వేళ నాకేమయిన అవసరాలు ఉన్నాయి అనుకో అడిగించుకొని ఇవ్వకు. మా హృదయంలో ఏదో సత్యం ఉంది అని చెబుతున్నారు కాని అది మాకు తెలియడం లేదు మీరు అనుగ్రహిస్తారా! అని భగవాన్‌ని

అడిగితే, అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది. సహాయం చెయ్య మని గురువుని అడగవలసిన పనిలేదు. అరుణాచలేశ్వరుడుకి అడగకుండానే ఇచ్చే గుణముంది. మనతో అడిగించు కోకుండానే మన మనస్సులో ఉన్నది గ్రహించి ఇచ్చేస్తాడు. అది ఆయన కృప.

అరుణాచలా! నీవు చాలా గొప్పవాడవు, కీర్తిమంతుడువి అని చెప్పుకుంటున్నారు. మరి ఇప్పుడు నా చేత అడిగించుకొని కానీ ఇవ్వవు అనుకో, నాకేమీ నష్టము లేదు. నీ గౌరవానికే భంగం. నాకసలు గౌరవం ఉంటే కదా పోవటానికి నీకు గౌరవం ఉంది కదా అది పోతుందివయ్యా! నా చేత అడిగించుకొని ఇవ్వకపోతే, మా అహంకారాలకు గౌరవం ఏమిటి. ఈ అబద్ధమైన నేనుకు గౌరవాలు ఏమిటి. అది ఊరికే అలంకరించుకుంటుంది. అందుచేత నాకేమీ నష్టం లేదు నీకే నష్టం. ఉనికే లేని జీవుడికి గౌరవాలు, అగౌరవాలు ఏమిటి. నాకు ఇవ్వవలసిన శాంతిని, సుఖాన్ని నాతో అడిగించుకోకుండా ఇవ్వవయ్యా!

ఓ అరుణాచలేశ్వరుడా! మాకు మంచి ఏదో చెడు ఏదో ఏమీ తెలియదు. మా అహంకారాలు ఏమైనా కోరుకుంటే అవి ఎలాగూ ఇవ్వవు. కాని నీకు శరణాగతి అయ్యి నీవే దిక్కు, నీవు ఏది ఇస్తే అదే ప్రసాదంలా, నీ ఇచ్ఛయే నా ఇచ్ఛ అనుకునేలాగా నన్ను తయారుచేసి నీకు అపకీర్తి రాకుండా

కాపాడుకోవయ్యా. నా శరీరాన్ని నీవు ఎలావాడుకుంటావో నీ ఇష్టం దీనిని నీకు అప్పచెపుతున్నాను. నాకు ఇది కావాలి అది కావాలి అని అడుగను నా అవసరాలు ఏమిటో నాకు అత్యంత సమీపంగా ఉన్న నీకే ముందు తెలుస్తాయి కదా! మాకు ఏది మంచిదో మాకంటే నీకే బాగా తెలుసు అందుకే నీ గౌరవానికి భంగం రాకుండా నన్ను నీవు అనుగ్రహించి అక్కున చేర్చుకో అరుణాచలా అంటున్నారు భగవాన్. భక్తుడు భగవంతుడి చేతిలో పనిముట్టులా ఉంటే ఆయన హాని చేస్తాడా! లేదు అనుగ్రహిస్తాడు.

## 23. హస్తామలక నీదు సద్రసమున, సుఖో న్మాద మొందగ యేలుమరుణాచల

**భావం :** అరుణాచలా! నా చేతిలో దొరికిన స్వరూప ఫలమైన నీ యదార్థమైన స్వరూపరసానుభవ మధువును గ్రోలి ఆనందానుభూతిని పొంది మైమరచి యుండనట్లు నన్ను అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! నీ అనుగ్రహము వలన నా అరచేతిలో ఉన్న వస్తువుని స్పష్టంగా చూసినట్లుగా, నీ యొక్క యదార్థస్వరూపం నాకు అనుభవంలోకి వచ్చేటట్లు చేసి, ఆ సుఖంలో నన్ను నేను కోల్పోయేటట్లు చేయి తండ్రి. అరచేతిలో ఉన్న ఉసిరికఫలంను ఎంత స్పష్టంగా చూస్తానో, అంత స్పష్టంగా నీ యొక్క అనుగ్రహాన్ని చూస్తూవుంటే, మనస్సు

నీలో ఐక్యమయి పోకుండా ఉంటుందా అంటున్నారు భగవాన్. ఒకసారి నరేన్ రామకృష్ణుడుని అడుగుతాడు. మీరు దేవుడిని చూచారా అని. అప్పుడు రామకృష్ణుడు అంటాడు. నువ్వు నన్ను ఎంత స్పష్టంగా చూస్తున్నావో నేను భగవంతుడిని అంత స్పష్టంగా చూచాను అంటారు. ఆప్పటివరకు నరేన్ అటువంటి సమాధానము వినలేదు.  అంటే అరచేతిలో ఉసిరికఫలం ఎంత స్పష్ఠంగా కన్పిస్తుందో అంత స్పష్టంగా రామకృష్ణుడు భగవంతుని చూడవచ్చు అని చెప్పినప్పుడు, రామకృష్ణుని యొక్క సమాధానంలో ఆయనలో ఉన్న ఏకాగ్రత పవిత్రత గోచరించాయి నరేన్‌కి.

అంటే బాహ్యంగా భగవంతుడిని ఎంతసేపు చూస్తాడు జీవుడు. కాని హృదయంలో ఉన్న పరమాత్మతో ఏకమయితే నిత్యమూ స్వరూపానుభవంలో ఓలలాడుతాడు. భగవంతునితో మానసిక అనుబంధం ఉంటే మన కుడిచేయి ఎడమచేయిని తాకితే ఆ టచ్ ఎలా ఉంటుందో అలా ఆయన టచ్ మనకు అనుభవంలోనికి వస్తుంది. మరి మన హృదయంలో ఉన్న పరమాత్మ యొక్క స్వరుపానుభవం కలగాలంటే గురువు యొక్క అనుగ్రహం కావాలి. గురువే తెలియచేస్తాడు ఆ టచ్ నీకు.

సముద్రంలో ఎంత నీరు ఉందో నీహృదయంలో అంత శాంతి ఉంది. అది నీ సహస్రారాన్ని ముంచెత్తాలి అంటే గురువు యొక్క అనుగ్రహం, భగవంతుని యొక్క కృప కావాలి.

జీవుడు భగవంతుడినో లేక గురువునో విశ్వసించి ఆయనకు శరణాగతి అయితే ఆ స్వరూపానందంలో తనని మరిచి పోతాడు జీవుడు అంటున్నారు భగవాన్!

**24 వల నుంచి భక్తుల పరిమార్చు నినుగట్టు
కొని, యెటు జీవింతు నరుణాచలా ! ॥అరుణాచల శివ॥**

**భావం :** అరుణాచలా! భక్తుల అహంకారంను పరిమార్చుటకై అవతరించిన నిన్ను నాయకునిగా పొందిన నేను భువిలో ఒక వ్యక్తిగా (జీవునిగా) జీవించగలనా?

**నాన్నగారు :** అరుణాచలా! డాక్టరు పని వేరు, వర్తకుడి పని వేరు, వ్యవసాయదారుడి పని వేరు. కాని నీ పని ఏమిటంటే ఎవరైతే అరుణాచలా! అరుణాచలా! అని నిరంతరం స్మరిస్తున్నారో వారి అహంకారాన్ని, వ్యక్తిభావనని నాశనం చేసే పనిని పెట్టుకున్నావు. ఈ మనస్సుకి, అహంకారానికి పరిమితమైన నేనుని ఊడగొట్టి నాశనం చేసే పనిని నీవు పెట్టుకొన్నావు. మాకు శాంతి కావాలి, సుఖం కావాలి కాని మా అహంకారాన్ని విడిచిపెట్టలేకపోతున్నాం. దీనిని నాశనం చేసే పని నీవు పెట్టుకొన్నావు. ఇలాంటి పనిపెట్టుకొన్న నిన్ను నేను పెళ్ళిచేసుకొని ఎలా జీవిస్తాను అరుణాచలా! నేను జీవించలేను అంటే నీలో ఐక్యమయిపోతాను. ఇది మామూలు పెళ్ళి కాదు, భౌతికమయిన పెళ్ళి కాదు, ఆధ్యాత్మికమైన పెళ్ళి, ఇది పరమాత్మతో కలిసే పెళ్ళి. భౌతికమైన పరిధులను దాటి ఆత్మబుద్ధి కలగటం కోసం జరిగే పెళ్ళి. దేహబుద్ధి తీసేస్తే

కాని ఆత్మబుద్ధి కలుగదు. నీదేమిటి ఆత్మస్వరూపం నాదేమిటి దేహబుద్ధి. ఈ దేహబుద్ధిని తీసేసి అత్మబుద్ధిని నాకిస్తావు. మనం అహంకారాన్ని పెంచుకోవడానికి సాధన చేస్తున్నాం కానీ దానిని తొలగించుకోవడం కోసం ఏ ప్రయత్నం చేయడం లేదు, కాని పోగొట్టుకోవలసినది అదే. దేహబుద్ధి పాపాన్ని తీసుకొస్తుంది. ఆత్మబుద్ధి పుణ్యాన్ని దాటిస్తుంది.

నీవు ఎంతటి వాడివైనా నీ జీవలక్షణాలు పోగొట్టుకో లేకపోతే అరుణాచలేశ్వరుడు తన స్వరూపాన్ని ఇవ్వడు. అరుణాచలా! నిన్ను నిరంతరం స్మరించే వారికే నీ స్వరూపాన్ని ఇస్తావు. ఇదే పనిగా పెట్టుకున్నావు అట్టి నిన్ను కట్టుకొని ఎట్లు బ్రతకగలను. నేను మరణిస్తాను అహంవృత్తిలో, ఈ అహమికలో మరణించాలి. ఎవరైతే ఈ తాత్కాలిక జీవితంలో మరణిస్తారో వాళ్ళు శాశ్వతమైన జీవితంలో మేల్కొంటారు. ఎవరికైతే అజ్ఞానం మూలం తెలుస్తుందో వారికే అహంకారం తొలగించబడుతుంది. నేను ఏదో పెద్దవాడినవుదామని, కాంక్షలు పెంచుకుందామనుకున్నా నన్ను పెంచుకోనిస్తావా, నా వేరు భావనను పెంచుకోనిస్తావా నీ స్వభావమే అదయ్యా! నా ఈ వేరుభావనని తీసేసి నీ స్వరూపాన్ని నాకిచ్చి నీ అంతటి వాడిని చేస్తావయ్యా! ఒక జ్ఞానిని ఆశ్రయిస్తే భగవంతుడంతటి వాడిని చేస్తాడు. ఇది మామూలు పెళ్ళికాదు పెళ్ళికూతురు ఎటువంటి ఎత్తులకు ఎదిగి ఎటువంటి జీవితాన్ని కోరుతుందో చూడండి.




శ్రీ చక్రం

## 25 కోపరహితగుణ గురిగాగ ననుగొను, కొఱ యేమి చేసితి నరుణాచలా

**భావం :** అరుణాచలా ! కోపమేలేని శాంత గుణశీలా ! నీ భక్తులందరి యందు నీ అనుగ్రహంనకు పాత్రుడగునట్లు నన్నెంచుకొంటివే, నేనేమి పుణ్యం చేసితినో నేను చేసిన తపస్సేమిటో !

**నాన్నగారు :** అరుణాచలా! అసలు కోపమే లేని గుణశీలుడనే పేరు నీకుంది. నీకు అపచారం కలిగించే పనులు, ఆగ్రహాన్ని కలిగించే పనులు నేనేమైనా చేశానేమో. నా మీద కోపం తెచ్చుకోకుండా నా బుద్ధిని మార్చి నన్ను అనుగ్రహించు.

మా మనస్సుకి ఎప్పుడూ లోకచింతనే అలా చింతన చేస్తూ నా మనస్సు కలుషితమై పోయిందేమో. నిరంతరం నీ చింతన చేసేటట్లుగా మనస్సును బాగుచేయి. లోకచింతనలో పడి నిన్ను వదిలేయడం వలన నేను ఎన్నో నీచ జన్మలకు గురికావలసి వస్తుంది. నా మనస్సుని, నా ఇంద్రియాలు పూర్తిగా చెడగొట్టక ముందే నీ యొక్క కరుణ, దయని కురిపించి, నా బుద్ధిని వికసింపచేసి నీ స్వరూపానుభవంను నాకిచ్చి నన్ను జ్ఞానంతోటి అలంక రించు అరుణాచలేశ్వరుడా!

నేను నా అల్పబుద్ధిని, స్వల్పబుద్ధిని, నా తెలివితేటలతో బాగు చేసుకోలేను. ఏ అర్హతలు లేకపోయినా నీ హృదయాన్ని ఇచ్చావు. నీ ఆగ్రహం కూడా నాకు అనుగ్రహమే నీ

అనుగ్రహంతోనే నా దేవాత్మబుద్ధి నుండి నన్ను విడదీసి నీ వాడిగా చేసుకో తండ్రి!

ఒకవేళ నాలో ఏమైనా లోపాలున్నా కూడా నన్ను క్షమించి నాలో ఉన్న కొరతను కూడా నీవే తీసేసి నన్ను సవరించి నీ చూపే లక్ష్యముగా పెట్టుకొని జీవించేటట్లు చేసి నన్ను అనుగ్రహించు అరుణాచలా! అంటున్నారు భగవాన్.

## 26. గౌతమ పూజిత కరుణా ఘన నగమా, కడగంటయేలుమా అరుణాచలా

**భావం :** అరుణాచలా! మహాతపస్వియైన గౌతమముని చేత పూజింపబడిన కరుణాస్వరూపుడగు అరుణగిరీశ్వరా నన్ను నీ కడగంట చూసి అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరా! మహాతపస్సంపన్నుడైన గౌతమ మహర్షిచే పూజింపబడిన కరుణా ఘననగమా నన్ను కూడా ఒకసారి నీ ఓరకంటితో చూచి అనుగ్రహింపుము. నిన్ను శరణు కోరిన వారికి నీ యొక్క కరుణా వీక్షణములతో అజ్ఞానం తొలగించి వారికి నీ స్వరూపమును ప్రసాదిస్తావు అరుణాచలా! హృదయం పక్వం చెందిన వారిని ఒకసారి నువ్వు చూస్తే చాలు వారి పని అయిపోతుందికదయ్యా!

గౌతమముని మహాతపస్సంపన్నుడు, మహా ఋషి అందుకే ఆయన చేసిన స్తుతులకు నీవు పొంగిపోయి

ఆయనను అనుగ్రహించావు. నేను మామూలు జీవుడిని నా జీవలక్షణాలన్నీ నీ అనుగ్రహంతో తొలగించి నన్ను కూడా పునీతుడిని చేయవయ్యా! నీవే దిక్కు అని ఆర్తిగా వచ్చిన నన్ను నీ ఓరకంట అయినా చూచి అనుగ్రహించు. నీ కృపా వీక్షణములు ఒకసారి నా మీద ప్రసరించు. నేనేమీ తపస్సులు చేయలేదు, యజ్ఞాలు, యాగాలు చేయలేదు, అయినా నన్ను నీ దయకు పాత్రునిగా చేసి అరుణాచలంనకు రప్పించుకున్నావు. ఇదేమి నా తెలివితేటలు కావు. నేను గౌతముని అంతటి వాడిని కాకపోయినా నీ దయకు పాత్రుడయినవాడను కదా! నన్ను కూడా నీవాడిని చేసుకొని నన్ను తరింపచేయి అరుణాచలా! అంటున్నారు భగవాన్.

## 27. సకలము కబళించు కరకాంతియిన మనో జలజ మలర్పుమా అరుణాచలా

**భావం :** అరుణాచలా! తన కాంతికిరణములచే చీకటిని తొలగించి, కమలములను వికసింపచేయు సూర్యుని వలె నీ జ్ఞానజ్యోతిని నాలో వెలిగించి, నా అజ్ఞానం హరియించి, నా హృదయ కమలాన్ని వికసింపచేయి.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నా హృదయమనే పుష్పం పూర్తిగా ముడుచుకుని పోయింది. నా మనస్సు కల్పించిన ద్వైతభావములతో ఏకమై ఈ ప్రపంచం ఆకర్షణలో మునిగి పోయి ఇదే సత్యమని జీవిస్తున్న మూఢులం మేము. మరి

మా మనస్సు రోజుకో రకంగా ఉంటుంది. ఈ కనిపించేదంతా నిజమనుకుంటుంది. ఈ రాగద్వేషాలతో ఈ ద్వంద్వాలతో ఎప్పుడు తిరుగుతూ ఉంటుంది. నిత్యా, అనిత్యాలు వివేకం లేదు. నిత్యం కాని ప్రపంచాన్ని నిత్యం అనుకుంటున్నాం, నిత్యమైన, సత్యమైన పరమాత్మ యొక్క అనుగ్రహం మాకు ఎలా తెలుస్తుంది. మా అజ్ఞాన అంధకారం పోవాలి అంటే నీవే నీ అనుగ్రహముతో నీ యొక్క జ్ఞానకిరణాలను నా మనస్సు మీద ప్రసరింప చేసి అది పూర్తిగా వికసించునట్లు చేయి అరుణాచలా!

గురువు యొక్క అనుగ్రహం చేతనే జీవుడికి నిత్యా, అనిత్యాల వివేకం తెలుస్తుంది. తను ఉన్నస్థితి నిజం కాదని, తన మనస్సు మూలంలో ఆత్మస్థితి ఉందని అర్థమవుతుంది. దాన్ని పొందేవరకు ఈ జననమరణ ప్రవాహం ఆగదని గ్రహిస్తాడు. మనస్సు ఆశాశ్వతమైనవి అన్ని నొల్లుకుని ఇవే పరమార్దమనుకొంటూ, ఆ కోర్కెలతో జీవిస్తున్నంత కాలం పరమాత్మ వైభవం అర్థం కాదు. ఒక మహా జ్ఞానినో ఒక గురువునో ఆశ్రయించినపుడు ఆ సమక్షంలో తనలో ఉన్న అజ్ఞానాంధకారం పోయి జ్ఞానం ఉదయిస్తుంది. ఈ జీవుడుకి అలాంటి స్థితి అనుగ్రహింపమని భగవాన్ అరుణాచలేశ్వరుణ్ణి వేడుకొంటున్నారు.

## 28 తిండిని నిన్జేరితిని తిన నా నేను, శాంతమై పోవుదు నరుణాచలా

**భావం :** అరుణాచలా ! నా తీరని ఆకలికి ఆహారముగ తినుటకు నేను నిన్ను చేరితిని. కాని దానికి భిన్నముగ నీవే నన్ను ఆహారంగా తిని నాకు పరమశాంతిని అనుగ్రహించావు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! జీవులయొక్క అహంకారమే నీకు ఆహారం కదా! అలాంటి ఆహారమయిన నేను నా అజ్ఞానంచే నీ దగ్గర ఏదో పొందాలని, నా గౌరవాలు పెంచుకొందామని, నా కోర్కెలు తీర్చుకుందామని నీ దగ్గరకు వచ్చాను. అలాంటి నన్ను నాలోని జీవలక్షణాలన్నింటికి మూలమైన అహంకారాన్ని నువ్వు తినేసి నాకు అమృతస్థితిని ఇచ్చి నన్ను శాంతి సముద్రంలోకి పంపించేసావయ్యా. ముముక్షువులందరూ ఏ స్థితి కోరి తపస్సులు చేస్తున్నారో, అటువంటి స్థితిలోకి నన్ను పంపించావయ్యా! ఎంత దయ చూపించావు అరుణాచలా!

భక్తుడు కోరికల భక్తితో అరుణాచలం వెళతాడు. వాడు అడిగిన కోర్కెలు నెరవేర్చి వాడికి తన మీద విశ్వాసం పెంచి తర్వాత ఎవరైతే ఆ కోర్కెలు కోరుతున్నాడో వాడిని తినేస్తాడు. నీకు ఆహారమే మా దేహాత్మబుద్ధి. నిన్ను స్మరించిన వాళ్ళయొక్క అహంకారం నాశనం చేయుటయే నీ పనిగా పెట్టుకొన్నావు మేము మా తెలివితేటలతో మా అహంకారాన్ని పోగొట్టుకో గలమా? నీవు మా మీద దయ, కరుణతో మా అహంకారాన్ని

తినకపోతే మేము ఈ కర్మ సముద్రంలో కొట్టుకొని పోతామయ్యా! నువ్వే మా దేహాత్మబుద్ధిని తీసేస్తే (తినేస్తే) నేను శాంతిగా సుఖంగా ఉంటాను అరుణాచలా! ఇంక నా జీవలక్షణాలన్ని నశించిన తరువాత ఉన్నదే శాంతి. అలాంటి శాంతిలోకి జీవులందరిని పంపించమని అరుణాచలేశ్వరుడిని వేడుకొంటున్నారు భగవాన్.

## 29 మది చల్లబడ భద్రకరముంచి, యమృత నోర్ తెరు మనుగ్రహచంద్ర మరుణాచలా

**భావం :** కరుణా చంద్రుడవైన అరుణాచలా ! తాపత్రయం చేత విసిగిపోయి తపించు చిత్తం యొక్క తాపం ఉపశమించి చల్లబడునట్లు, అమృత కిరణములు అనబడు నీ హస్తముంచి, లోన అమృతం నింపి, బయట మూసి ఉన్న దాన్ని నోటిని తెరిచి అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! మేము నీకు దూరంగా బ్రతుకుతున్నాం. ఏదైతే అయి ఉన్నామని నువ్వు చెపుతున్నావో ఆ వస్తువుకి మేం దూరంగా ఉంటున్నాం. మేం అసత్యంతో కలిసి ఉంటున్నాం. మా మనస్సు ఈ లోకచింతనతో నిండి పోయి ఉన్నది. ఇలా ద్వంద్వాలలో బ్రతుకుతున్న మనస్సును ఏదైతే సత్యమో, దానితో అనుబంధం పెట్టుకునేటట్లు మమ్ములను మేల్కొలుపు. మమ్ములను మనో దేహముల నుండి విడుదల పొందేటట్లు అనుగ్రహించు. అప్పుడు మా మనస్సు చల్లబడిపోతుంది. ఎప్పుడైతే నీ యొక్క అనుగ్రహంతో నాలో

ఉన్న అమృతనాడి తెరవబడుతుందో అప్పుడు ఈ జీవుడి ఆరాటపోరాటాలు అన్నీ ఆగిపోతాయి కదయ్యా!

అజ్ఞానికి అమృతనాడి మూసుకొని పోయి ఉంటుంది. వాడు ఏకాగ్రత, పవిత్రత, ప్రవీణత అనే గుణాలతో భగవంతుని తెలుసుకోవటానికి ప్రయత్నం చేయాలి. మా హృదయం ఆనందామృతంతో నిండివున్నా బయట మా అజ్ఞానంతో మూసుకుపోయినది. దానిని నీ అనుగ్రహంతో కాని తెరువబడదు. మా మనస్సులో ఉన్న తాపత్రయాలన్నీ నశించిపోవునట్లు నీ యొక్క అనుగ్రహస్తం తాకించి మాలో ఉన్న కల్మషాలను కరిగించి అమృతనాడిని తెరచి లోన ఉన్న అమృతాన్ని అందివ్వమని రమణస్వామి వేడుకొంటున్నాడు.

ఎప్పుడైతే పరమాత్మ యొక్క స్పర్శ అనుభవిస్తాడో ఆ జీవుడికి అప్పటివరకు వున్న దేహాత్మ భావనపోయి ఆత్మభావన కలుగుతుంది. హృదయంలో ఉన్న ఆనందసముద్రం సహస్రారంలోనికి ప్రవహిస్తుంది. జీవులపై అరుణాచలేశ్వరుడు తన యొక్క జ్ఞానకిరణాలను ప్రసరింపచేసి అజ్ఞానానంధ కారములని తొలగించి, వాడిని అమృతమయుడిని చేయమని భగవాన్ అడుగుతున్నారు.

## 30 వస్త్రను చెఱపి నిర్వాణ మొనర్చి, కృపావస్త్రె నిడి బ్రోవు మరుణాచలా

**భావం :** అరుణాచలా ! మెరయుచున్న నా అహంకార దర్పమును నాశమొనర్చి నన్ను నా స్వరూపమైన ఆత్మస్వరూప చిదాకాశ నిర్వాణంగా చేసి, నేను పులకాంకితుడగునట్లు నీ కృప అనెడు వస్త్రముచే కప్పి అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! మాకు చాలా అలంకారాలు ఉన్నాయి. మేము మాకున్న ధనంతోను, మాకున్న కీర్తితోనో, మాకున్న అందంతోనో మాకున్న పదవులతోనో, భౌతిక మయిన అలంకారాలతో తాదాత్మ్యం చెందుతున్నాం. ఇవి అన్నీ అశాశ్వతాలని మేము తెలుసుకోవటం లేదు. ఈ జీవుడుండగా అవి అయినా పోతాయి, లేక అవి వుండగా ఈ జీవుడు అయినా పోతాడు. ఇంత అశాశ్వతమైన అలంకారాలను అలంకరించుకొని అహంకారంతో బ్రతుకుతున్నాం. కాని గురువు బోధవలన, అరుణాచలేశ్వరా ! నీ కృపవలన ఇవి అన్నీ అశాశ్వతాలు, నిత్యమైనవి, సత్యమైనవి కావు అని తెలియబడినది. మరి ఈ అలంకారాలన్నీ నాకు ఇష్టం నేను ఎలా పోగొట్టుకుంటాను. నీవే నా అలంకారా లన్నీ, ఎండింప చేసి నాలో ఉన్న ఈ లోక వ్యవహారాలన్నింటిని నాకున్న జీవలక్షణాలన్నింటిని తీసి నాశనం చేయి. మమ్ములను మేము నాశనం చేసుకోలేం.

ఓ అరుణాచలా! నీయొక్క కృప అనెడి అనుగ్రహ వస్త్రమును మాకు కప్పి మాకు ఉన్న అలంకారాలన్నీ నాశనం చేసి మమ్ములను కాపాడమని భగవాన్ అరుణాచలేశ్వరుడిని వేడుకొంటున్నారు.

## 31. సుఖసముద్రము పొంగ వాఙ్మనములడంగ యూరక నమరుమం దరుణాచలా

**భావం :** అరుణాచలా ! నా హృదయంలో ఉన్న సుఖసముద్రం ఉప్పొంగి నా వాక్కు, మనస్సు పూర్తిగా నశించేటట్లు నీవు నా హృదయంలో స్థిరంగా నిలిచిపో.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! సప్తసముద్రంలలో ఎంత నీరు ఉందో అంతసుఖం మా హృదయంలోఉన్నదని చెబుతున్నావు. నువ్వు నాలో అంతర్యామిగా నా హృదయంలో ఉన్నావు కదా. నీవే నాలో ఉన్న సుఖసముద్రం పొంగి నా సహస్రారాన్ని ముంచెత్తేటట్లు చేయాలి కదయ్యా. నాలో ఉన్న సుఖం నాకు అనుభవంలోకి రావాలంటే నీ అనుగ్రహం కావాలికదా! నా తెలివితేటలవల్ల, నా సాధనలవల్ల ఇది సాధ్యమా నీవే నీ అనుగ్రహాన్ని కురిపించాలి. ఒకవేళ నేను దానికి అర్హుడిని కాకపోయినా నన్ను అర్హునిగా నీవే చెయ్యాలి. ఒకవేళ నా ముక్కు వంకరగా ఉంది అనుకో! అద్దం ఏమి చేస్తుంది? నా వంకరని ఎత్తి చూపిస్తుంది. నువ్వు నాలో అవలక్షణాలుంటే అవి నేను బాగుపడటానికి అడ్డముగా ఉన్నాయనుకో ! అవి ఉన్నాయని నాకు చూపించటమే కాదు వాటిని తొలగించే

పని కూడా నీవే చేయి అరుణాచలా! అడ్డంచేసే పనికాదు, అమ్మచేసేపని చేయి.

కృష్ణుడు గీతలో చెప్పినట్లు ఏ సుఖాన్ని పొందిన తరువాత ఏశాంతిని పొందిన తరువాత దానికి సమానమైన సుఖము కాని శాంతి కాని లేదో అటువంటి సుఖం వైపు నా కళ్ళు తెరిపించు. అటువంటి సుఖం అనుభవంలోనికి వస్తే మా మనస్సు కదలదు. ఇప్పుడు ఆగమంటే ఆగదు. ఆ సుఖము, ఆనందము మా అనుభవంలోనికి వచ్చాక మనస్సును కదలమన్నా కదలదు ఎందుకంటే అవసరం లేదు. నాలో ఉన్న సుఖసముద్రం అణిగివుంది. అది సహస్రారంలోకి పొంగాలి. అది ఎప్పుడు అయితే పొంగిందో అప్పుడు ఇంద్రియాలు, మనస్సు అణిగిపోతాయి. ఈ మనస్సు అణగటం కోసమే ప్రాణాయామాలు, సత్సంగాలు చేస్తున్నాం. ఏదైతే సత్యమో అదే జ్ఞానం, అదే ఉండడం. సత్యం శివం సుందరం సత్యమే సుఖం, సత్యమే శాంతి మన అందరికి చనిపోవాలని లేదు ఉండాలని ఉంది. ఆ ఉండడమనేది మనకి అనభవంలోనికి రావడం కోసం అరణాచలేశ్వరా! నీ దయని చూపించు అని భగవాన్ వేడుకొంటున్నారు.

## 32. వంచితు వేల నన్ శోధింప కిక నీదు, జ్యోతిరూపము జూపు మరుణాచలా

**భావం :** అరుణాచలా! ఇన్నాళ్ళు నన్ను పలుకష్టములకు గురిచేసి శోధించావు. ఇప్పుడైనా నన్ను మోసగింపక నీ

సహజమైన పరంజ్యోతి స్వరూపమును దర్శించునట్లు నన్ను అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! ఇంకా నన్ను పరీక్షలకు గురిచేస్తావా! నన్ను ఈ ప్రపంచపు మాయలో పెట్టి నీకు దూరమయిపోయేటట్లు చేస్తావా! అని భక్తుడు ఎప్పుడు అడుగుతాడండి. పడవలసిన మొట్టికాయలన్నీ పడ్డాక ప్రారబ్దం కొట్టే దెబ్బలు భరించి, భరించి తన గౌరవాలు, గొప్పలు, అన్నీ తనకు తిప్పలు తెచ్చిపెట్టేవి అని, గురువు యొక్క అనుగ్రహంలో గుర్తిస్తాడు.

ఈ మమకారములన్నీ తనని బంధించేవి అని తను చేరవలసిన గమ్యం ఈశ్వరుడు పాదాలేనని గుర్తిస్తాడు. అవి పొందటానికి అడ్డువస్తున్నవి తన రాగద్వేషాలేనని గురువుబోధ వలన గ్రహిస్తాడు. గురువు కూడా ఆ జీవుడికి ఆత్మస్థితి పొందడానికి ఏ విషయాలు అడ్డు వస్తున్నాయో చూసి వాటిని ఈ జీవుడికి చూపించి అప్పుడు గురువు యొక్క దయతో వాటిని తొలగించు కోవటానికి అవకాశాలు కల్పిస్తాడు. మమకారం ఎక్కువగా ఉంటే, ఆ మమకారం ఉన్న వాళ్ళతో తిట్టిస్తాడు. అప్పుడు గురువుని, ఈశ్వరుని ప్రార్థిస్తాడు, ఇంక ఈ విషయాలతో విసిగిపోయాను నన్ను ఇంకా, ఇంకా శోధించకుండా, నీ యొక్క అనుగ్రహం నా మీద కురిపించు. ఈ ప్రపంచపు ఆకర్షణలలోపడేటట్లు నన్ను వంచించకు. నీ

యొక్క జ్యోతిరూపం చూపించి అనుగ్రహించమని భగవాన్ వేడుకుంటున్నారు.

## 33 పదవిద్యగరపి ఈ భూమి మైకము వీడి, రూపగు విద్య జూ పరుణాచలా

**భావం :** అరుణాచలా ! ఇప్పటివరకు మాయజాల విద్యను సత్యమని తలచి, నేర్చుకొని, ఈ విద్యచే మోహింపబడు ఆశాపాశముల నుండి నన్ను తప్పించి నేను తరింపగల ఆత్మసాక్షాత్కార విద్యను నేర్చి నన్ను అనుగ్రహించు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! మాకు చాలా డిగ్రీలున్నాయి. పదవులు ఉన్నాయి. హోదాలు ఉన్నాయి. వాటినన్నింటిని చూసి మురిసిపోతున్నాం. మేము ఈ మోహంలో కొట్టుకు పోతున్నాం. మేము వాళ్ళ కన్నా అధికులం, వీళ్ళ కన్నా అధికులం అనుకుంటూ ఈ జీవితమే సత్యం అనుకుంటూ మాకు ఉన్న హోదాలతో అహంకారాన్ని పెంచుకుంటూ జీవిస్తున్నాం. ఈ జీవుడికి వైరాగ్యం లేదు, వివేకం లేదు. కనిపించిన గడ్డి అంతా నాదే అంటాడు. లోపల ఒకలా ఉంటాడు బయటకు ఇంకోలా ప్రవర్తిస్తాడు. చిత్తశుద్ధి లేదు ఏది శాశ్వతమో, ఏది అశాశ్వతమో వాటి వివేకం లేదు. ఈ భూమి ట్రైనింగ్ గ్రౌండ్ అని వీడు నేర్చుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి అని ఎప్పుడు తెలుస్తుందండి. ఒక గురువునో, ఒక అవతారపురుషుడినో దర్శించినపుడు, వారి సమక్షంలో

ఉన్నప్పుడు, వారి బోధలు విన్నప్పుడు అర్థమవుతుంది. ఇప్పటి వరకు తను అనుకున్న విద్యలేవి సత్యం కాదు అని. ఇవి తనను పరమాత్మ దగ్గరకు చేర్చే విద్యలు కావని, ఈ జన్మకు పరమార్థం ఆత్మవిద్యను తెలుసుకోవడమేనని. అది కేవలం తన సాధన, తన తెలివితేటలవల్ల తెలుసుకోలేమని గ్రహించి గురువు బోధలను శ్రవణంచేసి మననం చేసి, హృదయాన్ని శుద్ధి చేసుకోవడమే ఆత్మవిద్యకు అర్హత అని తెలుస్తుంది.

హృదయ శుద్ధి కలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు అని, ఏసు చెప్పినట్లు జీవించాలి. మనలోని బలహీనతలు అన్నీ గురువు యొక్క అనుగ్రహంతోనే తీసుకోగలం. మనకేది మంచిదో అదే ఇతరులకు చేయాలనే తలంపు కూడా లేని జీవులను గురువు తన ప్రేమతో, దయతో బోధించి వారిని హృదయాభిముఖంగా పంపించి ఆత్మవిద్యకు అర్హత కలుగచేస్తాడు. ఈ ప్రపంచ ఆకర్షణల నుండి నన్ను తప్పించి అన్నింటిలోకి సత్యమైన ఆత్మవిద్య నాకు బోధించి నన్ను ఆత్మ సాక్షాత్కారానికి అర్హుడిగా చేయమని జీవుడు అరుణాచలేశ్వరుడుని వేడుకోవాలి అని అంటున్నారు భగవాన్.

## 34. చేరకున్నను మేను నీరుగ కరిగి, కన్నీ టేరయి నశింతు నరుణాచలా

**భావం :** అరుణాచలా ! నీవు నాలో చేరి ఒకటిగా నుండనిచో నా దేహం కరిగి కృశించి ఆ ఆవేదన వల్ల కన్నీరు ఏరువలే పొంగి దుఃఖం తట్టుకోలేక నశించిపోవుదును.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నన్ను నీవే నీ ప్రేమతో రప్పించుకున్నావు. ఇప్పుడు నువ్వు నన్ను నీలో కలుపుకోకపోతే నన్ను రప్పించడానికి ఫలమేముంటుంది. ఏదో ప్రపంచంలో నా తిప్పలు ఏవో పడుతున్న నన్ను నీ సన్నిధికి రప్పించావు. ఇప్పుడు నీవు నన్ను అనుగ్రహించి నీలో కలుపుకోకపోతే నా తనువు నీరుగా కరిగి నేను కన్నీటి వరదలో కొట్టుకొని పోతానయ్యా! నీకు వేరుగా ఉన్నాననుకో, ఈ వేరుబుద్ధి వలన నేను చేసే పనులన్నీ నెగిటివ్‌గా ఉంటాయి. నాకు వచ్చే తలంపులు కూడా నన్ను పాడు చేసేవిగానే ఉంటాయి. నేను బయటకు వెళితే లేని విషయాలలో పడిపోయి నీకు దూరమయిపోతాను. మళ్ళీ ఎన్ని నీచజన్మలకి వెళ్ళిపోతానో, నన్ను నిరంతరం నీ చింతనతోనే ఉండేటట్లు అనుగ్రహించు అరుణాచలా! నా దేహబుద్ధి నన్ను పీడిస్తుంది.

నీకన్నా నేను వేరుగా ఉంటే నిన్ను ఏదో ఒకటి అడగాలనిపిస్తుంది. అలా కోరికలు కోరుకుంటూ మళ్ళీ జన్మ పరంపరలో కొట్టు కొనిపోతాను. నీవే ఈ దేహాత్మబుద్ధిని, నా వేరుబుద్ధిని తొలగించి నీలో ఐక్యం చేసుకొని నాతో కలిసి ఉండు అరుణాచలా! అంటూ ఈ జీవుడు తపనపడితే నీళ్ళలో మునిగినవాడు గాలి కోసం ఎంత తపన పడతాడో అంత తపన అరుణాచలేశ్వరుని కోసంపడితే ఇంక ఆయన తనలో ఈ జీవుడిని కలుపుకోకుండా ఉండగలడా అంటున్నారు భగవాన్.

## 35. ఛీ యని ద్రోసిన చేయు కర్మ, తపన గాకేది మనుమార్గ మరుణాచలా

**భావం :** అరుణాచలా ! నీదరి చేరిన నన్ను చేరక, ఛీయని చీదరించుకొని ఉదాసీనంగా త్రోసిపుచ్చిన, నేను ముందు చేసిన చెడ్డకర్మలు నన్ను అగ్నివలె దహించివేయును. అందుచే నాకు జీవించి ఉండుటకు వేరుగతి ఏదో కరుణించి దయతో తెలుపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! నీవే నా పతి, గతి అనుకొని నిన్ను చేరిన నన్ను పట్టించుకోకుండా వదిలివేస్తావా. నా పూర్వకర్మలను చూపించి నన్ను ఛీపొమ్మని త్రోసివేస్తావా. ఇది నీకు న్యాయమా! కరణాసముద్రుడువగు నీకు ఇది తగునా! నీవే నన్ను త్రోసివేస్తే నాకు ఇంక వేరు దిక్కు ఏది? నాకున్న దిక్కులన్నీ (నా వారిని అనుకున్న వారిని నాకు సపోర్టుగా ఉన్న వారిని) అందరిని వదిలేసి నీవే దిక్కు అని నీవే గమ్యం అని నీవే నాకు గతి అని నమ్మి నీవద్దకు వచ్చాను అరుణాచలా! ఇప్పుడు నాకేమీ సపోర్టు లేదు, నాకేమీ డిగ్రీలు లేవు, నాకేమీ మార్గాలు లేవు. వాటిని అన్నింటిని వదిలి నీ దగ్గరకు వచ్చేటట్లు నీవే చేశావు. నేనేమన్నా నీ కోసం పూజలు చేసానా, జపాలు చేసానా, ఏమీ లేదు అయినా నేను నిన్ను స్మరించేలాగా చేసి, నీవు తప్ప నాకు అన్యం లేకుండా చేసి నన్ను ఇక్కడకు రప్పించావు. తీరా ఇక్కడకు చేరాక నా పూర్వ చెడ్డకర్మలు గుర్తుకు వచ్చి నన్ను 'ఛీ' యని త్రోసివేస్తావా!

నేను నీ కోసం ఎంతో తపనపడుతున్నాను. నీ స్వరూపమే కోరుకుంటున్నాను. నా పూర్వ కర్మలు ఏమైనా ఉంటే నీ జ్ఞానాగ్నిలో దగ్ధం చేసి నన్ను నీ దరికి చేర్చుకో. అలాకాకపోతే నీ కోసం పరితపించి విలపిస్తూ జీవించడం కంటే నాకు వేరే మార్గం ఏముంది అరుణాచలా! నా మార్గం నీవే, నా గమ్యం నీవే.

నన్ను ఈ ప్రపంచానికి పనికిరాకుండా చేసేసావు. ఇప్పుడు నువ్వు కాదు అంటే నాకు దిక్కు ఎవరు అరుణాచలా! నాకు అర్హత లేదు అని వదిలేస్తావా! ఒక వేళ నాకు లేకపోయినా నీ అనుగ్రహంతో నాకు ఆ అర్హత కలిపించు. నా తప్పులన్నీ ఒప్పులుగా మార్చి నన్ను నీ దయకు పాత్రునిగా చేసి నన్నేలుకో అరుణాచలా !

## 36. చెప్పక చెప్పి నీవు మౌనత నుండని యూరక నుందువే మరుణాచలా ॥అరుణాచల శివ॥

**భావం :** అరుణాచలా ! ఎప్పుడు ఏదియో నొకటి కోరకుండా మౌనంగా ఉండమని నోటి మాటలతో కాక మౌనంతో గ్రహింపచేసి నీవు కూడా దక్షిణామూర్తి స్వరూపునివలె మాట్లాడక మౌనంగా ఉన్నావు.

**నాన్నగారు :** అరుణాచలా! చెప్పకుండానే చెప్పావు నీవు మౌనంగా ఉండమని, మనం మౌనంగా ఉండలేం. 5 ని॥లు కూడా మౌనంగా ఉండలేం. ఎంతసేపయినా మాట్లాడతాం

కాని మౌనంగా ఉండడానికి అలవాటు పడలేదు. మౌనమే విశేషమైనది మౌనం లోనుండే ఎక్కువ శక్తి వస్తుంది. చాలామంది అనుకుంటారు మౌనంతో సందేశం ఇవ్వలేరని కాని మౌనానికి కూడ సందేశమిచ్చే శక్తి వుంది. ఉదాత్తమైనటు వంటి ఉజ్జ్వలమైనటువంటి మౌనంలో నుండి శక్తి తరంగాలు వస్తాయి. అందుకే మాటలు వెండి, మౌనం బంగారంతో సమానం. నీవు మౌనంగా ఉండమని, మాటలతో కాదు. హృదయంలో నుండే ఇచ్చావు, హృదయం అర్థం చేసుకుంటే మాటలతో పనేముంది. రమణస్వామిని దర్శనం చేసుకోవడం వలన ఆయన మాటలతో పనిలేకుండా అనేకమంది జీవితాలు మారిపోయాయి. ఎక్కడైతే ఏకాగ్రత, పవిత్రత ఉందో ఎక్కడైతే జీవితంలో అందముందో ఆ మనిషిని చూసినప్పుడు మనం కూడా మనస్సుని మార్చుకుంటాం.

చెప్పకుండానే చెప్పి నీవు కూడా ఊరకనే ఉన్నావు అరుణాచలా! నిన్ను మాటలతో పట్టుకోలేం. మన ఆలోచనలకి, మన తలంపులకు దొరకడు. నోరు మూసుకొని ఉండడం మౌనం కాదు నోరు మూసుకొని ఉన్నా మన మనసు ఎక్కడకు తిరిగివస్తుందో ఎన్ని ఊళ్ళు వెళుతుందో, మౌనం ఎవరికి కుదురుతుంది అంటే నిజమైన ధ్యానం ఎవరు చేస్తున్నారో వారే నిజమైన మౌని. మనస్సు మౌనంగా ఉండాలి. ఉపనిషత్తులలో ధ్యానానికి చాలా ప్రాముఖ్యత ఇచ్చారు. ధ్యానం చేసే వాడికి మౌనం కుదురుతుంది. అప్పుడే నిజమైన

ధ్యానస్థితి వస్తుంది. ధ్యానం కుదరాలి అంటే ఈశ్వరుని ప్రేమించాలి. ఈశ్వరునిపై ప్రేమ లేకుండా ధ్యానం చేస్తుంటే అది పంచదార లేని కాఫీలాగా ఉంటుంది. ఈశ్వరుని పట్ల మనకు వున్న ప్రేమని అభివృద్ధి చేసుకోవాలి. అప్పుడు ధ్యానం కుదురుతుంది ధ్యాస కుదురుతుంది. మనసు మహామౌనంలోకి వెళ్ళిపోతుంది. ఈశ్వరుడి ప్రేమ హృదయంలోనే వ్యక్తమై పోతుంది అంటున్నారు భగవాన్.

## 37. సోమరియైతిని మిన్నని సుఖనిద్ర, కన్న వేరేది గతి యరుణాచలా

**భావం :** అరుణాచలా! అహంకారం వల్ల కలుగు చేష్టకి ఉదాసీనంగ నూరకుండి, సహజమైన ఆత్మానందంను అనుభవించి తురీయంలో ఉండుట కంటే మించిన మార్గం ఏదైననూ ఉన్నదా?

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! నేను సోమరినయి పోయాను. నా ద్వైతబుద్ధి పోయింది. ఈ రాగద్వేషాలు, ఈ అజ్ఞానాన్ని దాటి వెళ్ళిపోయాక ఇంక సుఖ నిద్రకన్నా వేరేది గతి, ఈ లోకానికి పనికిరాకుండా పోయాను. మనం ఈ లోకంలో గౌరవాలు సంపాందించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాం. రమణస్వామికి సంపాదించుకోవాలనిగాని, మెప్పు పొందాలని కానీ ఉందా!


Nandi



జ్ఞానికి చేయవలసిన పని ఏమైనా ఉంటుందా, ఉంటే జ్ఞాని అవుతాడా? మనకి నిద్రలో శాంతిగా, సుఖంగా ఉంటుంది. అందుకే మనం నిద్రని కోరుకుంటాం. నిద్ర పట్టకపోతే డాక్టరును అడిగి మత్తు బిళ్ళలు వేసుకుంటాం. ఎందుకు? నిద్రలో ఏదో సుఖం శాంతి ఉంది, మీ వైభవాలు కాని, మీ రూపాయలు కాని మీ చదువులు కాని ఇవ్వలేని శాంతి నిద్రలో దొరుకుతుంది కాబట్టే ఆ నిద్ర కోరుకుంటుంది. రమణస్వామి ఏమి చెపుతున్నారు అంటే నీవు జాగ్రదావస్థలో మెలుకువగా ఉండాలి ఆ మెలుకువలో నిద్రస్థితి పొందాలి అది సుఖనిద్ర. నిద్రలో మనకెవ్వరికి దేహస్పృహగాని, దేవుడు స్పృహకాని, ప్రపంచము స్పృహగానీ ఏమీ లేవు. నిద్రలో నీవు కల్పించుకున్న విషయాలేమీ లేవు. తెల్లారి చెపుతున్నారు ఎంతచక్కగా నిద్ర పట్టిందో అని. నువ్వు లేకపోతే ఎవరు చెపుతున్నారు. నీకు మెలుకువ వచ్చిన తరువాత ఈ లోకాన్ని చూచిన తరువాత ఈ లోకానికి కర్త వుండాలి అని తెలుస్తుంది. కాని నిద్రలో ఏమీ లేవు. కేవలం ఆత్మస్థితి పొందడం మాత్రమే మనగతి అదే నిజమైనస్థితి, అదే మోక్షం, అదే సుఖనిద్ర. అంటే మనం నిద్రలో ఎటువంటి సుఖాన్ని పొందుతున్నామో జాగ్రదావస్థలో అటువంటి సుఖాన్ని పొందాలి. అజ్ఞానం లేని స్థితిని, జ్ఞానస్థితిని జాగ్రదావస్థలో పొందాలి. అటువంటి మోక్షస్థితిని, నిర్వాణస్థితిని నాకు ప్రసాదించు అదే నాకు గమ్యము అరుణాచలా!

ఎప్పుడైతే మోక్షస్థితి, ఆత్మస్థితిని పొందావో అక్కడ దేవునితో, లోకముతో పనిలేదు. ఇది భగవాన్‌స్థితి. నువ్వు ప్రపంచములో ఉండాలి, జాగ్రదావస్థలో ఉండాలి నిష్ప్రపంచ స్థితిని పొందాలి. అటువంటి స్థితిని పొందటమే భక్తుల యొక్క గమ్యం. దాని మీదే దృష్టిపెడితే పొందేది సుఖనిద్ర అంటే ఆత్మస్థితి. మనందరిని అట్టి స్థితిలోకి తీసుకువెళ్ళాలని అరుణాచలేశ్వరుడుని ఈ అక్షరమణమాల ద్వారా భగవాన్ ప్రార్థిస్తున్నారు.

## 38. శౌర్యము జూపితి శమియించి నని మాయ, చలియింప కున్నావు అరుణాచలా

**భావం :** అరుణాచలా ! నీ అనుగ్రహ పరాక్రమమును చూపించితివి, చూసిన వెంటనే నా అహంకార గర్వము నశించినది. దాని ఫలితముగ నేను శాంతించిన వెంటనే నీవు కూడ నీ చలనం లేకుండా హాయిగా వుంటివి.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నీ శౌర్యం చూపించావు నీ పరాక్రమం చూపించావు. ఈ రమణమహర్షి అనే పెళ్ళి కుమార్తెలో అజ్ఞానం పోగొట్టడం కోసం తన పరాక్రమం చూపించి, అజ్ఞానం పోగొట్టి ఈ జీవుడిలోని జీవలక్షణాలను పోగొట్టేసి ఏమీ ఎరగనట్లు ఏమీ తెలియనట్లు కదలకుండా కూర్చున్నావు. మనం అరుణాచలం వెళ్ళి వస్తున్నాం. మన క్షేమసమాచారాలు అడగడండి, ఏమీ మాట్లాడకుండానే

ఆయన చేయవలసిన పని మౌనంగా, సరళంగా, సహజంగా చేసి చూపిస్తాడండి. తనలో ఉన్న అజ్ఞానాన్ని ఆపరేషన్ చేసి తీసేసారండి అది ఎలా జరిగింది అంటే ముఖం కూడా నలగలేదు. అంతగొప్ప సర్జను అటండి. అంటే బాధను ఏమీ తెలియకుండా అంత నిర్మలంగా, నిరాడంబరంగానే, ఏమీ చెప్పకుండానే తన అజ్ఞానము తొలగించాడు అనే విషయం కూడా ఈ పెళ్ళికుమార్తెకు తెలియకుండా చేసేశాడంటండి.

అరుణాచలేశ్వరుడా ఏమి దయ చూపించావయ్యా! నాకు తెలియకుండానే ఇది అంతా చేసావంటే నీవు ఆధ్యాత్మిక చక్రవర్తివి కాబట్టి నీకు సాధ్యమైనది. నాలో ఉన్న మాయను నాకు తెలియకుండా తీసేశావు. నాలో ఉన్న మాయ ఊరికే పోయిందా లేదు నీ శౌర్యం చూపించావు. నీ యొక్క ప్రజ్ఞ, దయ చూపించావు. అరుణాచలేశ్వరుడా నువ్వు చేసే ఉపకారం నా కళ్ళకు కనపడకుండా చేసావు. ఏ బంధువు, ఏ స్నేహితుడు చేస్తాడు. చిన్నపని చేసి గొప్పలు చెప్పు కుంటారు, కాని గొప్ప వాళ్ళు ఎవరూ పైకి కనబడరు. వారు చేయవలసిన ఉపకారాలు చేస్తూవుంటారు.

ఒక మహాత్ముడుని కాని, ఒక ఋషిని గానీ, ఒక జ్ఞానిని కాని అర్థము చేసుకోవడం కష్టం. ఈ సమాజానికి అసలు గొప్పతనాన్ని ఒప్పుకునే గుణం ఉండదు. ఆ క్వాలిటీ మనకు లేదనుకోండి దాని విలువ కూడా తెలియదు. మనకు వాళ్ళ వర్క్ అర్థము కాదు. మన బుద్ధి ఎలా ఉంటుంది అంటే మన

పొలంలో వాన కురవాలి ప్రక్క వాడికి కురువకూడదు. ఆ ఎండ ఏదో మనకి తగిలితే సరిపోతుంది ప్రక్క వాడికి అవసరం లేదనుకునేంత చిన్న మనస్సులం. కాని సూర్యుడు లోకానికి అంతటికి వెలుగునిస్తాడు. మనలోని జీవలక్షణాలు అన్నింటిని పోగొట్టుకుంటేనే కాని అసలు అరుణా చలేశ్వరుడుని యొక్క శౌర్యాన్ని గుర్తించలేరు. జీవునిలో ఈ లక్షణాలను తొలగించమని భగవాన్ అరుణాచలేశ్వరుడుని వేడుకొంటున్నారు.

## 39. కుక్కకు న్నీచమే నే నేగురుతుగొని,
## వెదకి నిన్జేరుతు నరుణాచలా

**భావం :** అరుణాచలా! కేవలం ఒక కుక్క కంటే తక్కువైన వాడనా నేను. నేను నిన్నే లక్ష్యంగా పెట్టుకొని, శోధించి నిన్ను చేరుకుంటాను.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! నేను కుక్క కన్నా చెడిపోయానా! కుక్క ఏమి చేస్తుంది అంటే యజమాని నుండి దూరము అయిపోతే యజమాని జాడ తెలుసుకోవడం కోసం యజమాని అడుగుజాడల వాసన చూస్తూ నెమ్మదిగా యజ మానిని చేరుకుంటుంది. నా యజమానివైన నీవు అంటే అరుణాచలేశ్వరుడివి నీవెక్కడ ఉన్నావో తెలుసుకొని, నీ కోసం వెదికి అన్వేషించి నిన్ను చేరుకుంటాను అరుణాచలా! నీవు ఎక్కడ వున్నావు, నా హృదయంలోనే ఆత్మగా ఉన్నావు.

'నేను' 'నేను' అనే భావన ఎక్కడ నుండి వస్తుంది నా హృదయంలో నుండే వస్తుంది. ప్రతి మనిషి నేను నేను అంటాడు. దేవుడు లేడు అనేవాడు కూడా నేను నేను అంటాడు. ఈ తలంపు బయటి నుండి రావటం లేదు. లోపల నుండే వస్తుంది. నేను అనేది ఎక్కడి నుండి వస్తుందో దాని మూలం చూసే వరకు అహంకారం విడిచి పెట్టదు. శరీరాలు విడిచి పెట్టవు. అశాంతి తప్పదు. మీలో ఉన్న మూలం తెలిసేవరకు అశాంతిలో నుండి బయట పడలేవు. ఆ మూలమే ఆత్మ, ఆ మూలమే దేవుడు. ఆ మూలమే నిర్వాణం. ఏదైతే నేను నేను అంటున్నావో అది పుట్టిన చోటకు వెళ్ళగలిగితే నీ సోర్స్ బట్టబయలు అవుతుంది. అది వ్యక్తమైనప్పుడు దేహానికి, లోకానికి పరిమితమైన నేను అణిగి పోయినప్పుడు ఇంకొక నేను లేస్తుంది. ఇది అఖండమైన నేను. ఇది వ్యక్తమైన నేను. ఈ నేను లేకుండా ఆ నేను ఉండలేదు. అందుకే అఖండమైన నేనును తెలుసుకోవాలని అంటున్నారు.

మనం అందరం ఆర్థికానందం కోసం చేసే కృషి ఆత్మానందం కోసం చేస్తే అనిర్వచనీయమైన, అఖండమైన శాంతిని, సుఖాన్ని మనం పొందుతాం. మనస్సు మూలాన్ని మనం తెలుసుకోవాలి. కాని మనస్సు తన ములాన్ని తెలుసు కోవటానికి ఇష్టపడదు. తెలుసుకుంటే అది ఉండదని భయం. నేనును పట్టుకొని అంతర్ముఖంచేసి నేను ఎవ్వరో అని విచారణ

చేసి నేను యొక్క మూలం అయిన మన యజమానిని పట్టుకోవాలి. నా యజమాని అయినటువంటి, నా స్వామి అయినటువంటి నా భర్త అయినటువంటి నాగతి, నా దైవము అయిననటువంటి అరుణాచలేశ్వరుని నేను చేరలేనా! కుక్క చేసే పని అయినా నేను చేయలేనా అన్వేషణ చేస్తే దొరుకుతుంది. తట్టండి తెరవబడుతుంది. మనం సాధన ప్రారంభిస్తే అన్వేషణ ప్రారంభిస్తే, తెలుసుకోవాలి అనే కాంక్ష వుంటే అది తప్పకుండా అందుతుంది అంటున్నారు భగవాన్.

## 40. జ్ఞానము లేక నీ యాశదైన్యముబాప, జ్ఞానము దెల్పి బ్రో వరుణాచలా

**భావం :** అరుణాచలా! నిన్ను చేరుటకు కావలసిన జ్ఞానం లేకపోయినను, నిన్ను చేరవలెనన్న తీరని ఆశవలన నాకు కలిగిన దీనస్థితి పూర్తిగ తొలగించి నిన్ను చేరుటకు కావలసిన జ్ఞానమును నాకు తెల్పి అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! నీ మీద ఆశపడ్డాను. మనకు డబ్బు అవసరము పడింది అనుకోండి, ఏపని చేసినా కలిసిరావడం లేదు అనుకోండి, మనం ఎంత పెద్ద ఏడుపు ఏడుస్తామండి. ఈ పెళ్ళికూతురు అయిన రమణస్వామి అంటున్నాడు ఓ అరుణాచలా ! నీ మీద నాకు ప్రేమ కలిగించావు. నీ మీద ఆశ పుట్టించావు, ఆవేదన పుట్టించావు. నీ మీద ఆశ కల్పించి నీవు దొరకకపోతే నేను ఎంత దుఃఖ

పడతాను, ఎంత దైన్యం పడతాను. ఇలాంటి దైన్యంనకు నన్ను గురిచేయకు. నిన్ను పొందాలని ఉంది కాని ఎలా పొందాలో తెలియడం లేదు. ఎలా పొందాలో ఆ రహస్యం నీవే చెప్పాలి. నిన్ను ఎలా పొందాలో ఆ జ్ఞానం నాకు లేదు. నన్ను ఇంత బాధకు గురిచేస్తావా అరుణాచలా! నన్ను పూర్తిగా వదిలేశావా అంటే అలా వదిలేయకుండా తలుపు సందులో పెట్టి నొక్కినట్లు నొక్కేస్తున్నావు. ఇలాంటి దీనావస్థలో నన్ను వదిలేస్తావా! నాకు మార్గం చూపించు. నాకు గమ్యం నీవే, గతి నీవే, స్నేహితుడివి నీవే, అన్నీ నువ్వే నువ్వు తప్పించి నాకు ఇంకేమీ అవసరం లేదు. కళ్ళు మూసినా నీవే, ఎక్కడ చూసినా నీవే. ఇదంతా నిన్ను పొందేందుకు పడుతున్న ఆవేదన. నీ కోసము మార్గము చూపించు. ఆ మార్గము నాకు కనపడదు. నిన్ను తెలుసుకునే ఉపాయం లేక నీ దగ్గరకొచ్చి ఇంత ఆవేదనపడుతున్న నాకు, బాహ్యాదర్శనం ఇవ్వటం కాదు ఏదైతే అంతిమ సత్యమో ఏది తెలుసుకుంటే ఇంక దుఃఖము రాదో ఏది తెలుసుకున్నాక ఇంక తెలుసు కోవలసినది ఏదీ లేదో దానిని నువ్వు నాకు చూపించు అప్పటి వరకు నాకు ఈ రోదనలు తప్పవు, జన్మలు తప్పవు, ప్రయాణాలు తప్పవు.

భక్తుడు తనకు మరణం రాక ముందే అజ్ఞానాన్ని తొలగించుకోవాలి. ఈ అహంకారాన్ని మరణించే లోపల తొలగించుకోకపోతే కొత్త దేహం వస్తుంది. జ్ఞానం లేని జన్మ

వృథా. ఈ జన్మను వృథా కానీయకుండా అనుగ్రహించమని అరుణాచలేశ్వరుడుని భగవాన్ అడుగుతున్నారు.

## 41. తేటివలెను నీవు వికసింప లేదని, యెదుట నిలుతువేల యరుణాచలా

**భావం :** జ్ఞాన దివాకరుడవైన ఓ అరుణాచలా! కేవలం ఒక తుమ్మెద వలె నీవు కూడా "నీవింకను వికసించలేదే" యని పరిపక్వం చెందలేదని అపహాస్యం చేయునట్లుగా నా ఎదుట నిలుచుంటివేమి? ఇది నీకు తగదు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! తేనెటీగ పద్మం తెరుచు కున్నప్పుడే తేనె తీసుకోవడానికి వెళ్తుంది. ఆ పుష్పం తెరుచు కోకపోతే, అది అక్కడే తిరుగుతూ ఉంటుంది. కాని లోపలకు వెళ్ళదు నువ్వు కూడా అలాగ చేస్తావా! ఈ రమణమహర్షి అనే పెళ్ళికూతురు ఇంకా వికసించలేదు, ఇంకా పక్వానికి రాలేదు మరి హృదయంలోకి ఎలా ప్రవేశిస్తాను. నా హృదయంలోకి ఎలా తీసుకుంటాను అనుకుంటున్నావా! తేనెటీగ ఏమిచేస్తుంది. బాగా వికసించిన పుష్పంలోనికి ప్రవేశించి తేనె తాగి వెళ్ళిపోతుంది. నువ్వు తేనెటీగలాగా చిన్నవాడివా! ఆధ్యాత్మికమైన వికాసం నాకు లేదని, నువ్వు నాలో ప్రవేశించకుండా దూరం దూరంగా తిరుగుతుంటావా.

ఓ అరుణాచలా ! నీవు తేనెటీగ చేసే పని కన్నా ఎక్కువ చేయలేను అంటావా! అప్పుడు నువ్వు దేవుడివి అవుతావా!

ఆ పుష్పాన్ని వికసింపచేసే శక్తి తేనెటీగకు లేదు. కాని నువ్వు అలా కాదు నీకు ఈశ్వరుడివి అనే పేరుంది. పక్వం కాకపోతే పచ్చిగా వుంటే నన్ను ఎలా బాగుచేస్తే నీ అనుగ్రహానికి పాత్రుడ నవుతానో అలా అయ్యేటట్లు నన్ను వికసింపచేయి, అప్పుడు నన్ను నీలో ఐక్యం చేసుకో.

నాలో బలహీనతలు ఉంటే, నాలో లోపాలు ఉంటే నన్ను ఆక్షేపించి ఎత్తి చూపకు అద్దము చేసే పని నువ్వు చెయ్యవద్దు. అమ్మ చేసే పని చెయ్యి. అమ్మ ఏ విధంగా బిడ్డకు ఉన్న మురికిని తొలగిస్తుందో అదే విధంగా నాలో ఉన్న లోపాలు తొలగించి ఎటువంటి సుగుణాలు ఇస్తే నీ అంతటి వాడినవుతానో అలాంటి గుణాలు నాకు ప్రసాదించు. నీవే నీ మీద, ఇష్టము కాంక్ష కలుగుచేయి అరుణాచలేశ్వరుడా! అని భగవాన్ ప్రార్థిస్తున్నారు.

## 42. తత్త్వమెరుగజాల నంతను నిలుతువే, యిదియేమి తత్త్వమో యరుణాచలా

**భావం :** అరుణాచలా ! తత్వమసి (అదే నీవు) అను మహావాక్యార్థం యొక్క సత్యంను తెలుసుకుని గ్రహింపకయే, అటువంటి బ్రహ్మ స్వరూపం యొక్క అభేదస్థితిని పొందితివి. నీవు పొందే స్వరూపస్థితి సత్యమిదియే యని చెప్పి నన్ను తరింపచేయుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! తత్వమంటే ఏమిటో తెలియని ఈ రమణమహర్షి అనే భక్తుడికి అర్థం కూడా తెలియకుండానే

"అదేనేను" అని స్వానుభవములోనికి తీసుకువచ్చావు. ఎంత దయచూపించావు అరుణాచలా. ఉపనిషత్తులు చదివినవారికి గురువులను సేవించినవారికి మాత్రమే తెలియబడే ఈ తత్వానికి అర్థం అయిన 'అదే నీవు' అనేది నీ యొక్క అనుగ్రహంతో నాకు అనుభవంలోనికి తీసుకువచ్చావు.

ఈ 'నేను' ను తెలుసుకోవటానికి అందరూ ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. గురువుని ఆశ్రయించి వారిని సేవించి బ్రహ్మజ్ఞానము గురించి తెలుసుకొంటారు. మరి కొందరు ఈ నేను యొక్క మూలమును విచారణ ద్వారా ఎంతో సాధన చేసి తెలుసుకొంటారు. మరికొందరు పరమాత్మకు శరణాగతి చేసి అంతా నీవే నాకేది మంచిదో ? నాకన్నా నా స్వామికే తెలుసు అని వారి భారమంతా పరమాత్మ మీదనే ఉంచుతారు. ఇలా ఎన్నో రకాలుగా ప్రయత్నం చేసి, సాధన చేసి, జపాలు చేసి, యాగాలు చేసి, యజ్ఞాలు చేసి తెలుసుకోవలసిన తత్త్వజ్ఞానంను నాకు నీ అనుగ్రహంతోనే ఇచ్చేశావయ్యా!

జీవుడు అంతటా నిండివున్న నిన్ను (పరమాత్మను) అంతర్యామిగా ఉన్నాడని అన్వేషిస్తూ వెళ్ళిన తరువాత తెలుస్తుంది. అంతర్యామిగానే కాదు అంతటా నీవే ఉన్నావనే నీ తత్వం తెలుస్తుంది. ఇది ఏమి తత్వమయ్యా! మేము అంతర్యామిని తెలుసుకోలేం. ఎప్పటిదాకా దేహంతో తాదాత్మ్యం పోదో అప్పటి దాకా నిన్ను తెలుసుకోలేం. దేహబుద్ధి పోకపోతే, అంతర్యామి తెలియ బడడు. నీ లోపల ఉన్న 'నేను' ను నీవు

తెలుసుకొన్న తరువాతే అంతటా నీవే వున్నావనే విషయం తెలుస్తుంది. అప్పుడు తత్వం అర్ధమవుతుంది. ఇక్కడ అన్నదే అంతటా ఉన్నదని, అంతటా నిండివున్నదే ఇక్కడ ఉన్నది అనే అవగాహన వస్తుంది. భక్తుడికి ఆ తత్వం అర్ధమవ్వాలంటే అరుణాచలేశ్వరుడి అనుగ్రహముతోనే సాధ్యమవుతుంది అంటున్నారు భగవాన్.

## 43. తానేను తానను తత్వమిద్దానిని, తానుగా జూపింతు వరుణాచలా

**భావం :** అరుణాచలా ! తాననెడు తానే తత్త్వవస్తువగు ఈ తత్త్వస్వరూప సత్యవస్తువు యొక్క అర్ధమయిన నీవు నీ చిత్ప్రకాశ స్వరూపంను నేను ప్రత్యక్షముగా చూసినట్లు అనుగ్రహించితివి.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! మేము నిరంతరం ఈ నేనుతోనే (దేహగతమైన) తాదాప్యం చెందుతూ మా ఉనికిని మర్చి పోయాం. దేహగతమైన నేనుకు అసలు అస్థిత్వమే లేదు, ఇది ఆత్మగతమైన నేను నుండే బయలుదేరి వస్తుంది. ఇది అనుభవంలోనికి మాకు ఎప్పుడు వస్తుందయ్యా? జ్ఞానికి దేహముంది, అజ్ఞానికి దేహముంది కాని ఇక్కడ జ్ఞానికి నేను అంటే ఇతరములు కనబడనటువంటి స్థితి అంతటా నిండి వున్న 'నేనే' జ్ఞానికి అనుభవంలో ఉంటుంది. అజ్ఞానికేమో దేహగతమైన నేను మాత్రమే అనుభవంలో ఉంటుంది.

జీవుడు మనసు కల్పించిన మూడు అవస్థలైన జాగృతి, స్వప్నం, గాఢనిద్రలలో ఏదో ఒక దానిలో ఉంటాడు. వీటికి మూలం ఆత్మేనని ఎక్కడైతే మూడు అవస్థలు పుడుతున్నాయో ఆ మూలములోనే 'తానుగా' వ్యక్తమయ్యే నేను ఉంది. హృదయంలో నిరంతరం ప్రకాశిస్తున్న వెలుగే 'తాను' అన్న అనుభవం జీవునికి లేదు. "ఏకమక్షరం హృది నిరంతరం బాస్యతే స్వయం లిఖ్యతేకతం". అందరి హృదయంలో అహం అహమని ప్రకాశిస్తున్నది. అది స్వయంగానే వెలుగుతూ ఉంటుంది. దాన్ని వివరించటానికి ఎవ్వరం సరిపోం. అది ఉందని అనుభవంలో మాత్రమే అర్థమవుతుంది. దీన్ని మేము మా తెలివితేటలతో తెలుసుకోగలమా? ఏదైతే జీవుడికి దేహంగా, మనస్సుగా, ఇంద్రియములుగా వ్యక్తమవుతుందో దాని మూలంలోకి ప్రవేశిస్తే 'తాను' అనుభవం అవుతుంది. ఒక జ్ఞాని యొక్క లేక సద్గురువు యొక్క దర్శనం చేతనే వాళ్ళ అనుగ్రహం వలనే ఆ స్థితి వుందని దానిని పొందాలని అర్థమవుతుంది.

ఎవరైతే అరుణాచల గురువుని శరణు పొందుతాడో వారికి మాత్రమే ఆ నేను యొక్క మూలం తెలియబడుతుంది. మనో కల్పితములైన మూడు అవస్థలకు ఆధారంగా ఉన్న 'తానును' తెలుసుకోవటమే తత్వం ఎఱుగుట అవుతుంది. భక్తుడు తన దేహభావనను తొలగింపమని, ఆత్మాను భవమును, బ్రహ్మానుభవమును ప్రసాదించమని అరుణా

చలేశ్వరుడుని శరణుజొచ్చితే అప్పుడు అంతర్యామిగా ఉన్న పరమాత్మ జీవుడికి తానుగా వ్యక్తమవుతాడు. జీవులను ఆ స్థితికి చేర్చుమని భగవాన్ అరుణాచలేశ్వరుడుని వేడుకొంటున్నారు.

## 44 త్రిప్పియహంతను నెప్పుడు లోదృష్టి గన, తెలియుననుదే యరుణాచలా

**భావం :** అరుణాచలా! నీ నిజ స్వరూపమును చూసి అనుగ్రహించమని వేడిన నన్ను చూచి, ధృఢమైన వైరాగ్యంతో బాహ్య విషయాల నుండి మనస్సును అంతర్ముఖం చేసి తనను ఎప్పుడును వదలక "నేనెవరు" అని విచారించిన తానే స్వరూపంగా అనుభవమవుతుంది.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! మాకు ఎప్పుడు లోదృష్టి కలుగుతుంది ? ఎప్పుడూ బయట గొడవలే! ప్రపంచంలోని విషయాలను అది తెలుసుకో, ఇది తెలుసుకో అని చెప్తుందయ్యా మా మనస్సు. ఈ తెలుసుకోమనే మనస్సును తెలుసుకోవడానికి అది ఇష్టపడదు. ఎందుకంటే మాకు మా మనస్సు పోగొట్టుకోవడం ఇష్టం లేదు. అది ఉండాలి, భగవంతుడూ కావాలి. ఇదే మా సాధన, అసలు అంతర్ముఖ స్థితికి వెళితే ఈ మనస్సు నాశనమవుతుందని దీని భయం.

ఎవరైతే నిరంతరం బ్రహ్మం నందే దృష్టి పెడుతున్నాడో వాడు మాత్రమే అహంకారం చేత ఆవరింపబడిన అంధకారం

నుండి తేలికగా బయటపడతాడు అని ఉపనిషత్తులు, వేదాలు చెపుతున్నాయి. కాని మేము మా మనస్సును బ్రహ్మం మీద మా తెలివితేటలతో పెట్టగలమా! ఒక గురువు యొక్క అనుగ్రహం, ఒకజ్ఞాని యొక్క అనుగ్రహం ఉన్న వానికే సాధ్యమవుతుందివయ్యా! మనస్సు బాహ్యముఖానికి పరిగెడుతున్నంత కాలం అహంకారాన్నీ విడిచిపెట్టదు. బాహ్యమవుతున్న మనస్సుని ఎప్పటికప్పుడు గుహలోకి (హృదయం) ప్రవేశపెడుతుంటే గూడు వదిలి వచ్చిన పక్షిని మళ్ళీ గూటిలోకి ఎలా పెడతామో అలా మనస్సును వెనుకకి మళ్ళించి దాని పుట్టుక స్థానమేమిటో విచారించేట్లు చేయాలి.

ఓ అరుణాచలా! నీ నిజ స్వరూపమును అనుగ్రహించు, నాకు నువ్వు తప్ప అన్యం అవసరం లేదు అని భక్తుడు తన అహంకారంను నీ పాదాల మీద పెట్టాలి అప్పుడు వాడికి నీ నిజస్వరూపాన్ని ఇస్తావు లేదా దృఢమైన వైరాగ్యంతో బాహ్య విషయముల నుండి మనస్సును అంతర్ముఖం చేసి "నేనెవరు" అంటూ విచారణ చేస్తే నీవు స్వరూపంగా అనుభవంలోనికి వస్తావు. జీవుడి యొక్క స్ఫురణ, స్మరణ కూడా గురువే అనే భావంతో జీవిస్తే వారి అహంకారం పడిపోయి ఉన్న వస్తువు ఉన్నట్లుగా అనుభవంలోనికి వస్తుంది. అటువంటి అనుభవాన్ని జీవులకు అనుగ్రహించమని భగవాన్ అరుణాచలేశ్వరుడుని వేడుకొంటున్నారు.

## 45. తీరముండని యెద వెదికియుతన్ను నే, తిరిగి బొందితి బ్రోవు మరుణాచలా

**భావం :** అరుణాచలా! ఎల్లలు లేని చిదాకాశ స్వరూపమైన హృదయాకాశంలో, పోగొట్టుకొనిన నిన్ను వెదకి నేను నీ కృప చేత తిరిగి నిన్ను పొందితిని.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! సముద్రమునకు కూడా ఆవలి ఒడ్డు వున్నది. అసలు తీరంలేని, పరిమితులు లేని హృదయా కాశంలో, చిదాకాశరూపుడవై ఉన్న నీకు నేను జన్మపరం పరలలో దూరమైపోయాను. నా ఇంద్రియాలు నా మనస్సును బయటకు తీసుకొనిపోయాయి. నువ్వు ఎక్కడో వైకుంఠంలో ఉన్నావని, కైలాసంలో ఉన్నావని, ఆ గుడిలో, ఈ గుడిలో ఉన్నావని, ఆ క్షేత్రం ఈ క్షేత్రం దర్శించితే నువ్వు దొరుకుతావు అని నా మనస్సు ఇంద్రియాలతో కలసిపోయి నీ కోసం బయట వెతకడం మొదలుపెట్టింది. అహంస్ఫురణ నా అజ్ఞానం వలన కోల్పోయాను. జీవుడు వాడి రాగద్వేషాలు మనసులో పెట్టుకొని, తన అహంకారంతో దేవునిని ఎలా తెలుసుకుంటాడండి. వీడు భక్తుడే కాని నేను ఎక్కడున్నానని అవగాహన లేక తిరుగుతున్నాడు అని ఈశ్వరుడు గురురూపం ధరించి వీరిని చేరదీసుకొని సత్యంను బోధిస్తాడు. గురువు అనుగ్రహం లేకుండా సత్యం బోధపడదు.

బయటకు పరుగు తీస్తున్న మనసుకు అంతర్ముఖస్థితిని ఎఱుకపరచి అంతటా నిండి వున్న పరమాత్మ నీ హృదయాంత

రాళాలలో స్వరూపంగా ఉన్నాడనే సత్యాన్ని గురువు ఎఱుక పరుస్తాడు. గురువు యొక్క కృపతో ఈశ్వరానుగ్రహంతో జీవుడు పరమాత్మను తిరిగి పొందుతాడు. ఈ జీవులందరిని నీ అనుగ్రహానికి పాత్రులుగా చేసి నిన్ను పొందే వరం అనుగ్రహించమని భగవాన్ వేడుకొంటున్నారు.

## 46. సత్యజ్ఞానములేని యీ జన్మ ఫలమేమి, యొప్పగ రావేల యరుణాచలా

**భావం :** ఓ అరుణాచలా! అతి సూక్ష్మమైన విచారజ్ఞానం కొంచెం లేని ఈ జన్మ వలన నాకేమి ప్రయోజనం? ఈ జన్మను వృధా కానీయకుండా నాకు జ్ఞానాన్ని అనుగ్రహించు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! నేను సత్యం తెలుసుకోకుండా, జ్ఞానం తెలుసుకోకుండా, నా ముక్కులో గాలిపోతే నేను నష్టపోతానయ్యా! ఈ ముక్కులోని గాలి బయటకు పోకముందే నువ్వు ఎవరివో నువ్వు తెలుసుకో. నువ్వు ఎవరివో తెలియక పోతే నువ్వు ఎన్ని సాధించనప్పటికి అది స్వప్నంతోటి సమానం. నువ్వు ఎవరో నీకు తెలియకపోతే అది ఒకటి లేని సున్న. మీ మనస్సు కోతిలాంటిది కోతి ఏమిచేస్తుంది ఒక కొమ్మ మీద నుంచి ఇంకొక కొమ్మ మీదకి ఉరుకుతూ ఉంటుంది అలా మనసు కూడా ఒక తలంపుని పట్టు కొంటుంది. ఇంకో తలంపు మీదికి ఉరుకుతూ ఉంటుంది. అందుచేత శంకరాచార్యులవారు ఏమి అన్నారు అంటే కాశీ

వెళ్ళి విశ్వనాధ స్వామితో నువ్వు నాకు మోక్షం ఇవ్వవద్దు, ఏమి ఇవ్వవద్దు. నిన్ను ఏమి అడగడం లేదు. కాని, నాదగ్గర ఉన్నది ఒకటి నువ్వు పుచ్చేసుకో. నువ్వు పుచ్చేసుకుంటే నాకు లాభం నీకు లాభం అన్నాడు. నాకు ఈ మనసు పీడ వదలి పోతుంది ఈ అజ్ఞానం పీడ వదలిపోతుంది.

జ్ఞానమే నిజమైన ఐశ్వర్యం, ఆ ఐశ్వర్యం నువ్వు సంపాదించుకోకుండా శరీరం విడిచి పెట్టేసావు అనుకో ఈ శరీరం ఎందుకు వచ్చినట్టు? వంద బస్తాల బియ్యం అన్నం తినటానికా? పుట్టటం. నువ్వు మనిషి జన్మ ఎత్తినందుకు సాధించినది ఏమిటి? భగవంతుడు నీకు బుద్ధి ఇచ్చినందుకు సాధించినది ఏమిటి? ఆ జ్ఞానాన్ని సంపాదించు. ఆ జ్ఞానాన్ని సంపాదించకుండా నువ్వు శరీరం విడిచిపెడితే విపరీతమైన నష్టాన్ని పొందుతావు, ఈ అవకాశాన్ని ఉపయోగించుకో నువ్వు జ్ఞానాన్ని సంపాదించు.

దేవుడు నీ హృదయాన్ని పరిశీలిస్తాడు. మీ మనస్సులో ఎంత సౌందర్యముంది. ఎంత ఉదాత్తంగా జీవిస్తున్నావు. మనసు సహజంగా నిర్మలంగా ఉందో లేదో చూస్తాడు కాని, మీ పూజలు కానీ, జపాలు కాని నమస్కారాలు కాని చూడడు. మీ మనసు పక్వానికి వస్తే ఈశ్వరుడు మీకు ఆ జ్ఞానం అనే పంటను అనుగ్రహిస్తాడు. మీరు ఏపని చేసినా, మాట్లాడినా లోపలున్న తలంపును బట్టి ఈశ్వరుడు అనుగ్రహిస్తాడు.

జీవుడు సదా ఈశ్వరుడిని హృదయంలో పెట్టుకొని చేసే ప్రతీ పని ఈశ్వరార్పణ బుద్ధితో చేస్తే సత్యజ్ఞానాన్ని పరమాత్మ ప్రసాదిస్తాడు. జీవకోటిని ఆ విధంగా జీవించగలిగేటట్లు అనుగ్రహించు అని అరుణాచలేశ్వరుడుని భగవాన్ వేడుకుంటున్నారు.

## 47. శుద్ధవాఙ్మనయుతులం దోచు, నీ నిజా హంత గల్పి నను బ్రో వరుణాచలా

**భావం :** అరుణాచలా! పవిత్రతతో శుద్ధి చెందిన మనసు వాక్కు కలిగిన తలపండినవారు అనుభవించు నీ నిజ స్వరూపానుభవమును నేను కూడ అనుభవించునట్లు నన్ను అనుగ్రహించుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! సాధకుడు శుద్ధమైన వాక్కు, పక్వం చెందిన మనస్సు కలిగిఉండాలి. చిత్తశుద్ధితో కపటం లేకుండా జీవించాలి. అహంకారం, మమకారం లేకుండా త్రికరణశుద్ధిగా ఉండాలి. అలా ఉన్న సాధకుడికి మాత్రమే చైతన్యం అనుభవంలోనికి వస్తుంది. నీ నిజస్వరూపం పొందుతాడు.

కృష్ణ పరమాత్మ మీ మనస్సు వెన్నలాగా ఉంటే నేను మింగేస్తాను అన్నారు. మన మనస్సు ఒకటి ఆలోచిస్తే మాట ఇంకోలా వస్తుంది. పని వేరేవిధంగా చేస్తాం. ఇలా ఉంటే పరమాత్మ మనకెలా అందుతారండి. జీవుడు భగవంతుడినో

గురువునో విశ్వసించి వారిని సేవించి వారి బోధల ద్వారా తమకున్న త్రిగుణాలను తెలుసుకొని వాటినుండి విడుదల పొందాలి. గురువు అనుగ్రహంతో మనస్సులో ఉన్న మాలిన్యాలన్నీ తొలగించుకొని, తన మనస్సు, వాక్కు చేత ఒకటిగా జీవించాలి. ఎవరైతే వేరుబుద్ధి, బేధబుద్ధి లేకుండా జీవిస్తున్నారో సత్వగుణంను పెంచుకొని తద్వారా చిత్తశుద్ధిని పొంది, మనోనాశనం చేసుకుంటున్నారో వారికి అరుణా చలేశ్వరుని అనుగ్రహం లభిస్తుందని అంటున్నారు భగవాన్.

## 48. దైవమనుచు నిన్ను దరిజేరగా, నన్ను పూర్ణనాశమొనర్చి తరుణాచలా ॥అరుణాచల శివ॥

**భావం :** అరుణాచలా! నన్ను కాపాడి రక్షించు దైవమని యెంచి సదా నిన్నే తలచి శరణాగతి పొందిన నన్ను నా దేహాభిమాన గుణములతో మిళితమైన వానసలు, మొదలైన వాటిని ఒకేసారి నాశనమొనర్చితివి.

**నాన్నగారు :** అరుణాచలా ! నువ్వు దేవుడువు అని అందరూ చెప్పుకుంటున్నారు. నేను కుడా చూద్దాం అని నీ దగ్గరికి వచ్చాను. తీరా వచ్చిన తరువాత నువ్వు ఏమి చేశావు అంటే, పూర్తిగా వేరుతో సహా నన్ను నాశనం చేసి విడిచిపెట్టావు. దీని అర్థం ఏమిటంటే ప్రతిజీవుడికి దేహబుద్ధి ఉంటుంది, ప్రకృతి గుణాలు ఉంటాయి. దేవుడవని నిన్ను చూడటానికి నేను ద్వైతబుద్ధితోటి వచ్చాను. నువ్వు ఏమి చేశావు అంటే

దేహాభిమానాన్ని నశింపచేసేశావు. నాకున్న ద్వైతబుద్ధిని తొలగించి, అద్వైతబుద్ధిని కలుగచేసి నాకు అమృతత్వాన్ని ప్రసాదించావు.

ఏదైతే నేను అనుకుంటున్నానో, దేని కోసం నేను జీవిస్తున్నానో దానిని నాకు కాకుండా చేశావు. నాలో ఉన్న భిన్నభావనలను తీసేసి అభిన్నభావనను అంటే నీవు నేను ఏకమయ్యేటట్లు నీ స్వరూపాన్ని నాకు ప్రసాదించి అనుగ్రహించావు. అరుణాచలేశ్వరుడా నన్ను పూర్ణనాశనం చేసావు, నాలోని వేరుభావనని నాశనం చేసేశావు. ఇంక నాలో బేధబుద్ధిని తీసేశావు, భయం బేధబుద్ధి నుండే వస్తుంది. ఆ బేధభావం లేకపోతే భయం లేదు. భయం ఉంటే పునర్జన్మ వచ్చేస్తుంది. అందుకే దాన్ని నువ్వు తొలగించావు ఇంక నాకు పునర్జన్మలు రాకుండా చేసేసావు. అంతటా నేనే అయితే ఇంక నాకు వేరుగా ఏముంది ఈ సృష్టిలో నేను కోరుకోవడానికి.

వేరుగా ఉన్నంతకాలం ఏదో ఒకటి కోరుకోవాలనే బుద్ధి పుడుతుంది కోరిక వస్తుంది. దాన్ని సంపాదించాలి, దీనిని సాధించాలనే కోరికలకి అంతు ఉండదు, అనేక యుద్ధాలను జయించిన అలగ్జాండర్ తను చనిపోయిన తరువాత ఖననం చేసేటప్పుడు చేతులు బయటపెట్టమని చెప్పాడు. ఎందుకంటే ఎంత సంపాదించినా ఒట్టి చేతులతోనే పైకి పోయాడు అని తెలియడం కోసం అలా చెప్పాడు. ఎవరైతే త్యాగమే ధనంగా పెట్టుకుంటారో వాడికి మాత్రమే జ్ఞానం కలుగుతుంది.





ఆత్మను స్మరిస్తూ ఆత్మ కోసమే జీవించినవాడికి, ఆత్మను ధ్యానం చేసినవారికి, వారిలో ఉన్న కోరికలు, కొట్టుకుని పోతాయి అని, జీవులని ఆ స్థితిలో పెట్టమని భగవాన్ అరుణాచలేశ్వరుడుని వేడుకుంటున్నారు.

## 49. వెదకక గనిన సచ్ఛ్రీయనుగ్రహనిధీ, మదితెగుల్ తీర్చి బ్రో వరుణాచలా

**భావం :** అరుణాచలా ! నేను ఏ ప్రయత్నం చేయక వెదుకకనే లభించిన ఓ సచ్ఛీల సద్వస్తువగు యనుగ్రహనిధి నీ నిజ సంపదయగు, జ్ఞాన స్వరూపంను తెలిసికొనక, కలత చెందిన నా మనోవ్యధను పోగొట్టి, అనుగ్రహరూపమగు ఆత్మ తత్వమును పొందునట్లు చేయుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! నేనేమీ సాధన చేయలేదు, జపాలు చేయలేదు. నిన్ను పొందుటయే జీవితగమ్యం అని కానీ, నిన్ను పొందాలి అనే కోరికగాని, తలంపుగాని నాకు లేదు. నేనేమీ ప్రయత్నాలు చేయలేదు. నా పూర్వజన్మ ఫలము ఏమోకాని నువ్వు నన్ను అనుగ్రహించావు. ఇది నీ యొక్క అవాజ్యమైన ప్రేమ, కరుణయేగాని నా సాధన ఇసుమంతయు లేదు.

పరమాత్మ ఎవరిని ఎన్నుకుంటాడండీ ఎవరైతే కారణ నిమిత్తం ఈ భూమి మీదకు వచ్చారో వారి గురించి పరమాత్మకు తెలుస్తుంది కదా వారిని ఎన్నుకొని తన కరుణ,

ప్రేమతో తన దగ్గరకు రప్పించుకుంటాడండీ అలా ఈ రమణస్వామి అరుణాచలేశ్వరుడుని చేరుకున్నాడండి. అయినా నా లోపల ఇంకా ఏమైనా అవలక్షణాలు ఉంటే వాటిని కూడా నాశనం చేసి నాలో ఏమైనా కుట్ర ఉంటే అది అంతా కూడా తీసేసి, నీ యొక్క పూర్ణ స్వరూపం నాకు అనుభవంలోకి తెచ్చి మనసులోని వ్యధని నాలో ఉన్న కలతని పోగొట్టు అరుణాచలా ! అని అడుగుతున్నారండి భగవాన్.

మరి అరుణాచలేశ్వరుడు ఎన్నుకొన్న రమణస్వామి ఎందుకు అడుగుతున్నాడండి. ఈ జీవుడికి నేర్పించటానికే నండి. అరుణాచలా! నీ దగ్గర ఉన్న అనుగ్రహమనే నిధిని అంటే నువ్వు జ్ఞానస్వరూడివి, నీ నిజసంపద ఏమిటి ఆత్మస్థితి. అలాంటిస్థితిని నేను పొందాలంటే నా మనస్సులో ఉన్న కల్మషాలు, బేధబుద్ధి అన్నీ పొగొట్టు, నీ అనుగ్రహం లేకుండా నాలో ఉన్న జీవలక్షణాలు పోతాయా? నా సాధన ఏపాటిది. నాలో ఉన్న అశాంతిని, అజ్ఞానాన్ని, బేధబుద్ధిని సమూలంగా తొలగించి నీ నిజస్వరూపానుభవం నాకు ప్రసాదించి నన్ను అనుగ్రహించు అరుణాచలా! అని జీవుడు వేడుకుంటే అరుణాచలేశ్వరుడు కరుణ చూపించకుండా ఉండలేడు అని అంటున్నారు భగవాన్.

## 50. ధైర్యము పరుగిడు నీ నిజాహ మరయ, నే నాశమైతి బ్రో వరుణాచలా

**భావం :** అరుణాచలా ! ఈ అహంకారంతో నీ నిజ స్వరూపం అంతర్ముఖంగా తెలిసికొనుటకు ప్రయత్నించితిని. దానికి కావలసిన అర్హతలు నాకు లేకపోవుటచే నా తెలివితేటలు చెడి నాశనమైతిని. నా దైన్యమును పోగొట్టి అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! ఆత్మజ్ఞానసముపార్జన కోసం నేనేమీ ప్రయత్నం చేయలేదు. అయినా జీవుడు తన అహంకారం పెట్టుకొని జ్ఞానం సంపాదించగలడా! జీవుడి సాధన ఎలా ఉంటుంది అంటే వీడికి అన్నీ కావాలి, దేవుడు కూడా కావాలి. మరి ఎలా దొరుకుతాడండి ? నా అహంకారంతో నేను సాధన చేయగలనా జ్ఞానం సంపాదించా లంటే కొన్ని అర్హతలు కావాలి కదా! ఏకాగ్రత, పవిత్రత, ప్రవీణత ఇవి అన్నీ జీవుడు సంపాదించుకుంటే అప్పుడు జ్ఞానంకు కావలసిన అర్హతలు వస్తాయి. ఇవి అన్నీ ఉన్నా నీ అనుగ్రహం లేకుండా నువ్వు తెలియబడతావా. నేనేదో నా తెలివితేటలతో నిన్ను పొందుదామని ధైర్యంతో వచ్చాను. వచ్చాక తెలిసింది అరుణాచలా ! నీ అనుగ్రహం లేకుండా, నీ ప్రేమ లేకుండా, నీ దయ లేకుండా నీవు తెలియబడవని తెలిసింది. నేనేదో నా అహంకారంతో నిన్ను పొందుదామని వచ్చి నేను నాశనమైపోయాను అని భగవాన్ అన్నారు.

జీవుడు తన అహంకారమమకారాలను భగవంతుడి పాదాల దగ్గర పెట్టి, ప్రారబ్ధంలో ఏది వచ్చినా అంటే మంచికి పొంగిపోకుండా చెడ్డకి కృంగిపోకుండా, ధైర్యంగా నిలబడి సమబుద్ధితో స్వీకరించి కర్తృత్వభావం లేకుండా, పని కోసమే చేస్తు పరమాత్మ నీవే కావాలి నీ పాదాలే చాలు నాకు అంటూ శరణాగతి చేస్తే అప్పుడు ఆయన స్వరూపాన్ని నీకు అనుభవం లోనికి తీసుకునివస్తాడు.

మన అహంకారంతో భగవంతుడిని పొందలేము అహంకారం నాశనమైతేనే ఆ స్వరూపానుభవం కలుగుతుంది. జీవుడు ధ్యాస అంతా బాహ్య సంపద మీద కాకుండా లోపలి సంపదను పెంచుకోవడం కోసమే ఉంటే అప్పుడు ఆయన అనుగ్రహం మన మీద వర్షించి ఏ వస్తువును పొందిన తరువాత ఇంక పొందవలసినది లేదో ఏ స్థితికి చేరిన తరువాత దాన్ని మించిన స్థితి లేదో ఆ స్థితిని జీవుడికి పరమాత్మ అనుగ్రహిస్తాడు. జీవుడిని ఆ స్థితికి పంపించమని భగవాన్ అరుణాచలేశ్వరుడుని వేడుకుంటున్నారు.

## 51. తాకి కృపాకరము నను కలియకున్న, నిజము నశింతు బ్రో వరుణాచలా

**భావం :** అరుణాచలా ! నీ అనుగ్రహకరములచే నన్ను తాకి నా దేహమును ఆలింగనం చేసుకొననిచో, నేను జన్మ ఫలితమును పొందక నష్టమయి పోవుదును. అట్లు నశించి పోకుండా నన్ను కాపాడు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! జీవులను రక్షించే పని నీవు పెట్టుకున్నావు మా అజ్ఞానంను మేము ఎన్నో జన్మల నుండి వెంటపెట్టుకుని ఈ భూమి మీదకు వచ్చాం. నీ యొక్క అనుగ్రహపూరితమగు హస్తములతో తాకి (నీహస్త స్పర్శ) నేను పవిత్రుడయ్యేటట్లు అనుగ్రహించు తండ్రీ.

నేను ఏమైనా నిన్ను స్మరించానా, అడిగానా నన్ను తీసుకోమని నాకు ఆ తెలివి ఉందా. నీవే నీ అనుగ్రహంతో అరుణాచలం రప్పించుకున్నావు. ఇప్పుడు నన్ను పట్టించు కోకుండా నాకు దూరంగా ఉన్నావేంటి, నీ అనుగ్రహ పూరితమైన హస్తములతో నన్ను బంధించి నీవాడివి చేసుకొని నీలో ఐక్యం చేసుకో అరుణాచలా! అలా నీవు చేయకపోతే నేను ఈ లోకచింతనలో పడిపోయి పాడయిపోతానేమో, నన్ను అలా వదిలేస్తావా? నీవే నన్ను స్మరించేటట్లు చేసావు. నీ కరుణతో, దయతో నన్ను ఇక్కడకు రప్పించావు. మరి ఇప్పుడు అలా ఉండిపోతే ఎలా అరుణాచలా! నన్ను నీ చేతులలోకి తీసుకొని నీ కృపను నామీద వర్షింప చేయకపోతే, నేను నిజంగానే నశించిపోతాను (పాడైపోతాను) అలా నన్ను ఇహానికి, పరానికి పనికిరాకుండా చేయకు నీలో నన్ను ఐక్యం చేసుకొని నీ స్వరూపానుభవమును నాకు ప్రసాదించు అరుణాచలా ! అంటున్నారు భగవాన్.

జీవుడు అంతిమ లక్ష్యం ఏమిటండీ, ఏ వస్తువుని తెలుసుకుంటే ఇంక జననమరణాలు ఉండవో, ఏ స్థితిని

పొందిన తరువాత అంతకన్నా గొప్పస్థితి ఉండదో, ఆ ఆత్మస్థితిని పొందుటయే జీవుడి గమ్యం. భూమి మీదకు వచ్చి ఇక్కడ పొందవలసిన అనుభవాలు అన్నీ పొంది ఈ భూమిని ట్రైనింగ్ గ్రౌండ్‌గా ఉపయోగించుకొని, తన మనసు నాశనం చేసుకుంటేనే పరమాత్మలో ఐక్యమవుతాడు. జీవుడిని ఆస్థితికి పంపించమని భగవాన్ అరుణాచలేశ్వరుని వేడుకుంటున్నారు.

## 52. దోషరహితనీవు నాతో నైక్యమయి, నిత్యానంద మయ మొనర్పరుణాచలా

**భావం :** అరుణాచలా ! దోషరహితుడవైన నీవు నన్ను కూడా నీ అంతటి వాడిని చేసి, నీలో ఐక్యం చేసుకో. నీ నిత్య ఆనందమయ రూపాన్ని ప్రసాదించు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! నీకు ఏ దోషాలు లేవు నువ్వు స్పటిక లాంటి వాడవు. దోషాలు లేని స్థితికి మనం ఎప్పటికి చేరతాం. మన మనస్సు ఎప్పటికి ఎదుగుతుంది? మనం చేసే స్నేహాలు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనం తినే ఆహార విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనం చేసే పనులు జాగ్రత్తగా ఉండాలి. అప్పుడు దోషాలు లేని స్థితికి మనం ఎదగగలం. ఎదగడం అంటే శరీరం ఎదగటం కాదు మనస్సు ఎదగాలి, మానసిక వికాసం పొందాలి. అన్ని విషయాలలో జాగ్రత్త పడితే అప్పుడు మన దోషాలు మన మనస్సు నుండి రాలిపోతాయి, కాలిపోతాయి.

అరుణాచలా ! నీవు దోషరహితుడివి, లోకరహితుడివి, పాపరహితుడివి. ఎక్కడ బలహీనతలు లేవో అక్కడ వున్నావు అక్కడికి తీసుకుపోవయ్యా ! ఒక జ్ఞాని ప్రక్కన మనం కూర్చున్నా భౌతికంగా ఎంతో దగ్గరగా ఉంటాడు, కానీ లోపల చూస్తే జ్ఞాని ఎక్కడ ఉన్నాడు, మనం ఎక్కడ ఉన్నాం సాధన పేరుమీద ఎంత కష్టపడినా, ఎంత దుఃఖపడినా, హృదయంలో ఈశ్వరుడి మీద ప్రీతి ఉందో లేదో చూసుకోండి. పూజలు, జపాలు, ధ్యానాలు అంటున్నారు. యాత్రలు అంటూ కష్టపడుతున్నారు కాని హృదయంలో ఎప్పుడైనా మీకు ఈశ్వరుడి పట్ల ప్రీతి కలిగిందా. హృదయంలో ప్రీతి లేకుండా సాధన చేయటం వలన ప్రయోజనం లేదు. కనీసం మీ బిడ్డలను ఎలా ప్రేమిస్తున్నారో అలా అయినా ఈశ్వరుని ప్రేమిస్తున్నారా ! ఈశ్వరుడి మీద మినహాయింపులు లేని ప్రేమ నీకు కలిగితే నీలోని దోషాలు అన్ని కరిగిపోతాయి అప్పుడు పరమాత్మ నీతో ఏకమయిపోతాడు నిరంతరం ఆనందంగా ఉండే స్థితికి నీవు వెళ్ళిపోతావు అంటున్నారు భగవాన్.

రామకృష్ణుడు కాన్సర్‌తో పీడింపబడుతున్నప్పుడు, నరేంద్రుడికి సందేహం వస్తుంది. దేవుడుతోటి సమానమైన వాడివేనా కాదా! పైకి అడగటానికి సిగ్గుపడుతున్నాడు. అప్పుడు రామకృష్ణుడు అంటాడు, ఎవరైతే రాముడో, ఎవరైతే కృష్ణుడో వాడే ఈ రామకృష్ణుడు అంటారు. మనం మన

గురువుని భగవంతుడిని విశ్వసిస్తే నీలో ఉన్న దోషాలన్నీ ఆయనే తొలగిస్తాడు. నీవు భగవంతుడిలో ఐక్యమయిపోతావు. ఆ ఆనందస్థితికి జీవులను పంపమని అరుణాచలేశ్వరుడిని భగవాన్ వేడుకొంటున్నారు.

## 53 నగకు యెడముకాదు నిన్వేదికిన నన్ను, గనుకృపానగ వేసి యరుణాచలా

**భావం :** అరుణాచలా! నాలో కనిపించిన గుణ విచారములను చూచి నవ్వుటకిది సమయం కాదు. నీవే గతియని వచ్చిన వానికి నీ అనుగ్రహం అనెడి చిఱునవ్వు చిందించి నన్ను నీ అనుగ్రహ చూపుతో వీక్షించి కటాక్షింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నిన్ను వెతుక్కుంటూ నాకు ఈశ్వరుడే భర్తగా రావాలి నాకు ఈశ్వరుడే కావాలి. నా సర్వస్వం ఈశ్వరుడే నాకు ఈ లోకంలో కాని, పరలోకంలో కాని కోరదగినది ఏమీ లేదు. నేను పొందవలసినది ఏమీ లేదు. నాకు నువ్వే కావాలి అని నిన్నే స్మరించుకుంటూ నీ కోసమే వచ్చాను. అలా వచ్చిన నన్ను చూసి ఎగతాళి చేస్తావా! అది నీకు న్యాయమా అరుణాచలా! నిన్ను వెతుక్కుంటూ వచ్చిన నాకు గుణసంపదలు లేవు. రూపాయలు లేవు, ఎకరాలు లేవు ఏమీలేకుండా వచ్చిన నాకు నీవు నగలు పెట్టొద్దు, ఏమీ ఇవ్వొద్దు, నీ అనుగ్రహం నీ కృప అనే ఆభరణములతో నన్ను అలంకరించు నీశాంతితో, నీ కాంతితో

అలంకరించి నన్ను చూసుకో అరుణాచలా! నీ నుండి ధనం కాని, లోకం గొప్పలు కాని, నిన్ను కోరడం లేదు. ఒక్కటి మాత్రం అడుగుతున్నాను. నీ యొక్క అనుగ్రహం అనే ఆభరణంతోటి నన్ను అలంకరించు.

అరుణాచలేశ్వరుడా! నీ కరుణతోటి, నీ ప్రేమతోటి, నీ వాత్సల్యం తోటి నిండు మనస్సుతోటి నన్ను అలంకరించు. నీ కరుణ, దయ, అనే నగ నామెడలో వెయ్యి అరుణాచలా అని ప్రార్థిస్తుంది ఈ పెళ్ళికూతురు. ఎంత ఎత్తులోకి, ఎంత లోతుల్లోకి వెళుతున్నది ఈ పెళ్ళికూతురు. మనకు లోకానికి సంబంధించిన ఎన్ని గొప్పలున్నా హృదయంలో మాత్రం జ్ఞాన దీపం లేకపోతే ఆముదం పుచ్చుకున్న మొహం ఎలా ఉంటుందో జ్ఞానం లేని ముఖం అలా ఉంటుంది. ఈ పెళ్ళికూతురు అడుగుతుంది. ఏమిటంటే, నీ ప్రేమను అందివ్వు, నా హృదయంలో జ్ఞాన దీపాన్ని వెలిగించు అని, దేవుడు దగ్గరకు వెళ్ళి స్వామీ ! నాకు జ్ఞానం ప్రసాదించు, వైరాగ్యం ప్రసాదించు అని అడిగే జీవులు ఎంతమంది ఉన్నారు. బండెడు పుస్తకాలు చదవటంకంటే, పుణ్యక్షేత్రాలు దర్శించడం కంటే మీరు నిర్మలంగా ఏకాంతంగా ఇంటి దగ్గర కూర్చుని ధ్యాన పూర్వకంగా పరమేశ్వరుణ్ణి ఇటువంటి ప్రార్ధన చేస్తూవుంటే ఆయన కరుణ, దయ, మీకు ఇవ్వకుండా అరుణాచలేశ్వరుడు ఉండలేడు అంటున్నారు భగవాన్.

## 54 నానలేదె వెదుక నేనయి నీవొంటి, స్థాణువై నిలిచితి వరుణాచలా

**భావం :** అరుణాచలా ! నిన్ను పొందవలెనన్న తీవ్రమైన ఆశతో సహజమైన సిగ్గును విడిచి నాఅంతట నేను నిన్ను చేరుటకు వచ్చినను నీవు కొంచమైనను కదలిక లేక ఒక స్తంభం వలే చలనం లేక నిలుచుంటివి! ఇది నీకు తగదు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! ప్రతి జీవుడు నేను నేను అంటున్నాడు. ఈ నేను దేహానికి పరిమితమైన నేను. మరి కృష్ణపరమాత్మ కూడా 'నేను' 'నేను' అన్నాడు అది దేహానికి సంబంధించిన నేను కాదు. అంతటా వ్యాపించి అనంతంగా ఉన్న బ్రహ్మమే పరమాత్మ చెప్పిన 'నేను' నా దేహగతమైన నేను నుండి విడిపోయి సత్యమైన, శాశ్వతమైన 'నేను'ను శోధించటము మొదలుపెట్టాను. అసలు సత్యమైన 'నేను' ఎక్కడవుంది శాస్త్రములలో లేదు, అది హృదయంలో అంతర్యామిగా ఉంది అని పరమాత్మ చెప్తుతున్నాడు. దానిని శోధించి దానిలో ఐక్యమవడమే జీవుడి గమ్యం అని కూడా చెప్పాడు.

పరమాత్మ పాదాలు ఆశ్రయిస్తేనే 'నేను' మూలం తెలుసు కోగలుగుతాం. జీవుడి తెలివితేటల వలన పరమాత్మ స్వరూపమైన సత్యమైన నేనును తెలుసుకోగలనా. సముద్రం లోనికి ముత్యంచిప్పలు కోసం గాలిని బంధించి, అన్వేషకుడు

ఎలా లోపలికి మునుగుతాడో ఈ ఆత్మ అనే ముత్యం తెలుసుకోవాలనే సాధకుడు అంత తపనగా తన దేహాన్ని మనస్సుని తపింపచేసి అంతర్ముఖుడై అన్వేషించాలి. ఎప్పుడు మనస్సు మూలం తెలుస్తుందో అక్కడ నిరంతరం జ్యోతి స్థంభపు రూపంలో వెలుగుతున్న అరుణాచలేశ్వరుడు స్వరూపంగా 'తాను'గా వ్యక్తమవుతాడు. సత్యమైన నేనును అన్వేషించగా పరమాత్మ ఒంటి స్తంభవు రూపంలో నిశ్చలంగా వెలుగుతూ ఉంటాడు. ఎప్పుడైతే ఈ జీవుడు తన 'నేను' మూలం చేరుకుంటాడో ఆ మూలంలో వెలుగుతున్న స్వరూపములో ఐక్యమయి 'తాను'గా స్థాణువై నిలిచిపోతాడు. అది వాడి కడసారి జన్మ, జీవులు ఆ స్థితికి వెళ్ళటానికి అరుణాచలేశ్వరుడిని కరుణ, దయ వర్షింపమని భగవాన్ వేడుకొంటున్నారు.

## 55 నీ జ్వాల గాల్చినన్ నీఱుసేసెడు మున్నె
## నీకృప వర్షింపు మరుణాచలా

**భావం :** అరుణాచలా ! నన్ను నీ తేజోరూపమైన జ్ఞానాగ్నిలో కాల్చి భస్మం చేయుటకు ముందు దానిని సహించుకునేటట్లు నామది చల్లబడేటట్లు, నీ కృపావర్షం కురిపించి అనుగ్రహించు.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! నీ జ్ఞానాగ్ని వచ్చి నా అజ్ఞానాన్ని కాల్చకముందే నీ అనుగ్రహం వర్షింపుము. వానలు లేకపోతే మనం కంగారు పడిపోతామే కాని ఈశ్వరుడి యొక్క

కృప దైవానుగ్రహం అనే వర్షం, మన మనస్సుని మన హృదయాన్ని తడపకపోతే ఎప్పుడైనా బాధపడ్డామా!

భగవంతుడిని చేరుకోవాలంటే ప్రతి జీవుడు కోరిక, కోపం, భయం అనే మూడు గుణాలను దాటాలి అని పరమాత్మ చెబుతున్నాడు. ఏ జన్మలో అయినా సరే, మీరు ఏ లోకంలోకి వెళ్ళినా సరే ఈ మూడు గుణాలను దాటాలి. ఈ మూడు గడపలు దాటినవాడే భగవంతుడికి చేరువకాగలడు.

నాకు ఏదైనా రోగం వస్తే డాక్టరు అవసరం రోగం తగ్గిపోయాక డాక్టరుగారితో పనేముంది. ఎవరైనా కష్టాలలో, బాధలలో ఉన్నప్పుడు ఉపకారంచేస్తే అది నిజమైన సహాయం. కష్టాలు తీరిన తరువాత వాళ్ళకి ఉపకారం ఎందుకు? ఓ అరుణాచలేశ్వరుడా ! నీ జ్ఞానాగ్ని వచ్చి నాలోని అజ్ఞానాన్ని, కాల్చక ముందే దాన్ని తట్టుకోగల శక్తిని ఇవ్వు. ఆపరేషన్ ముందు పేషెంట్‌ను ఏ విధంగా సిద్ధం చేస్తారో, అలాగ నువ్వు నా అహంకారాన్ని లొంగదీసుకొని ఈ జీవుడిని నీ స్వాధీనంలోకి వచ్చేలాచేసుకో. నా అహంకారం నన్ను పాడు చేయక ముందే నీ కృప అనే వర్షంలో నన్ను ముంచి నా అహంకారాన్ని కడిగేసి అది ఎలా నీకు స్వాధీన మవుతుందో అలా చేసి అనుగ్రహించు.

అరుణాచలేశ్వరుడి కృపాకటాక్షవీక్షణాలు ఈ జీవుడి మీద వచ్చి పడినపుడు నదికి వరద వచ్చినంత వేగంగా

వస్తుంది. ఊపిరే సలపదు అనుగ్రహ వర్షంలో ఈ మిథ్యా నేను అడ్రస్ లేకుండా పోతుంది. అటువంటి అనుగ్రహాన్ని జీవుల మీద ప్రసరింపచేసి వారి అహంకారాన్ని నాశనం చేసేసి నీ జ్ఞానానికి వారసులను చేయమని భగవాన్ అరుణా చలేశ్వరుడుని వేడుకొంటున్నారు.

## 56 నీవునే నణుగ నిత్యానంద మయముగ, నిలుచు స్థితి కరుణిం పరుణాచలా

**భావం :** అరుణాచలా ! నీవు వేరు, నేను వేరు అను బేధ భావమును పూర్తిగా నామది నుండి తొలగించి, ఆదరముతో నన్ను గట్టిగా ఆలింగనం చేసుకొని, నిత్యం ఎనలేని ఆనంద సుఖానుభవములో సదా ఉండునట్లు అనుగ్రహించుము.

**నాన్నగారు :** నేను అణిగిపోతాను, నువ్వుకూడా అణిగిపో. నువ్వు దేవుడి వేషం వేశావు. నేను జీవుడి వేషం వేశాను. దేవుడికి, జీవుడికి ఆధారంగా ఉన్నది చైతన్యం. నీ వేషం నువు తీసేయి నేను నా వేషం తీసేస్తాను. ఇద్దరం ఒకటి అయిపోదాం. ఈ వేషాలు తీసేస్తే ఉన్న చైతన్యం అనుభవం లోనికి వస్తుంది.

నేను ఎలాగో అణగిపోతాను నువ్వు కూడా అణిగిపో. అప్పుడు నీ యొక్క అనుగ్రహం నా అనుభవంలోనికి వస్తుంది. నువ్వు వేరు నేను వేరు అనే బేధబుద్ధి ఉంటే నాకు నిన్ను ఏదోఒకటి అడగాలని అనిపిస్తుంది. ఉన్నది ఒక్కటే అయితే

అడిగేవాడు లేడు. ఈ ప్రపంచం తోటి. దేవుడు తోటి, నీకు వేరు బుద్ధి ఎప్పుడైతే పూర్తిగా పోయిందో లోపల ఉన్న నిజమైన ఆనందం పొంగుతుంది. అది స్వతంత్రమైనది. అది మనుషుల మీదకాని ప్రపంచం మీదకాని, చావుపుట్టుకల మీద కాని, బాహ్యమైన సంపదల మీద గాని ఆధారపడినది కాదు.

ఏసు బైబిల్‌లో ఉన్నాను ఆ ఉన్నది ఏదో నేనైయున్నాను అంటాడు అది సత్యమైన నేను యెహోవా లేనప్పుడు కూడా ఉన్నాను. తండ్రి లేకుండా కుమారుడు ఎలా ఉంటాడు. ఈయన ఏమంటున్నాడు అంటే నేను ఉన్నాను ఆ ఉన్నదేదో నేనైయున్నాను అదే సత్యం అది శరీరం లేనిది, మనస్సు లేనిది, ప్రపంచంలేనిది. బైబిల్‌లోని ఈ మాట భగవాన్‌కి బాగా నచ్చింది. నీవు నేను అణగ నిత్య ఆనంద మయముగా ఒకరోజు బాగుండి ఇంకోరోజు బాగోలేదు అంటారు. అలాంటి స్థితి కాదు ఎప్పుడూ ఉండే స్థితిలోకి మనల్ని తీసుకు పోతున్నారు భగవాన్. అక్కడ రాత్రి లేదు, పగలు లేదు అది అలౌకికం అది అభౌతికం అక్కడకు మేల్కొలుపుతున్నారు భగవాన్.

సబ్జక్ట్ వచ్చాక ఆబ్జెక్ట్ వస్తుంది. నేను సబ్జక్ట్ నీవు ఆబ్జెక్ట్ నేను వచ్చాక నువ్వు వస్తుంది. నేను లేకపోతే, నీవు లేవు. ప్రపంచము లేదు. నేను ముందు అణిగిపోవాలి. మనస్సును బంధించాలి. అప్పుడు దానికి విషయాలు అందక నెమ్మదిగా కరిగిపోయి ఆత్మాకారం చెందుతుంది. అప్పుడు ఎటు చూసినా

ఆనందమే ఎటు చూసినా శాంతే. అప్పుడు అన్ని దుఃఖాల నుండి విడుదల వచ్చేస్తుంది. సాధన ఎందుకు అంటే సాధకుడు లేకుండా పోవటానికే, మళ్ళీ తిరిగి సాధనలోకి రాకుండా ఉండటానికే సాధన. ఈ 'నేను' అనే ఒంటి స్తంభపు 'మేడను' షేక్‌చేయాలి అదే సాధన. అటువంటి సాధనలోకి జీవులను మేల్కొల్పమని భగవాన్ అరుణాచలేశ్వరుడుని వేడుకుంటున్నారు.

## 57 అణురూపు నిన్ను నే మిన్ను రూపం జేర, భావోర్ము లెపుడాగు నరుణాచలా

**భావం :** అరుణాచలా ! అతి సూక్ష్మరూపముగా చిదాకాశ స్వరూప ప్రకాశమైన నిన్ను నా హృదయంలో చేర్చి అనుభవించుటకు అడ్డంకులుగా నున్న సాగరతరంగముల వంటి ఆలోచనాకెరటములు హృదయమున పొంగుచున్నవి. నీ కృపచే అవి ఎప్పుడు తగ్గునో?

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! మనస్సుంది చూసావు దీని గోల నేను పడలేకపోతున్నాను, నిరంతరం ఏదో ఒక తలంపుతో కలసిపోతూ ఉంటుంది. ఈ తలంపులు ఎలా ఆపగలను. సముద్రంలోని కెరటాలు ఎలా ఎడతెరపి లేకుండా నిరంతరాయంగా వస్తున్నాయో నా మనస్సులో కూడా ఈ తలంపులు, ఆలోచనలూ పుడుతూనే ఉన్నాయి. వీటితో కలిసిపోయి నా మనస్సు బాహ్యముఖానికి వెళ్ళి నన్ను ఎన్నో

నీచ జన్మలలో పడవేస్తుందయ్యా! నీ స్వరూపం ఏమిటంటే అతి సూక్ష్మమైన అణువు నుండి బ్రహ్మాండం వరకు వ్యాపించి ఉన్న చిదాకాశరూపుడివి. మరి ఈ మనస్సు తలంపులతో కలిసిపోకుండా నిన్ను చేరుకోవాలి అంటే నా మనసును ఉపసంహరించి, దాని మూలం చేరుకుంటేనే కాని నీ స్వరూపానుభవము అవ్వదు కదా!.

నా తలంపులే నన్ను నీకు దూరం చేస్తున్నాయి అరుణాచలా! నా మనస్సును, ఇంద్రియాలను ఎండింపచేసి నేను అమనస్కస్థితికి, తలంపులు లేని స్థితికి చేరాలని గురువు చెపుతున్నారు. మరి నా తెలివితేటలతో, నా అజ్ఞానంతో ఆ స్థితికి నేను చేరగలనా !

ఎప్పుడైతే జీవుడు తన శ్వాసను ధ్యాసను పరమాత్మ కోసమే నిలబెట్టి అంతర్ముఖుడై పరమాత్మను చేరుకుంటాడో, సముద్రంలో అలలు ఎగిసి పడినట్లుగా ఉవ్వెత్తున ఎగిరిపడే ఈ తలంపుల సమూహములను వైరాగ్యం, విచక్షణలతో గురువు యొక్క అనుగ్రహంతో ఒక్కొక్కటిగా తీసివేస్తాడో అక్కడ మూలంలోనే ఉన్న పరమాత్మలో ఐక్యమవుతాడు, ఎప్పుడైతే ఈ జీవుడు తన మూలతలంపు మూలం చేరుకుంటాడో అప్పుడు ఈ ఆరాటాలు, పోరాటాలు అన్నీ ఆగిపోతాయి. తలంపులేనిస్థితికి, మనస్సులేని స్థితికి ఎదిగిపోతాడు. జీవులకు ఆ స్థితిని అనుగ్రహించమని భగవాన్ అరుణాచలేశ్వరుడుని ప్రార్థిస్తున్నారు.

## 58 సూత్రజ్ఞానములేని పామరు నామాయా, జ్ఞానము గోసి కా వరుణాచలా

**భావం :** అరుణాచలా ! శాస్త్రజ్ఞానం కొంచమైనను తెలియని మూఢుడను. నా అహంకారం, మూలంతో సహా పెకిలించి నాశనంచేసి స్వరూపజ్ఞానం నాకు భోదించి అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నాకేమీ బ్రహ్మసూత్ర జ్ఞానం లేదు. ఏ పాండిత్యం లేని వాడను, ఏ శాస్త్రాలు తెలియని పామరుడుని నేను. నేను ఉపనిషత్తులు చదువుకోలేదు, వేదాలు నేర్చుకోలేదు, బుద్ధుడు చెప్పిన అష్టాంగయోగాలు నాకు తెలియవు, పతంజలి యోగసూత్రాలు నాకు తెలియవు. ఈ మనోదేహాలకు అతీతంగా ఒక సద్వస్తువు ఉందని కూడా నాకు తెలీదు అలాంటి పామరుడైన నన్ను నీ జ్ఞానానికి అర్హుడ్ని చేశావు. నన్ను ఆత్మ సింహాసనం మీద కూర్చోపెట్టావు. ఈ మట్టి ముద్దను బంగారు ముద్దను చేసేశావు. ఎంత దయ చూపించావు అరుణాచలా!

ఎంత శాస్త్ర జ్ఞానమున్నా ఎంత పాండిత్యము ఉన్నా ఓ అరుణాచలా! నీ కృప లేకపోతే ఎవరూ నిన్ను పొందలేరు. జీవుడు పరమాత్మ తప్పించి తనకు అన్యము లేదని తీవ్రమైన తపనతో, నువ్వే దిక్కని ఎవరైతే అరుణాచలేశ్వరుడి పాదాలను శరణు వేడుకుంటాడో వాడు ఈ దేహాత్మబుద్ధి దాటి పోతాడు. అనన్య భక్తితో, ఇతర చింతనలు అన్నీ వీడి పరమాత్మ చింతన చేస్తూవుంటే వాడి జీవలక్షణాలన్నీ కాలిపోతాయి. మాయ

నుండి విడిపోతాడు. ఎప్పుడైతే జీవలక్షణాలు కాలిపోయాయో అరురుణాచలేశ్వరుడి యొక్క స్వరూపజ్ఞానం పొందుతాడు అని అంటున్నారు భగవాన్.

## 59 మక్కి మక్కి కరిగి నే నిన్ను శరణంద, నగ్నుడవై నిల్చి తరుణాచలా

**భావం :** అరుణాచలా! నీ కృపను పొందుటకు నా మనసు దేహము కరిగి మృదువై ప్రేమతో ద్రవించి నీవే నాకు దిక్కు అని వేడగా, నీవు కేవలము శుద్ధ చిదాకాశ స్వరూపుడవై గంభీరముగా నిలుచుంటివి.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నిన్ను స్మరించి నీ కోసము తపనపడేటట్లు నీవే చేసుకొన్నావు. అరుణాచలం అంటే సాక్షాత్తు ఈశ్వరుడు అనే భావన నాకు నువ్వు కల్పించావు. అరుణాచలం అనే పేరు బంధువు ద్వారా వినేటట్లు చేసి నాలో అణిగి ఉన్న భక్తిభావన పైకి పొంగేటట్లు చేశావు. అసలు జ్ఞానం అంటే తెలియని నాకు సద్వస్తువు ఒకటి ఉందని కూడా తెలియని నాకు, నువ్వే నా హృదయములో ఆత్మగా అనుభవంలోనికి వచ్చావు. అప్పటివరకు నాకున్న ప్రపంచ ఆకర్షణలని నీవే తీసేసావు. నా మనస్సు, దేహము నీ ప్రేమలో కరిగి పోయేటట్లు చేశావు.

నిన్ను విడిచి ఉండలేక నీవే దిక్కు, నీవే నాగతి, పతి అని నా మనస్సు, దేహము ప్రేమతో ద్రవించి నిన్నే శరణు

పొందాలని నిరాకారుడవైన నిన్ను ఆకారముగా తలంచి అన్వేషిస్తూ నీ దరికి చేరాను. నీవేమో చిదాకాశరూపుడువిగా అద్వైతతశిఖరం మీద దర్శనమిచ్చావు. ఇది ఏమి విచిత్రము అంటున్నారు భగవాన్.

### 60 నేస్తముండని నాకు నీయాశ జూపి, నన్ మోస గింపక బ్రోవు మరుణాచలా ॥అరుణాచల శివ॥

**భావం :** అరుణాచలా ! నిన్ను చూడవలెనన్న ఆశయో, అభిలాషయో కొంచెమైనను లేని నా కడకు నీవే వచ్చి, నీమీద నాకు కోరిక కల్గునట్లు చేసితివి. అలా ఆశను రేకెత్తించిన నీవే ఏదో కారణం చూపి, నన్ను మోసగింపక నా ఆశ నెరవేరునట్లు అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! నా కేమీ స్నేహాలు లేవు. నాకేమీ ఆధారాలు లేవు. ఈ లోకంలో నాకు ఇది అని చెప్పుకోవటానికి ఏమీ లేవు. అంటువంటి స్థితిలో నీ మీద నాకు ఆశ చూపించావు. నాకు చిన్న వయస్సులోనే నీ మీద కాంక్షకలిగింది. అది ఎన్ని జన్మలలో చేసిన పుణ్యమో ఆ వయస్సులో ఆయనకు అరుణాచలేశ్వరుడి మీద ప్రేమ కలిగింది.

మనందరికి ఏవో ఆధారాలు ఉన్నాయి కదా! నాకేమీ పరవాలేదు పొలముంది, మా అబ్బాయి ఉన్నాడు అంటారు. ప్రతిఒక్కరు లోకానికి సంబంధించిన ఏదో ఒక విషయం

మీద ఆధారపడి బ్రతుకుతున్నారు. కాని నాకు పరమేశ్వరుడు ఉన్నాడు. భగవంతుడు ఉన్నాడు అని ఎవరి మనస్సు అయినా భగవంతుడి మీద వాలుతుందా!


భగవాన్ అంటున్నారు ఓ అరుణాచలేశ్వరుడా! ఏ ఆధారాలు ఏస్నేహాలు లేని నాకు నీ మీద ఆశ కలిగించావు. నిన్ను నమ్మి వచ్చాను. నా కుటుంబాన్ని విడిచిపెట్టాను. నా బంధువులను విడిచిపెట్టాను. నేను అన్నీ విడిచిపెట్టి నీ పాదాల దగ్గరకు వచ్చాను గెంటివేయకు అరుణాచలా! నన్ను మోసం చేయకుండా ఈ లోకంతోటి కలసిపోనివ్వకుండా నాకు జ్ఞానాన్ని ప్రసాదించు. ఈ వ్యక్తి భావన తీసేయి, అజ్ఞానం, అహంకారాలే చీకటి. అహంకారమే సమస్త రుగ్మతలకు కారణం. నీ పట్ల బలీయమైన ఆకర్షణ కలుగచేసి నా అహంకారం తీసేసి నాకు జ్ఞానం ప్రసాదించమని రమణ స్వామి వేడుకొంటున్నారు.

'అరుణాచలం' అని స్మరిస్తే చాలు దాని వల్ల మీకు మోక్షం వస్తుంది. మీరు 'అరుణాచలం' యొక్క రూపాన్ని ధ్యానంచేస్తూ, నామాన్ని స్మరిస్తూ ఉంటే మీరు మీ రూప నామంలో నుండి విడుదల పొందుతారు ఇదే రహస్యం. ఈ అహంకారం నువ్వే తొలిగించు అరుణాచలా! అంటూ భక్తులను వేడుకోమంటున్నారు భగవాన్.









## 61 నవిసి చెడు ఫలము నందేమి ఫలమేరి, పక్వత లోగోను మరుణాచలా

**భావం :** అరుణాచలా ! అతిగా పండిపాడైన ఫలం తినుటకు ఉపయోగపడదు, కోరి భుజించుటకు వీలయిన పక్వదశలో ఉన్న దానిని ఏరి ప్రీతితో భుజించుట మంచిది.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! నేను చెడ్డ స్నేహాలు చేసి, నేను శుభ్రంగా పాడవక ముందే నీ కరుణ నా యందు చూపించి నన్ను అనుగ్రహించు. శరీరం చనిపోయాక డాక్టరు వచ్చి ఏమి చేస్తాడు? అలాగే నేను పూర్తిగా పాడయిపోయిన తరువాత నువ్వు చేసిది ఏముంది? నేను పాడైపోకముందే నన్ను నీలో ఐక్యము చేసుకో అరుణాచలా, కుళ్ళిపోయిన కాయని ఏం భుజిస్తావు నువ్వు నేను బొత్తిగా కుళ్ళి పోకముందే నీ ఒడిలోకి నన్ను తీసుకో అరుణాచలేశ్వరుడా. నేను పూర్తిగా పాడవకముందే నన్ను రక్షించాలి నన్ను నీవు తీసుకోవాలి.

ఈ భౌతికమైన దేహం, పంచభూతాలతోటి నిర్మించి నటువంటి ఈ దేహం స్మశానంలో కాలి బూడిద అవ్వక ముందే నీజ్ఞానాగ్నిని పంపించి ఈ దేహం మీద నాకున్న అభిమానాన్ని పొగొట్టు. దేహం పోయిన తరువాత ఇంక నువ్వు చేసేది ఏమీ లేదు. దేహం ఉండగానే నీ జ్ఞానంతోటి అనుగ్రహించు. నేను పూర్తిగా కుళ్ళిపోకముందే నీ కరుణ నాయందు చూపించు అరుణాచలా!

జీవుడు ప్రాపంచిక జ్వరంలో ఉన్నంతకాలం వాడు హృదయంలో మగ్గడు. ఎంతసేపూ రాగద్వేషాలతో ఉన్న జీవుడు పరమాత్మకు దూరమై పాడైపోతాడు. దేహప్రారబ్ధాన్ని బట్టే బంధువులు, స్నేహితులు తయారవుతారు. అలా లోక వ్యవహారాలలో మునిగి జీవుడు ఈ జననమరణ చక్రంలో కొట్టుకుపోతున్నాడు. ఇవి అన్నీ అశాశ్వతాలని, పారమార్థిక సత్యం ఒకటి ఉందని ఈ జీవుడికి అర్థమవ్వాలి అంటే, ఒక జ్ఞానినో, ఒక గురువునో ఆశ్రయించాలి. జీవుడు పూర్తిగా కుళ్ళి పాడవక ముందే అరుణాచలేశ్వరుడు గురువు రూపంలో అనుగ్రహించి ఈ దేహం శ్మశానంలో కాలిపోక ముందే తన యొక్క దయతో అనుగ్రహంతో పూర్వజన్మ వాసనలకు నిప్పు పెట్టేస్తాడు. జీవులకు అటువంటి జ్ఞానాగ్నిని అనుగ్రహించమని అరుణాచలేశ్వరుడుని భగవాన్ ప్రార్థిస్తున్నారు.

## 62. నొవ్వగింపక నిన్ను నొసగి నన్ గొనలేదె యంతకుడవు నాకు నరుణాచలా

**భావం :** అరుణాచలా ! నేను తీవ్రమైన తపస్సు చేసి శరీరమును ఏమీ కష్టపెట్టకుండానే నాకు నీవు లభించావు దానికి బదులుగా నన్ను నీవు తీసుకున్నావు. నీవే నాపాలిట అంతకుడయ్యావు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నన్ను ఏమీ బాధలు పెట్టకుండా, నా అహంకారాన్ని తినేసిన వాడవు. నా అహంకారాన్ని కాల్చి

బూడిద చేసేశావు. నేను అగ్ని మధ్యన, జలం మధ్యన, నిలబడి ఆకులు తిని తపస్సులు చేయలేదు. వేలాది సంవత్సరాలు, లక్షలాది సంవత్సరాలు నీ కోసం సర్వం త్యాగం చేసి అడవిలో పడి తపస్సు చేస్తున వాళ్ళకే మొదలు, చివర కనబడట్లేదు. అటువంటి స్థితిని నన్ను ఏమీ హింసలు పెట్టకుండా దేవతలకు కూడా అసాధ్యమైనటువంటి స్థితిని నాకు ఒసగావు. నన్ను తీసేసుకున్నావు. ఈ అబద్ధమైన నేనుని తీసేశావు. నాలో ఉన్న మాయని తొలగించావు. ఎలా అంటే కొంతమంది డాక్టర్లు ఆపరేషన్ చేస్తే ముఖం కూడా నలగదు. అసలు పేషెంట్స్‌కే తెలియదు ఆపరేషన్ చేస్తున్నట్లు అటువంటి గొప్ప డాక్టరువయ్యా అరుణాచలా ! నా మాయని తొలగిస్తుంటే నాకు ఇసుమంత నెప్పి లేకుండా తీసేసి 'నీ నేనుని' నాకు అనుభవంలోనికి తెచ్చావు.

అరుణాచలా ! నువ్వు నాకంతకుడివి అంటే నా అహంకారాన్ని తినేసినవాడవు నా దేహముండగానే నా అహంకారాన్ని కాల్చి బూడిద చేసేశావు. నేను సజీవంగా ఉండగానే నాలోని జీవలక్షణాలను తీసేసావు, ఎప్పుడో ప్రాణం పోయిన తరువాత మోక్షం ఇస్తాను కైలాసానికి, వైకుంఠానికి పంపుతాను ఇలాంటి అబద్ధపు మాట లేమీ చెప్పకుండా నీ జ్ఞానాగ్నిని హృదయంలోకి పంపి నా అజ్ఞానాన్ని కాల్చేశావు. నన్ను దైవ సింహాసనం మీద కూర్చోబెట్టావు. నన్ను జ్ఞానిని చేసేశావు. ఆత్మానుభవాన్ని ప్రసాదించావు ఎప్పుడు? ఇప్పుడే

నా అజ్ఞానాన్ని కాల్చేశావు. నా దేహాన్ని కాల్చక ముందే నా అహంకారాన్ని కాల్చేశావు. నీయొక్క అనుగ్రహం ఇది అని చెప్పటానికి ఏ నోరు సరిపోతుంది అరుణాచలేశ్వరుడా! అంటున్నారు భగవాన్.

## 63. చూచి చింతించి మేనుందాకి, పక్వము చేసి నీవేలి బ్రో వరుణాచలా

**భావం :** అరుణాచలా ! నీ అనుగ్రహ వీక్షణములచే కటాక్షించు. నేను తరించవలెనని తలచియు, నా దేహమును నీ అనుగ్రహ కరములచే స్పర్శించి, లాలించి మూడు విధములుగ నన్ను పక్వం చేసి నీవు నన్ను నీ కరుణకు పాత్రుడగునట్లు చేయుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! నేను పక్వానికి వచ్చాక కదా నువ్వు నన్ను ఏలుకునేది. పక్వానికి వస్తే అసలు జన్మే లేదు కదా? నువ్వురమ్మంటే నేను వచ్చాను నన్ను ఎలాగయినా పక్వం చేయటం నీ ధర్మమయ్యా ! నీ యొక్క కృపాకటాక్ష వీక్షణములను నా మీద ప్రసరింపచేసి నాలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించు. ఆలా నేను మగ్గ లేదు అనుకో ఒక్కసారి నన్ను నీ హృదయంలో తలపెట్టుకో నా అజ్ఞానం తొలగిపోవాలని, నన్ను బాగు చెయ్యాలని, అలా కూడా నేను పక్వానికి రాలేదు అనుకో ఒక్కసారి నీ యొక్క అనుగ్రహకరములచే నా శిరస్సును స్పృశించి నాలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి నన్ను పక్వం చేసి నీవేలుకోవయ్యా!

ఎలా అయితే మత్స్యము తన గుడ్లను చూపుతోనే పిల్లలుగా చేస్తుందో! తాబేలు భావ దీక్ష ద్వారా ఒడ్డున పెట్టిన గుడ్లను పిల్లలను చేస్తుందో, తన శరీరంతో స్పృశించి పక్షి తన గుడ్లను పొదిగి పిల్లలను చేస్తుందో అలా నన్ను పక్వం చేయవయ్యా. ఈ మూడు దీక్షలుద్వారా నాలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి నన్ను ఆత్మజ్ఞానసముపార్జనకు అర్హునిగా చేయ వయ్యా అరుణాచలేశ్వరుడా!

నీ అనుగ్రహం లేకుండా నా ఆజ్ఞానం పోగొట్టుకోలేను. నాలోని అజ్ఞానం పోకుండా నేను పక్వానికి రాలేను. నేను పక్వం చెందకపోతే ఈ జననమరణ చక్రంలో కొట్టుకొని పోతానయ్యా! నీ యొక్క అనుగ్రహాన్ని నీ చూపు ద్వారా కాని, భావన ద్వారా గాని, నన్ను స్పృశించి కాని లేదా ఈ మూడింటి తోనూ నా మీద అనుగ్రహ వర్షం కురిపించి నన్ను పక్వానికి తీసుకువచ్చి నీలో నన్ను ఐక్యం చేసుకో అరుణాచలా ! అంటూ భగవాన్ అరుణాచలేశ్వరుడుని వేడుకొంటున్నారు.

## 64 మాయా విషముపట్టి తలకెక్కి చెడుమున్నె
## కరుణప ట్టొసగి బ్రో వరుణాచలా

**భావం :** అరుణాచలా ! మాయప్రపంచ మోహమనెడి సర్పం చేత కాటు వేయబడి విషం తలకెక్కి చనిపోవుటకు ముందే, విరుగుడుగా నీకృపామృతంగ్రోలి జీవించునట్లు అనుగ్రహించు.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! నీవు కల్పించిన మాయలోపడి మేము కొట్టుకొనిపోతున్నాం. ఈ అజ్ఞానం అనే విషం అంతా వ్యాపించి నేను పాడవకముందే, నీ కరుణ, దయ చూపించి నన్ను రక్షించు అరుణాచలా ! మనం చేసే చెడ్డపనులు, చెడ్డమాటలు వినటం చెడ్డవిషయాలు చూడడం ఇదంతా విషం కింద లోపలకి వ్యాపిస్తుంది. ఈ మాయ ఏమి చేస్తుంది అంటే మన బుద్ధిని పాడుచేసి దేవుడు లేడు అనిపిస్తుంది. భగవాన్ ఒకమాట చెప్పారు దేవుడు లేడు అనేవారికి, ఉన్నాడు అనే వారికి మనసు, జీవలక్షణాలు అనుభవంలో ఉన్నాయి. కాని దేవుడు అనుభవంలో లేడు. జీవుడు వాడిలో ఉన్న మనస్సుని, వాడి అజ్ఞానాన్ని (దేహాత్మ బుద్ధిని) అతిక్రమించి వెళ్ళాలి. అప్పుడే దేవుడు అనుభవం లోనికి వస్తాడు. జీవలక్షణాలను దేహబుద్ధిని విడిచి పెట్టకుండా దేవుడు ఉన్నాడు అని అంటే ప్రయోజనం ఏమిటి? దేవుడికి సంబంధించిన అనుభవం లేకుండా శాంతి పొందగలమా, ప్రకృతిలోంచి ఈ జననమరణ చక్రంలోనించి బయటకు రాగలమా?

మాయ ఉండటంవల్ల మనకి ఉన్న ధనం, కీర్తి, పదవులు నిజం అనిపిస్తున్నాయి. అందుకే ఉపనిషత్తులు భోగత్రయం ఉన్నవారికి భగవంతుడి పాదాల యందు భక్తి కలగదు అని చెపుతున్నాయి. భోగత్రయం అంటే ధనకాంక్ష, స్త్రీకాంక్ష, కీర్తికాంక్ష. ఎవరైతే ఈశ్వరానుగ్రహానికి పాత్రుడు అవ్వాలని జీవిస్తున్నారో వాడికి మాత్రమే ఈశ్వరుడు తెలియబడతాడు.

ఈ భోగాలన్నీ కో(బ్రాపాయిజన్ కన్నా ప్రమాదకరమైనవి. విషయాలను చింతిస్తుంటే కోపానికి లోనవుతారు. ఆ కోపం వల్ల మనసులోని వివేకం పోతుంది. మనస్సు దెయ్యంలాగా ప్రవర్తిస్తుంది. ఈ విషయాలలో పడి పూర్తిగా పాడైపోకముందే నువ్వు నాపట్ల దయ చూపించి, కరుణ చూపించి ఈ మాయలోనుండి విడుదల చేయి అరుణాచలా! నేను ఏమీ భౌతికమైనవి అడగటం లేదు. నా అజ్ఞానాన్ని పోగొట్టు ఈ చీకటిలోంచి నన్ను బయటకు తీసుకువచ్చి నీకరుణ చూపించి నీప్రేమను నా మీద వర్షింప చేసి నన్ను నీలో ఐక్యము చేసుకో అరుణాచలా ! నిన్ను ఇంతగా ప్రార్థిస్తున్నాను నన్ను మధ్యలో విడిచిపెట్టకు ఈ అజ్ఞానాన్ని తొలగించు అరుణాచలా ! అని ప్రార్థిస్తున్నారు భగవాన్.

## 65 గను కృపన్ మాయాంతముగ కృప గనవేని, గను నీ కెవరు చెప్పు టరుణాచలా

**భావం :** అరుణాచలా ! ఈ ప్రాపంచిక వ్యవహారంలలో పడి భ్రమించు నా మోహం మాయమగునట్లు నీ కరుణాకటాక్ష వీక్షణములతో అనుగ్రహింపుము. అట్లు నీవు కటాక్షించచక పోయినచో నా కొరకు జాలిపడి ఈ ప్రపంచంలో నీకు నా పరిస్థితిని వివరించి చెప్పుటకు వేరెవరున్నారు.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! ఈ మాయను అంతం చేసేవరకు ఈ అజ్ఞానం అంతం చేసేవరకు నీకృప నాపట్ల చూపించాలి. ఒక వేళ ఈ అజ్ఞానాన్ని తొలగించవు అనుకో,

నీ వాత్సల్యం నా మీద చూపించవు అనుకో నీకు చెప్పటానికి ఎవరు ఉన్నారు అరుణాచలా ! ఈ అరుణాచలేశ్వరుడు నా అజ్ఞానం పోగొట్టుట లేదు ఎంత వేడుకొన్నా అని ఎవరితో అయినా చెప్పుకోవటానికి, ఒక వేళ చెప్పుకున్నా వారిని తీసుకువచ్చి నీకు సిఫార్స్ చేయించటానికి ఎవరు సరిపోతారు. ఈ లోకంలో నీతోటి సమానమైనవారు ఎవరూ లేరు, నీకంటే మించినవారు మటుకు ఎవరు ఉంటారు నీకు సిపార్స్ చేయటానికి?

జీవులందరూ ఏ ప్రాపంచికానందాన్ని పొందుతున్నారో, రమణస్వామి చెప్పే ఆనందము ఆ ఆత్మానుభవము, ఆ ఆత్మానందం ఆ బ్రహ్మానందం, ఆ బ్రహ్మాసుఖం దాని ముందు జీవులు అనుభవించే ఆనందం కోటోవంతు కూడా ఉండదు. అక్కడకు తీసుకుపోవటానికి మనల్ని తయారు చేస్తున్నారు రమణస్వామి. అక్షరమణమాల వంపుతో మనల్ని తీసుకెళ్ళి పిండుతున్నాడు. మన ఇంద్రియాలని, మన దేహాన్ని పిండు తున్నాడు. పేరుమటుకు అక్షరమణమాల ఇది అంతా జీవులు కోసం రాయబడినది.

అరుణాచలేశ్వరుని ప్రేమ ముందు, ఆయన వాత్సల్యం ముందు ఈ ప్రపంచము ఆనందాలన్ని ప్రేమలన్నీ అతి స్వల్పం. ఈ స్వల్పమైన ఆనందాల కోసం కాదు జీవుడు వచ్చింది. ఈ జన్మకు గమ్యం అరుణాచలేశ్వరుని పొందడమే. ఆయనను పొందడం అంత సులభమా. నిరంతరం ఆయన

స్మరణలోనే ఉంటూ ఆయనకు శరణాగతి అయితేనే తప్ప మన అజ్ఞానాన్ని తొలగించడు. అజ్ఞానాన్ని ఈ జీవుడి ప్రయత్నంతో పోగొట్టుకోలేడు, సదా అరుణాచలేశ్వరుడి కటాక్ష వీక్షణములకై ప్రార్థించే జీవులను తరింపచేస్తాడు. జీవులను అలా ప్రార్థించమని నేర్పుతున్నారు భగవాన్.

## 66 పిచ్చి వీడ నిను బోల్ పిచ్చిజేసితె దయన్
## పిచ్చిని మాన్పు మం దరుణాచలా

**భావం :** అరుణాచలా ! మాయాప్రపంచ విషయ భోగముల మోహమనెడి భ్రాంతి నుండి విడువడుట కుపాయముగ నిర్విషయశుద్ధాత్మ స్వరూపుడవైన నిన్ను పొందవలెనని పిచ్చిని కూడా పోగొట్టు నిజమైన మందును నాకు అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! లోకంలో అందరూ ఏదో ఒక పిచ్చి లోనే జీవిస్తున్నారు. కొందరికి అధికార పిచ్చి, కొందరికి డబ్బుపిచ్చి, కొందరికి కీర్తి పిచ్చి. ఇలా అందరూ వారివారి పిచ్చిలో జీవిస్తూ జననమరణ చక్రములో తిరుగుతున్నారు. ఇలాంటి మాయాప్రపంచ విషయభోగములనే పిచ్చి నుండి నన్ను విడుదల చేసి ఆత్మస్వరూపమైన నిన్ను పొందవలెననే పిచ్చిలో నన్ను పెట్టావు. ప్రపంచాకర్షణలనే మాయలో పడకుండా ఆ పిచ్చిలో పడకుండా నీకరుణతో, దయతో నన్ను నీపిచ్చివాడినిగా చేసావు. కాని పిచ్చి అంటే పిచ్చేకదా! నీవు వేరే అన్న భావనలో నిన్ను పొందాలనే భావన పిచ్చితో ఉన్న

నాకు నీకన్నా భిన్నంగా లేను అనేబుద్ధిని కలిగించు. నీ స్వరూపానుభవంతో నీ వాడిగా చేసుకొంటే నీ పిచ్చి నుండి బయటపడతాను, నాకు అన్యముగా లేకుండా నన్ను నీలో ఐక్యము చేసుకొనే మందును నాకనుగ్రహించు అరుణాచలా!

నీ కరుణ, నీ అనుగ్రహం లేకుండా ఎవరూ నీ ప్రపంచ మాయలోనుండి బయట పడలేరు, నీ యొక్క దయతో జీవులం దరిని నీ మీద ప్రేమ, ఇష్టం పెంచుకునేటట్లు వారి మనసులను మార్చి అనుగ్రహించమని వేడుకొంటున్నారు భగవాన్.

## 67 నిర్భీతి నినుజేరు నిర్భీతు ననుజేర, భీతి నీకేలలో యరుణాచలా

**భావం :** అరుణాచలా ! భీతినొందు భక్తులకెల్ల అభయమిచ్చు భయంలేని వాడవగు నిన్ను నేను కూడా నిర్భయముగానే చేర సాహసించితిని. కాని ఏలనో నన్ను చేరుటకు భయం నీకు ఎందుకు కలుగుచున్నది.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! భయాన్ని విడిచిపెట్టి నీ దగ్గరకు నేను వచ్చాను. నువ్వు నన్ను తీసుకోవటం కోసం భయపడవలసిన అవసరంలేదు. నీభీతి ఎందుకు? ఎందుచేత అంటే భయం అనేది నీకు ఎలా ఉంటుందో తెలియదు. మనిషికి భయం ఉంటుంది కాని భగవంతుడికి భయం ఉంటుందా? భగవంతుడిని భగవంతుడితోనే పోల్చగలము కాని ఒక వ్యక్తితో పోల్చటానికి అవకాశం లేదు. ఏదో ఒక కారణం చేత జీవులందరికి భయం వేస్తూనే ఉంటుంది. మన

కీర్తికి కాని, సంపదకు కాని, గౌరవాలకు కాని ఏదైనా చిన్నగాయం తగిలితే అందరికి భయం వేస్తుంది. నిర్భయస్థితి కావాలి అభయస్థితి కావాలి మనందరం ఆ స్థితికి చేరుకోవాలి. అప్పటివరకు జన్మలు వెంటాడుతాయి, దుఃఖం వెంటాడు తుంది. ఈశ్వర అనుగ్రహం లేకపోతే మనం అభయస్థితిని పొందలేం. అరుణాచలేశ్వరుడా ! నీకు భయం అంటే ఏమిటో తెలియదు. భయం ఎక్కడ లేదో, రాగద్వేషాలు ఎక్కడ లేవో అక్కడ నీవున్నావు. అందుచేత నన్ను ఆదరించడం కోసం, నీ హృదయంలో స్థానమివ్వటం కోసం నీవు భయపడవలసిన పని ఏమీలేదు. మనం కూడా భయం లేని స్థితికి వెళ్ళాలి. భగవంతుడిని పొందాలి. నువ్వు భగవంతుడిని ఎప్పుడైతే తెలుసుకున్నావో, సత్యాన్ని ఎప్పుడైతే నువ్వు అనుభవించావో అప్పుడు అభయస్థితి పొందుతావు.

స్వామి వివేకానంద తరచుగా చెప్పాడు. బి ఫియర్‌లెస్, బి ఫియర్‌లెస్, బి ఫియర్‌లెస్ మీరు చెడ్డచేసినా నాకు ఇష్టమే కాని భయం లేకుండా చేయండి అనేవాడు. ఎందుచేత అంటే భయం ఉంటే జ్ఞానం కలుగదు. ఒక్క ధైర్యవంతుడు మాత్రమే తాను అనుభవిస్తున్న భోగాన్ని విడిచిపెట్టి తన ఇంద్రియాలను, తన మనస్సును పరమేశ్వరుడి వైపు తిప్పగలడు కాని పిరికివాడు చేయలేడు. చాలామంది భక్తి అంటే ఎగతాళి చేయవచ్చు కాని భక్తి అంత తేలికగా వచ్చేదికాదు. దానికి ఎంతో ధైర్యం కావాలి. ధైర్యం లేకపోతే రానేరాదు. ఇది

పిరికివాడి సొమ్ము కాదు. ఎవరికి అయితే ధైర్యం ఉందో వాళ్ళే ఆత్మ అనే సంపదను పొందగలరు. జీవులని భయరహిత స్థితికి మేల్కొలుపుము అని భగవాన్ అరుణాచలేశ్వరుడుని వేడుకొంటున్నారు.

## 68. అల్పజ్ఞాన మదేది సుజ్ఞాన మేదయా, ఐక్యమంద కరుణింపరుణాచలా

**భావం :** అరుణాచలా ! అల్పమైన జ్ఞానమేది? శుభం నిచ్చే సద్వస్తువును తెలిసుకొను జ్ఞానం ఏదని వివరించి తెల్పుమా! సత్యస్ఫురణనొంది దానితో ఏకమగునట్లు అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! ఏది అల్పజ్ఞానం, ఏది సుజ్ఞానం. ఇది అంతా మనస్సు పరిధిలో ఉన్నాయి. ఈ అజ్ఞానం అనేది, దుఃఖమనేది బంధం అనేది ఇవన్నీ మనస్సు యొక్క పరిధిలోనే ఉన్నాయి. మనకున్న రోగాలన్నీ, చావు పుట్టుకలన్నీ, మనస్సు, దేహం యొక్క పరిధిలో ఉన్నాయి. మనస్సు ఉన్నప్పుడు ఇవి అన్నీ వస్తున్నాయి. మనస్సు ఉంటే జగత్తు, జీవుడు ఉన్నారు. ఈ మనస్సు అనే ప్రకృతిని దాటి వెళ్ళినప్పుడు ఏమీ లేవు. ఉన్నది ఒక్కటే, అక్కడ అజ్ఞానం ఏంటి సుజ్ఞానం ఏంటి. ఎప్పుడైతే ఈ బుద్ధిని దాటి వెళ్ళావో అక్కడ అజ్ఞానం లేదు. సుజ్ఞానం లేదు. అంటే ఆత్మను తెలుసు కున్నవాడికి ఈ రెండూ లేవు. జ్ఞానసూర్యుడు ఎప్పుడైతే నీలో ప్రకాశించాడో ఎటుచూసినా ఆత్మే అందుచేత వారికి వికారం కలగదు, వాళ్ళకి భయం కుడా లేదు.

మనకు ఎప్పుడు ద్వైతభావనే. మనం నామ రూప దృష్టికి పరిమితమైపోయాము. మనకు ఆత్మదృష్టి లేదు భగవంతుడి తోటి అనుబంధం లేదు. మనకున్న అజ్ఞానంలోనుండే అన్ని రోగాలు వస్తున్నాయి. అజ్ఞానమే మూల కారణం. దీనిని స్మశానంలో కూడా కాల్చలేం. జన్మజన్మలో మన కూడా వస్తూ వుంటుంది. మనం ఈ భూమి మీద ఉండగా, ప్రాణం విడిచి పెట్టకముందే మన అజ్ఞానాన్ని పోగొట్టుకోవాలి. అలా పోగొట్టు కోకుండా శరీరం విడిచిపెడితే చాలా కష్టాన్ని అనుభవించాలి. ఈ అజ్ఞానం అనే మూలరోగం తొలగించుకోవడం కోసం కర్మమార్గమో, భక్తిమార్గమో, ధ్యానమార్గమో, జ్ఞానమార్గమో ఏదో ఒకటి మనకు నచ్చిన మార్గంలో ప్రయాణం చేసి, మీకు నచ్చిన గురువుని తీసుకొని బాగుపడటం ముఖ్యం. రేపు రేపు అని వాయిదాలు వేయకండి. అది ఇప్పుడే చేయాలి రేపుకు రూపులేదు మన ఇంద్రియాలను, మనస్సును శాంతిగా పెట్టు కోవాలి. పరమాత్మను చింతిస్తూ ఉంటే శాంతి వస్తుంది. నిరంతరం పరమేశ్వరుడిని స్మరించడం వలన మన అజ్ఞానం పోగొట్టుకోగల శక్తి వస్తుంది. ఎప్పుడైతే అజ్ఞానం పోయిందో అప్పుడు అరుణాచలేశ్వరుడు తనలో ఐక్యం చేసుకుంటాడు.

## 69. పూ(భూ) గంధమగు మది పూర్ణగంధము గొన, పూర్ణగంధ మొసగు మరుణాచలా

**భావం :** అరుణాచలా! ప్రాపంచిక బంధంలతో నిండిన నా మనస్సును, ఆ వాసనలన్నియు నశించునట్లు చేసి నిర్విషయ

జ్ఞాన బ్రహ్మ సుగంధంను పొందునట్లు అనుగ్రహించి, పూర్ణ వస్తువైన బ్రహ్మంతో ఐక్యమగు పరిమళమొసగు అరుణాచలా!

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! పువ్వులో ఏవిధంగా అయితే పరిమళం ఉంటుందో, మొగ్గలో ఉన్న పరిమళం కాదు, మొగ్గ పువ్వు అయిన తరువాత సరైన పరిమళం వస్తుంది. అదే విధంగా నా మనస్సు మొగ్గ రూపంలో ఉండవచ్చు, మొగ్గ రూపంలో ఉన్న నాకు పరిమళం ఎలా వస్తుంది? మొగ్గను పువ్వు చేసినట్లు నా మనసుని వికసింపచేసి దాంట్లో ఉన్న పరిమితులను తీసేసి, దానికి పూర్ణత్వం కలుగచేసి ఎటువంటి పరిపూర్ణమైన పరిమిళం నా మనసుకి ఇస్తే నా మనసుకు పూర్ణస్థితి కలుగుతుందో అటువంటి పూర్ణగంధాన్ని నాకు ప్రసాదించు అరుణాచలా ! నన్ను హేళన చేయకు నన్ను పువ్వులా తయారుచెయ్యి. పువ్వుకేవిధంగా అయితే సువాసన సహజమో అదే విధంగా పరిమళాన్ని అంటే పూర్ణత్వాన్ని నా మనస్సుకి ఇచ్చి నామనస్సుని నీఅంతటి స్థాయికి తెచ్చి నీ అంతటి వాడిని నన్ను చేయి అరుణా చలేశ్వరుడా ! భగవాన్ ఒక సందర్భములో చెప్పారు. ఈ అరుణాచలం వచ్చిన వారు రిక్త హస్తాలతో బయటకు వెళ్ళరు. నాస్తికుడు ఆస్తికుడవుతాడు ఆస్తికుడు భక్తుడు అవుతాడు, భక్తుడు జ్ఞాని అవుతాడు. జ్ఞాని నాస్వరూపం పొందుతాడు అని భగవంతుడు చెప్పాడు.

మనకి తెలియడం, తెలియకపోవడంతో సంబంధము లేదు. మనకి తెలుసుండీ చెరువులో పడినా, లేకపోతే అనుకోకుండా ప్రమాదవశాత్తు చెరువులో పడినా స్నానమే.

తడపటం నీటి యొక్క స్వభావం అదే విధంగా ఎవరైతే అరుణాచలా ! అని స్మరిస్తున్నారో వారు తప్పనిసరిగా పరిపూర్ణ మైన స్థితిలోకి వస్తారు. జ్ఞానితోటి సహవాసం వలన కూడా మీరు ఐశ్వర్యవంతులు అవుతారు. మీ మనసుకి పరిపక్వత రావడం కోసం, మీ మనస్సు ఉన్నతమైన జ్ఞాన శిఖరాలకు ఎదగడంకోసం అరుణాచల ! స్మరణ సరిపోతుంది. శ్రద్ధ లేకపోతే జ్ఞానం రాదు మోక్ష స్థితిని మీరు ఇప్పుడే పొందాలి. ఇక్కడే పొందాలి. ఈ జన్మలో చేయలేనప్పుడు వచ్చే జన్మలో ఏమి చేస్తావు. మీరు తప్పించుకోవాలని చూడకండి. వర్తమాన కాలాన్ని విడిచిపెట్టుకొని భవిష్యత్తు గురించి ఆలోచించి కాలాన్ని పాడు చేసుకోవద్దు. ఈ జన్మను మీరు ఉపయోగించు కొని అరుణాచల స్మరణలో మనస్సుని నానబెట్టుకొని ఆ పరిమళాన్ని పొందండి అంటున్నారు భగవాన్.

## 70. పేరు దలపగనే పట్టిలాగితివి, నీ మహిమ కనుదురెవ రరుణాచలా

**భావం :** అరుణాచలా ! నీ పేరును మనసారా తలచిన మాత్రము చేతనే, నన్ను నీ కృప అనెడు త్రాడుతో బంధించి నీ వైపునకు లాగుకొంటివి. నా బుద్ధికి అందని నీ అవ్యాజ కరుణ యొక్క మహిమను, శక్తిని ఎవరు తెలుసుకొనగలరు.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! ఈ ప్రకృతి ప్రవాహంలో రాగద్వేషాల ప్రవాహంలో, అజ్ఞానంలో, చీకటిలో కొట్టుకుపోతున్న నేను ఒక్కసారి ఊరికే అరుణాచలా ! అని

స్మరించాను. నేను గుంజీలు తియ్యలేదు, యోగాభ్యాసాలు చెయ్యలేదు. నేనే తపస్సులూ చేయ లేదు. భక్తుడికి ఉండవలసిన లక్షణాలు కాని, నేను భక్తుడ్ని అని చెప్పుకోవటానికి తగిన విలువ ఏమీ నా దగ్గర లేదు. 'అరుణాచలం' అన్నాను అంతే అయిపోయింది. జన్మ జన్మల నుండి వస్తున్న అవిద్యకు, అజ్ఞానవాసనలకు నిప్పు పెట్టావు. నాకు స్వరూపజ్ఞానం రావటానికి ఏమైతే విరోధంగా ఉన్నాయో ఆ చెడ్డనంతా బయటకు తీసేసి నీ స్వరూపాన్ని నాకు ప్రసాదించావు. నీ ఔన్నత్యం ఇట్టిది, నీ గొప్పతనం ఇట్టిది అని చెప్పగలగినవారు ఎవరున్నారు.

అరుణాచలేశ్వరుడిని స్మరించటం వలన దేహబుద్ధి పోయింది. దేహగతమైన నేనుని తీసేసి నిజమైన నేనుని ప్రసాదించావు అంటున్నారు అది యూనివర్సల్, అంటే ఏదైతే నేను నేను అనుకుంటున్నానో ఆ దేహగతమైన నేనుని తీసేశావు, ఇదంతా ఆటోమేటిక్‌డివైన్‌యాక్షన్. ఇందులో సాధన ఏమీ లేదు. మీరు హృదయ పూర్వకంగా పరమేశ్వరుడి పట్ల ప్రీతి పెంచుకుంటే మీ జీవితం మీకు తెలియకుండానే ఎంతగానో మారిపోతుంది. మీరు ప్రయాణం చేస్తున్నట్లు కూడా తెలియదు. మీకు తెలియకుండానే గమ్యానికి చేరు కుంటారు. ఒక జ్ఞానిని స్మరించండి మీకు ఎంతో శాంతి, మనస్సుకి ఆనందం చల్లదనం కలుగుతుంది. ఆ శాంతి ఈ జీవులకు అందించు అని భగవాన్ అరుణాచలేశ్వరుడుని వేడుకొంటున్నారు.

## 71 పోగ భూతము పోని భూతమై పట్టినన్,
## భూతగ్రస్తునిజేసి తరుణాచలా

**భావం :** అరుణాచలా ! అనాది నుండి నన్ను ఆవరించిన అహం అను పిశాచి నన్ను వదలిపోవలెనని దానిని పోగొట్టుటకు, దానికంటె అతి బలమైన బ్రహ్మ పిశాచివలె పట్టి నన్నే పిశాచిగా చేసితివే? నీ శక్తి ఎంతటి బలమైనదో.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! నన్ను భూతం పట్టుకొంది. అయ్యో, నన్ను దెయ్యం పట్టుకొంది, ఈ అజ్ఞానం అనే దెయ్యం నన్ను పట్టుకొంది. ఎన్ని శాస్త్రాలు చెప్పినా, ఎంతమంది పెద్దలు చెప్పినా, ఎన్ని వేదాలు చెప్పినా కనీసం నా హృదయంలో అస్థిత్వాన్ని అంగీకరించటానికి ఇష్టపడటం లేదు నా అహంకారం. నీ వైభవాన్నిగాని, నీ వెలుగుని కాని కళ్ళు ఉండి చూడలేకపోతున్నాను. చెవులు ఉండి వినలేక పోతున్నాను. మనకంటే తెలివైన వాళ్ళెవరైనా ఉంటే, మన కంటే బుద్ధిబలం ఉన్న వాళ్ళు ఎవరైనా ఉంటే వాళ్ళని చూసి సంతోషించండి. ద్వేషం మటుకు పెట్టుకోకండి. ద్వేషం ఉంటే వాళ్ళు కాలిపోరు మీరే కాలిపోతారు. ఓ అర్జునా, నీకు అసూయ అనేది లేదు. నువ్వు అనసూయుడవు అందుచేత ఈ భగవద్గీత చెపుతున్నాను అని భగవంతుడు వాసుదేవ స్వామి చెప్పాడు అందుచేత మీరు ఎవరిని చూసి అసూయ పడకండి.

ఎన్ని జపాలు చేసిన పుణ్యక్షేత్రాలు తిరిగినా ఈ అజ్ఞానం అనే భూతం నన్ను విడిచిపెట్టడం లేదు. ఇలా బాధపడుతున్న నన్ను చూసి, నన్ను ఏ పిశాచి అయితే బాధ పెడుతుందో అంతకంటే పెద్ద భూతమై, పిశాచివై నన్ను పట్టుకున్నావు అరుణాచలా! ఈ పిశాచాన్ని బయటకు గెంటటం కోసం వైరాగ్యం ఉండాలి. ఆ వైరాగ్యం ఉన్నప్పుడు ఆ పరమేశ్వరుడు పెద్ద భూతమై వచ్చి నిన్ను పట్టుకొని నీలో ఉన్న అజ్ఞానం, అహంకారం అనే భూతాన్ని బయటకు గెంటేస్తాడు.

ఎంత పని చేశావు అరుణాచలా! రాత్రి నీస్మరణ, పగలు నీస్మరణ, సంధ్య టైములో నీ స్మరణ. అనుదినం నీస్మరణే. కళ్ళు మూసినా నీవే, కళ్ళు తెరిచినా నీవే నువ్వు తప్పించి నాకు వేరే ఏమీ జ్ఞాపకం రావటం లేదు. నా పాత జీవితం అంతా తీసేసావు. రోతలు అన్నీ తీసేశావు, దేహభావన అనే భూతాన్ని తీసేశావు, ఆత్మభావన అనే జన్మను ఇచ్చావు భూతమై పట్టుకొని చేసిన ఉపకారం ఇది అరుణాచలేశ్వరుడా! ఎంత కరుణ చూపించావు. నాకు లోకం కనిపించటం లేదు ఆత్మగా కనిపిస్తుంది. ఇది ఏనాటి అనుబంధమో ఎక్కడ సంబంధమో ఏ జన్మనాటిదో ఎక్కడ పుణ్యమో, నాపట్ల వాత్సల్యం చూపించి, కరుణ చూపించి, నన్ను ఏమీ బాధపెట్ట కుండా నా అజ్ఞానం అనే భూతాన్ని తీసేశావు అంటున్నారు భగవాన్.

## 72. మృదులతన్ నే(ప్రాపు లేక వాడగనీక, పట్టు కొమ్మయి కావు మరుణాచలా ॥అరుణాచల శివ॥

**భావం :** అరుణాచలా ! అల్లుకొనుటకు పట్టుకొమ్మ లేక (పందిరి లేక) వాడిపోవు లేత తీగవలే, ఎటువంటి సూక్ష్మ జ్ఞానం లేని నేను పెనవేసుకొనుటకు ఆధారమూ, అండా లేక కృంగికృశించి పోవక పట్టుకొమ్మవలె తోడై నన్ను అను(గ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! ఈ మనస్సు ఎప్పుడు ఏదో విషయాలతో అల్లుకొని పోతూ ఉంటుంది. దీనికి ఒకరూపమో నామమో ఏదో ఒక ఆలంబన ఉండాల్సిందే. ఉన్నది అజ్ఞానము దానికి ఎప్పుడు ఏదో ఒక లోకచింతనే దానితోనే అల్లుకొని పోయివుంటుంది భక్తి భావమేమో గోరు వెచ్చని నీళ్ళు. మళ్ళీ దీని అలంకారానికి దేవుడు కూడా కావాలి. ఇలాంటి అల్పమనస్సులకు, స్వల్పమనస్సులకు నువ్వు ఎలా దొరుకుతావు అరుణాచలా!

ఎవరి మనసు గెడకు తీగ అల్లుకు పోయినట్లు పరమాత్మకు అల్లుకుపోయి ఉంటుందో. ఎవరు తమ మనస్సును అరుణాచలేశ్వరుడి స్మరణలో నానబెట్టుకుంటు న్నారో వారిని నీవు పట్టుకొమ్మయి కాచుకుంటావయ్యా! వాళ్ళకున్న భక్తి లేత తీగవలే ఉన్నాసరే వారిని నీ దగ్గరకు చేర్చుకొనటానికి నీవే వారికి పందిరిలాగా ఆలంబన అవుతావు అరుణాచలా! నేనేమయినా పూజలు, (వ్రతాలు, ధ్యానాలు

చేసానా కేవలం అరుణాచలా ! అని స్మరించాను. నాకున్న భక్తికి నీవే ఆధారమయి నేను ఈ జననమరణ చక్రంలో బంధీనవ్వకుండా నన్ను రక్షించావయ్యా, అన్నీ ఆధారాలు ఉన్నవాళ్ళకి అరుణాచలేశ్వరుడు ఆధారం అవ్వడండి. మన ఆధారాలు అన్నీ ఊడగొట్టేసుకొని అరుణాచలేశ్వరుడునే ఆధారంగా పెట్టుకుంటే ఆయన ఎటువంటి సూక్ష్మజ్ఞానం ఇస్తే మనం పూర్తిగా ఆయనకు అల్లుకుపోతామో అలాంటి జ్ఞానం ఇచ్చి అనుగ్రహిస్తాడు.

మన స్నేహాలు మనలని చెడగొట్టేవిగా ఉంటే మనం ఆ నాటకానాటికి సత్యానికి దూరమైపోతాం. అలా పాడై పోకుండా అరుణాచలా నీయొక్క సాంగత్యం నాకు కల్పించు, సత్పురుషులతో, గురువుతో సాంగత్యం కల్పించు. నా భక్తి అనే లేతమొగ్గని ఏ ఆధారం లేక పాడయి పోకుండా, గురువు యొక్క సాంగత్యం కల్పించి ఆయననే ఆధారంగా చేసుకొని ఆయన చెప్పినట్లుగా జీవించి నా మనసు నిరంతరం నా గురువు స్మరణలో, స్ఫురణలో ఉండేటట్లు చేసి నన్ను రక్షించు అరుణాచలా ! అని భగవాన్ వేడుకుంటున్నారు.

## 73 పాడిచే మయికపర్చి నాబోధ హరియించి, నీబోధ గనుపించి తరుణాచలా

**భావం :** అరుణాచలా ! ఆపరేషన్ చేసే ముందు బాధ తెలీయకుండా మత్తుమందు ఇచ్చినట్లు నన్ను నీ మైకంలో పెట్టి నాకు ఏమీ బాధ తెలియకుండానే నా అజ్ఞానమును తొలగించి జ్ఞానం ప్రసాదించావు.



చైతన్యం లో శాంతి, ఆనందం ఉన్నాయి. అది చావులేని స్థితి.

- సద్గురు శ్రీ నాన్నగారు





**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! నాకు శాస్త్రాల గొడవ గాని భగవద్గీత, బ్రహ్మసూత్రాలు అవి ఏమీ తెలియకుండా బడిలో 9వ తరగతి చదువుకుంటున్న పిల్లవాడిని నువ్వు ఏమి చేశావయ్యా! ఆపరేషన్ చేసే ముందు డాక్టర్లు మత్తు పెట్టినట్లు నా మీద మత్తు పొడి చల్లేశావు. నాకేమీ బాధ లేకుండా నాకేం కష్టం లేకుండా నన్ను ఎక్కడకి తీసుకువెళ్తున్నావో కూడా నాకే తెలియనివ్వకుండా, నువ్వు ఏమి చేశావు మత్తుపొడి చల్లి నాకు మత్తు ఎక్కించావు, నన్ను మైకంలో పెట్టేసావు. నేను ఆ మత్తులో, మైకంలో ఉండగా నాకు ఆపరేషన్‌చేసి నన్ను ఈ సంసార చక్రంనుండి బయటకు తీసేసావు. నువ్వు శరీరానికి రోగాలు తగ్గించే డాక్టరువు కాదు అజ్ఞానం తగ్గించే డాక్టరువు.

నన్ను ఈ సంసారచక్రం నుండి బయటకు తియ్యడం కోసమే ఈ పనిచేశావు. నేను మైకంలో ఉండగానే నా తెలివితేటలు తీసేశావయ్యా! జీవుడికి తెలివితేటలు ఏమిటి? అజ్ఞానికి తెలివి ఏమిటి ఈ తెలివితేటల వల్ల జ్ఞానం కలుగటం లేదు. ఎంత చదువుకున్నా ఈలోకానికి, పొట్టకే పరిమితం. అందుకే నా తెలివితేటలు హరించావు. నేను తెలివైన వాడినే అనుకుంటున్నాను. తెలివితేటలు తక్కువైన తెలివి ఉన్న వాడిని అనుకుంటున్నాను. ఇది పెద్ద ప్రమాదం. నాకు తెలివితేటలు లేవనుకుంటే సంపాదించటానికి ప్రయత్నం చేస్తాను. ఉన్నాయి అనుకుంటే ఎలా ప్రయత్నం చేస్తాను. నేను తెలివిగల వాడిని,

మేధావిని, అనుకునే భావనని నువ్వు హరించావు. తీసి అవతల పడేశావు. నా జీవత్వం తీసేసి నన్ను శుభ్రం చేసేశావు. శుభ్రం చేసి, నా అజ్ఞానం తీసేసి నీ జ్ఞానం నాకు ఇచ్చావు. ఇదంతా నాకు తెలియనివ్వకుండానే చేసేశావు అంటున్నారు భగవాన్.

## 74 పోకరాకలు లేని సమరంగదివి జూపు, మా కృపా పోరాట మరుణాచాలా

**భావం :** అరుణాచలా ! ఏ స్థితిని పొందిన తరువాత మరి తిరిగి భూమి మీదకు తిరిగి రావలసిన పనిలేదో అటువంటి స్థితిని నాకు అనుగ్రహించు.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! మా మనస్సు నిత్యం పోరాటాలు చేస్తూనే ఉంటుంది. ఎప్పుడూ ఏదో ఒక దాని కోసం పరుగులు పెడుతూ ఉంటుంది. మా మనస్సు ఇక్కడో గంతు, అక్కడో గంతు వేస్తూవుంటుంది. నిరంతరం చలించే మా మనస్సుని మేం నిగ్రహించుకోలేకపోతున్నాం. మనస్సులో సంఘర్షణ ఎప్పుడు జరుగుతూనే ఉంటుంది. ఈ జీవుడు ఎప్పుడూ పరమాత్మ వాడే అయినా మా అజ్ఞానం వల్ల దేహాత్మ బుద్ధి వల్ల మర్చిపోయాము. ఈ మనస్సుకు ఎప్పుడూ లోక చింతనే. ఎన్నో జన్మలనుండి పరమాత్మతో విడిపోయి జనన మరణ ప్రవాహంలోపడి కొట్టుకు పోతున్నాం. అలాంటి మా మనస్సు నిన్ను చింతన చేస్తూ నీ కోసమే తపనపడేటట్లు

నువ్వే నీ అనుగ్రహంతో నన్ను ఈ పోక రాకలు (జనన మరణాలు) లేని అమృతస్థితిని నాకు అనుభవంలోకి తీసుకు రావయ్యా! జీవుడుకి ఆ స్థితి అనుభవంలోకి రావాలంటే నీకృప వర్షించాలి కాని మా సాధన ఏపాటివి.

ఈ పోరాటాలు ఏమి చేయకుండానే నీ కృప అనే అనుగ్రహంతో నన్ను రాకపోకలు లేని అమృతస్థితికి తీసుకొని వెళ్ళిపోయావు. ఎంతదయ చూపించావు అరుణాచలా ! అంటే జీవుడు పరమాత్మను తెలుసుకోవాలనే ఆరాటంకాని, అడ్డు వస్తున్న మనస్సుతో గుణాలతో, వాసనలతో పోరాటాలు కాని ఏమీ నాకు తెలియకుండానే నీ అనుగ్రహం వర్షింపచేసి నాలోని జీవలక్షణాలను తీసేసి నీ దివ్యశక్తిని, అమృతస్థితిని ప్రసాదించావు అంటున్నారు భగవాన్.

గోపికలు నిరంతరం కృష్ణ కృష్ణా అంటూ రాకపోకలు లేని స్థితికి అంటే వైకుంఠాలు కైలాసాలు కూడ వద్దనే స్థితి. అక్కడ ఉన్న సుఖాలన్నీ మేము ఇక్కడే శ్రీ కృష్ణుడి సానిధ్యంలో ఆస్మరణతో మేము అనుభవిస్తున్నప్పుడు ఆ కైలాసాలు, వైకుంఠాల గొడవ మాకెందుకు అన్నారు గోపికలు.

## 75. భౌతికమౌ మేని పట్టార్చి యెపుడు, నీ మహిమగన కరుణిం పరుణాచలా

**భావం :** అరుణాచలా ! పంచభూతముల కలయికల వల్ల కలిగిన ఈ జడమైన దేహమును, నేనని అభిమానించు

దేహాభిమానాలు వదలి నిరంతరం వెలిగే నీ స్వరూప వైభవమును గాంచునట్లు అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! నా రూపం, నామం నాకిష్టం. ఈ రక్తమాంసములతో, పంచభూతాలతో నిండి ఉన్న ఈ బౌతికమైన దేహంతోనే నిరంతరం తాదాత్యం చెందుతూ ఇదే నేను అనే భ్రమలో అబద్ధంలో జీవిస్తున్నాను. నేను అంటే ఆత్మ అని అన్ని శాస్త్రాలు చెపుతున్నాయి. గురువులు చెపుతున్నారు. సాక్షాత్తు పరమాత్మవు అయిన నీవు కూడా చెప్పావు ఏమని ఈ భౌతికమయిన దేహం నేను కాదు అని, నేను అంటే నిత్యం, సత్యం అయిన ఆత్మ దానికి నాశనం లేదు. కాని ఈ అజ్ఞానంలో ఉన్న జీవుడికి ఈ దేహాత్మబుద్ధి ఉన్న జీవుడికి 'ఆత్మ' ఎలా తెలుస్తుంది. నీ అనుగ్రహంతో గురువునో, ఒక మహాజ్ఞానినో ఆశ్రయించి వారి నుండి గ్రహించవలసినదే మా తెలివితేటలతో అందుకోలేం.

జడమైన దేహం నేను అనదు. సత్యమైన 'ఆత్మ' కూడా నేనని అనదు. మరి ఈ రెండిటిని కలుపుతూ జిజ్జడగ్రంధి ఒకటి ఉంది అదే అన్ని అనర్ధాలకు మూలమని దానిని విడదీసుకోవడమే మన లక్ష్యమని మనకు అర్ధమయితే సాధన జరుగుతుంది. అంటే నిరంతరం దేహం, మనస్సుతో తాదాత్యం చెందుతున్న నేనును ఆధారంగా చేసుకొని దాని మూలంలోకి ఉపసంహరించాలి. వచ్చిన ప్రతి తలంపుని ఇది ఎక్కడి నుండి పుట్టినదో ప్రశ్నించుకుంటూ దాని మూలాన్ని అన్వేషిస్తే

దేహగతమైన నేను పడిపోతుంది. అప్పుడు అక్కడ స్వరూపంగా ఉన్న 'ఆత్మ' అనుభవములోనికి వస్తుంది. మనస్సును అంతర్ముఖం చేయటం అంత తేలికా! జీవుడు, కర్మమార్గం, ధ్యానమార్గం, భక్తిమార్గం, విచారణమార్గం ఏదో ఒక మార్గంలో సాధనచేసి, భగవంతుని అనుగ్రహంతో, గురువు యొక్క అనుగ్రహంతో మనస్సుని మూలంలోకి ఉపసం హరిస్తే అక్కడ నిరంతరం 'నేను' నేను, అంటూ వెలుగుతున్న ఈశ్వర స్వరూపం అనుభవంలోనికి వస్తుంది.

జీవునికి స్థిరబుద్ధి, శుద్ధభక్తి రెండూ ఉంటేనే ఈశ్వర అనుగ్రహం కలుగుతుంది. మీరు గుడికి వెళ్ళితే మాకు మంచి బుద్ధిని, శుద్ధ భక్తిని ప్రసాదించమని వేడుకోవాలి. అప్పుడే ఈ శరీరమే నేను అనే బుద్ధి విడిపోయి సత్యం, నిత్యం అయిన ఆత్మతో అనుసంధానం ఏర్పడుతుంది. జీవులను ఆ స్థితికి చేర్చమని అరుణాచలేశ్వరుడుని భగవాన్ వేడుకొంటున్నారు.

## 76. మలమందు నీవియ్య మలగుటయో కృపా
## మలమందువై వెలు గరుణాచలా

**భావం :** అరుణాచలా ! తన నిజస్వరూపమును మరుచటచే కల్గిన దేహాత్మ భావం అనెడు అజ్ఞానంను పొగొట్టుటకు జ్ఞానౌషధం నీవు నాకిచ్చిన విదప, తిరిగి నేను ఆ మోహంలో పడను.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! నీవు కృపాగిరివి అయ్యా. నువ్వు మామూలు గిరివి కాదు, కృపా, దైవానుగ్రహంతోటి తయారుచేయబడినది. ఈ మాంసపు నేత్రాలకు అది రాళ్ళ కింద కనిపిస్తుంది. ఏ కారణం వల్ల నువ్వు జన్మ జన్మలకు తిరుగుతున్నావో, ఏ కారణంవల్ల నిన్ను దుఃఖం వెంటాడుతుందో, ఇవి అన్నింటికి మూల కారణం ఉంది. దానివల్ల ఇవన్నీ వస్తున్నాయి. ఆ కారణాన్ని తీసేసే వైద్యుడివి అయ్యా నువ్వు. కృపను పోసి, నీ కృపతో తయారు చేసినటువంటిగిరి ఈ అరుణగిరి. పరిసరాలకి, సంకుచిత విషయాలకు పరిమితం అయినటువంటి బుద్ధినితొలగించటం కోసం నువ్వు గిరి రూపంలో వెలిశావు. నువ్వు మాలో ఉన్న అజ్ఞానాన్ని తీసేసి జ్ఞాన మార్గాన్ని ఉద్ధరించటం కోసం, జ్ఞానం యొక్క ఔన్నత్యం చెప్పటం కోసం నీవు ఈ గిరి రూపంలో అవతరించావు. అది కొండ కాదు. ఈశ్వరుడి యొక్క ప్రేమ కరుణ ఆయన విలాసమే ఈ కొండ.

ఓ అరుణాచలేశ్వరుడా ! నువ్వే నా హృదయంలో వెలుగు. నిజమైన అరుణాచలేశ్వరుడు బయట ఎక్కడో లేడు నీ హృదయంలోనే ఉన్నాడు. ఆ నిజం తెలుసుకోవడానికి నువ్వు సహాయం చేయి అరుణాచలా! నాకు నువ్వే డాక్టరువి, నువ్వే మందువి అయితే నువ్వు బాహ్యంగా ఉన్నావు. నా హృదయంలో కూడా ఉన్నావు. నా ఆత్మ రూపంలో ఉన్నటు

వంటి నిన్ను నాకు అనుభవమయ్యేటట్లు అనుగ్రహించు అరుణాచలా! నువ్వు ప్రేమకు మారుపేరు. నీ ప్రేమతత్వం ఎలా ఉంటుంది అంటే నీ ప్రేమకు పరిమితులు లేవు కామానికి పరిమితులు ఉంటాయి. ప్రేమ వేరు కామం వేరు. ప్రేమకి అడిగే స్వభావం లేదు కామం అడుగుతుంది.

ఓ అరుణాచలేశ్వరుడా ! నువ్వు కృప చూపించి హృదయంలో ఉన్న వస్తువును నేను తెలుసుకునేటట్లు చెయ్యి. నా మనసుని అంతర్ముఖ పరచటానికి సహకరించు. నాకు జ్ఞానియొక్క సహవాసం కలిగించు. ఎవరి సమక్షంలో కూర్చుని ఉంటే మన ఇంద్రియాలు, మనస్సు నిర్మలంగా ఉంటాయో వారే జ్ఞాని. ఎక్కడ శాంతి, కాంతి, ఆనందం కలుగుతాయో ఆస్థితిని మాకు కలుగచేయడం కోసం కృప చూపించి, నాలో వెలుగును ప్రసరింపు అరుణాచలా. ఎక్కడైతే నిజం ఉందో అటు వైపుకు మా మనస్సు అంతర్ముఖం చేయి తండ్రీ నా హృదయంలో ఉన్న సుఖాన్నీ, శాంతిని, వెలుగుని నా అనుభవంలోకి తీసుకు రమ్మని భగవాన్ అరుణాచలేశ్వరుడుని ప్రార్థించమంటున్నారు.

## 77. మానముగొని చేరు వారి మానము బాపి, నిరభిమానత వెలు గరుణాచలా

**భావం :** అరుణాచలా ! దేహాభిమానంతో నీ చెంత చేరు భక్తుల అహంకారాన్ని హరించి నీవు మాత్రం నిరహంకారంగా నిలిచిపో.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! ఈ జీవుడికి దేహం మీద అభిమానం ఎక్కువ పూజ చేసిన, జపం చేసినా, ధ్యానం చేసినా ఈ నేను అనే దేహాత్మబుద్ధి అట్టి పెట్టుకొనే చేస్తాడు. ఈ జీవుల దేహాత్మబుద్ధిని పోగొట్టే పని నీవు పెట్టుకున్నావు. ఈ జీవుడు అరుణాచలం వచ్చినా పుణ్య క్షేత్రాలను దర్శించినా ఈ దేహభిమానము తోనే దేహానికి కావల్సిన ఆనందాల కోసమే ప్రార్థిస్తాడు. అరుణాచలా ! నీవు కరుణా సముద్రుడవు భక్తులు ఎవరైతే వారి నేనును మర్చిపోయి, వాళ్ళకున్న గొప్పలు మర్చిపోయి, నిండు మనస్సుతో నిన్ను స్మరిస్తున్నారో వాళ్ళను దేహాత్మబుద్ధి నుండి విడుదల చేస్తావు. నీవు అనాదిగా ఆపనే చేస్తున్నావు.

మరి ఈ జీవుడు అలా స్మరించగలడా! వారికున్న రాగ ద్వేషాలు ఇష్టాయిష్టాల మధ్య కొట్టుకొనిపోతూ ఉంటాడు. మధ్య మధ్యలో అరుణాచలా! అని నిన్ను స్మరిస్తూ ఉంటాడు. నీవెక్కడో కైలాసంలోనో, వైకుంఠంలోనో, అరుణాచలంలోనో ఉన్నావని అనుకొని నిన్ను మా అల్పబుద్ధితో, స్వల్పబుద్ధితో పట్టుకోవాలని చూస్తున్నాం మాకు ఎప్పుడూ అన్యభావనే అసలు అందరి హృదయంలో ఆత్మ స్వరూపుడుగా ఉన్నావన్న విషయం మాకు ఎప్పుడు అర్థమవుతుందయ్యా? నీవు నీ కృపచేత, నీ దయచేత, ఒక సత్పురుషుని సాంగత్యం, ఒక గురువు సాంగత్యం మాకు కల్పిస్తావు అప్పుడు ఆ వస్తువు

గురించి గురువు భోధించి అది ఎక్కడో లేదు, నీ హృదయం లోనే ఉంది అరుణాచలేశ్వరుడు నీకు అన్యంగా ఎక్కడో లేదు, నీ హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. ఉన్నది వాడు ఒక్కడే అనే ఎఱుక తీసుకొనివస్తాడు. అప్పుడు ఈ నేను అనే దేహాభిమానం వదిలి జీవుడు అంతర్ముఖం అవుతాడు.

అరుణాచలేశ్వరుడు జీవుల దేహాత్మబుద్ధిని తొలగించాలని కంకణం కట్టుకున్నాడు. ఎవరైతే దేహాత్మబుద్ధితో అరుణా చలేశ్వరుని స్మరిస్తున్నారో వారికి దేహం పై నున్న అభిమానాన్ని తప్పించి ఆత్మ సుఖం, శాంతి అనుభవంలోనికి తీసుకువస్తాడు.

ఓ అరుణాచలా ! ఏమి దయ చూపించావు నేను నిన్ను ఒకసారి స్మరించగానే నా దేహాత్మబుద్ధిని తీసేసి జీవులకు అసాధ్యమైన అంతర్ముఖ స్థితిని నాకిచ్చి నన్ను ఈ ప్రపంచానికి అతీతుడని చేసేసావు అరుణాచలా అంటున్నారు భగవాన్.

## 78. మించగా వేడెడు కించిజ్ఞుడను నను, వంచింపకను బ్రోవు మరుణాచలా

**భావం :** అరుణాచలా ! నాకంటె బలవంతులైన వారిని వేడుకొను గుణము గల అల్పబుద్ధి గలవాడను నేను. నా ఈ అల్పబుద్ధిని ఎంచి త్రోసిపుచ్చక వంచింపక అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! మించగా వేడెడు కించిజ్ఞడను నేను మూర్ఖుడిని అన్నీ అయిపోయాక ఇంక ఎందుకు పనిరాని పరిస్థితిలో నేను ఉన్నాను. నేను మూర్ఖుడినే.

అంటే కొంతమంది మనషులు ఎటువంటి వాళ్ళు ఉంటారు అంటే వాళ్ళ జీవితం పొడవునా ఏమి ప్రయత్నం చేయరు ఆఖరి క్షణంలో ఆఖరి రోజులలో కంగారు పడతారు. ఏమిటి మన జీవితం ఇలా అయిపోతుంది అని, అన్నీ ఊడిపోయిన తరువాత ఎందుకు పనికి రాకుండా ఇంట్లో ఎవరూ పలకరించ కుండా ఉన్నప్పుడు మాత్రమే కృష్ణా, రామా అనుకునే మనిషిని నేను. వల్లకాటికి అని కనిపెట్టుకొనే టైంలో అటువంటి పరిస్థితిలో దేవుడా, రామ, కృష్ణా అరుచలశివా అనుకునే బాపతి నేను. ఆరోగ్యముగా ఉన్నప్పుడు దేవుడి గొడవలేదు. కడుపునెప్పి వచ్చినప్పుడు అనుకుంటాను. అంత పెద్ద మూర్ఖుడను నేను. అన్నీ అయిపోయిన తరువాత అన్నీ ఊడ్చిపెట్టుకు పోయిన తరువాత మటుకే నిన్ను ప్రార్థించే రకాన్ని, నన్ను వంచింపక పోనీ ఆ చివరిక్షణంలో అయినా నన్ను స్మరిస్తున్నాడు అని నువ్వు కృతజ్ఞత పెట్టుకొని నన్ను విడిచిపెట్టేయక రక్షించుము.

ఓ అరుణాచలేశ్వరుడా ! ఒకవేళ నిన్ను జీవితం పొడవునా స్మరించక పోయినప్పటికి చివరి రోజులలో నిన్ను స్మరించినప్పటికీ కనీసం ఒకసారైనా నిన్ను స్మరించానే అనేటటువంటి జాలితో ఒకసారైనా నా కోసం తపించాడు, నాగురించి శ్రవణం చేశాడే, నాగురించి ధ్యానం చేశాడే, నా పేరు విన్నాడు. పోనీ పలకకపోయినా విన్నాడు. రమణస్వామి చెప్పినట్టు నీ నామం చేసే వాళ్ళకే భక్తుడిని చేయక్కరలేదు,

నీ నామం ఆలకించే భక్తుడికి భక్తుడని చెయ్యి, ఒకవేళ నేను మొద్దు అబ్బాయిని అనుకో మొద్దు అబ్బాయిని అయితే వదిలేస్తావా ? అంటే పాస్ మార్కులు వేసి పాస్ చేయ మంటున్నాడు. లాస్ట్ మినిట్‌లో అయినా నిన్ను ప్రార్థిస్తున్నాను. అందుచేత ఇప్పుడే నన్ను వంచింపక నన్ను రక్షించు ఓ అరుణాచలేశ్వరుడా !

## 79. నావికుడుండక పెనుగాలి నలయు, నా వనుగాక కాచిబ్రో వరుణాచలా

**భావం :** సముద్రమున ఓడను సురక్షితంగా నడిపించు నావికుడు లేక, పెను తుఫానులో చిక్కుకొని దిక్కుతోచని స్థితిలో నున్న ఓడవలె, మాయ అంధకారమైన సంసార సాగరమున చిక్కుకొని ఒడ్డు చేరలేక అల్లాడి తల్లడిల్లకుండ, రక్షకుడుగా నుండి నన్ను కాపాడుము అరుణాచలా!

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! ఈ సంసారమనెడి సాగరములో మోహాంధకారం అనే ప్రవాహంలో కొట్టుకు పోతున్నాను. ఒడ్డుకు అంటే నీ పాదాల దగ్గరకు చేరాలనే బుద్ధి పుట్టింది. నీవు చెప్పున్న సత్యంను ఆ సత్యవస్తువును తెలుసుకోవాలనీ బుద్ధి పుట్టింది. ఈ మాయాప్రవాహంలో కొట్టుకుపోతున్నాం. ఈ జననమరణచక్రంలో కొట్టుకు పోతున్నాం, ఈ ప్రవాహంలో కొట్టుకొని పోతున్న మనం సాధన చేస్తున్నాం, ప్రయత్నం చేస్తున్నాం. ఒడ్డుకు రావాలని తిప్పలు పడుతున్నాం. కాని మనలో ఉన్న వాసనలు మనలో ఉన్న

సంస్కారాలు మనల్ని బాధుతున్నాయి హృదయంలోకి వెళ్ళ నివ్వకుండా, హృదయంలోకి దిగటానికి ప్రయత్నం చేస్తున్నాం. మనలో ఉన్న సంస్కారాలే, మనలో ఉన్న వాసనలే, మనలో ఉన్న కోరికలే, మనలో ఉన్న కాంక్షలే, మన హృదయంలోకి వెళ్ళకుండా రాళ్ళు పెట్టి కొటినట్టు మన ప్రయత్నాన్ని విఘ్నం చేస్తున్నాయి.

మనం ఒడ్డుకు రావటానికి ఏవైతే అడ్డం వస్తున్నాయో., వాటిని తొలగించుకోవటానికి, శాస్త్రం యొక్క సహాయం, గురువు యొక్క సహాయం కావాలి తర్వాత కాలం కలిసిరావాలి ప్రయత్నంచేస్తూ వుండాలి కాలంకోసం ఎదురుచూడాలి. ఓపిక వుండాలి. గురువుని ఆశ్రయించాలి. గురువు బోధలు శ్రవణం చేయడంవలన ఆయన అనుగ్రహం వలన మాత్రమే మనం జననమరణచక్రం నుండి బయటపడతాం. ప్రావీణ్యం ఉన్న నావికుడు సుడిగాలిలో చిక్కకున్న నావను సునాయాసంగా ఒడ్డుకు చేరుస్తాడు. అలాగే వస్తువు అనుభవంలో ఉన్న గురువు మనకు సహాయం చేస్తే మనలో ఉన్న కోరికలను, వాసనలను పోగొట్టుకోగల శక్తి కలుగుతుంది. మనం హృదయంలోకి దిగటానికి చేస్తున్న ప్రయత్నం నెరవేరుతుంది. ఓ అరుణాచలేశ్వరుడా ! నీవే నా నావికుడవు, నీవే చుక్కానివి, నాకు దారి చూపించే గురువువి. నన్ను ఈ సంసారసాగరంలో మునిగిపోకుండా నీ పాదాల ఒడ్డుకు చేర్చుకొని నన్ను అనుగ్రహించు అని భగవాన్ ప్రార్థిస్తున్నారు.

## 80. ముడిమూలముల్ గాన మునుకొంటివి సరిగ,
## ముగియ భారము లేదొ యరుణాచలా

**భావం :** చిక్కుపడిన ముడి తుది మొదలు తెలియనట్లు చిక్కుపడిన అహంకారం అను ముడిని నా కొరకు విప్పి సహాయపడుటకు నీవే ఆదరించి ముడిని విప్పగల సమర్థుడివి కదా అరుణాచలా!

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! నేను మొదలు చివర తెలియని అహంకారంయొక్కముడి విడదీసుకోలేకపోతున్నాను. ఈ దేహం జడం. దానికి నేను అని చెప్పగల శక్తి లేదు. ఆత్మ చావుపుట్టుకలు లేని చైతన్యం. దానికి నేను అని చెప్పవలసిన అవసరం లేదు మరి నేను అని చెప్పే ఈ 'నేను' ఎవరు ? చైతన్యమైన ఆత్మను – జఢమైన దేహంను కలిపి ముడిపెడుతూ రెండింటికి మధ్యన దేహపరిమితమైన మిధ్యా 'నేను' ఒకటి పొడసూపుతుంది. అదే చిజ్జఢగ్రంధి (చిత్+జఢ) దీనినే కారణ శరీరమని, అహంకారమని, అజ్ఞానమని, జీవుడు అని పిలుస్తున్నారు. దీనికి నామం లేదు, రూపం లేదు, రంగులేదు. లింగం లేదు మతం లేదు. దేశం లేదు.

ఈ నేను అనునది ఒక తలంపు మాత్రమే. ఇది నిజం కాదు. ఇదే ప్రథమ తలంపు పునాది తలంపు దీనికే మిగిలిన తలంపులన్నీ వస్తున్నాయి. అందుకే ప్రతి మనిషి నేను నేను అని గుండెల మీద కుడి వైపున క్రింది భాగంలోనే చేయి వేసుకొంటాడు. ఈ 'నేను' కు మూలం అక్కడనే ఉంది. అదే ఆధ్యాత్మిక హృదయం కాని దీని స్పృహ మనకు లేదు.

మనందరము దేహము నేనే అనే తాదాత్మ్యంతో ఉన్నాం మూలంలోనికి ఈ మనస్సుని ఉపసంహరించే వరకు ఈ చిజ్జడగ్రంధి తెగదు. దీనిని మొదలు చివర తెలియక తికమకపడుతున్నాం జీవుడు తన తెలివితేటలతో, తనకున్న శక్తిసామర్ధ్యాలతో దీనిని విడదీసుకోలేడు. అన్ని దుఃఖాలకు మూలం ఈ గ్రంధి. దీనిని విడదీసుకోవడమే జన్మరాహిత్యము. ఇది విడదీసుకోవాలంటే గురువు అనుగ్రహం కావాలి, ఈశ్వర కటాక్షం ఉండాలి.

నేను నా తెలివితేటల వల్ల కనీసం ఒక్క గ్రంధిని కూడా ఊడ్చలేను ఏదో ప్రయత్నం అంటావా నువ్వు చెయ్యమని చెబుతున్నావు కాబట్టి చేస్తాను. కాని ఈ వాసనలను, ఈ గ్రంథులను నీవు వచ్చి లాగవలసినది కానీ నా తెలివితేటలు, నా ప్రయత్నం సరిపోదు. పునర్జన్మలకి సంబంధించిన ఈ హృదయగ్రంథి ముడి విడిపడాలి. ఆ ముడి ఎవరికైతే విడివడిందో అప్పుడు లోపల ఉన్న ఈశ్వరుడు తానుగా వ్యక్తం అవుతాడు. అప్పుడు లోపల ఉన్నటువంటి పరమశాంతి, ఆ నిర్వాణ సుఖం ఆ పూర్ణ సుఖం నీకు తానుగా వ్యక్తమవుతుంది అంటున్నారు భగవాన్.

## 81. ముక్కిడి మునుజూపు ముకురముగాక నన్, హెచ్చించి కౌగలిం పరుణాచలా

**భావం :** అరుణాచలా! ముక్కుకోయబడిన వాని ముందు తన ముఖం చూపునట్లు చూపబడు అద్దం వలేకాక తల్లి తన

బిడ్డను ప్రేమతో ఎత్తుకొని హత్తుకొనునట్లు నీవు నన్నెత్తుకొని హత్తుకొని అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! నా ముక్కు వంకరగా ఉంది అని నన్ను ఎగతాళి చేస్తావా ! అద్దం నాలో ఉన్న లోపం ఎత్తి చూపిస్తుంది. నీవు ఆ అద్దంలాగా ఎత్తి చూపుతావా ! అమ్మ తన బిడ్డ ముక్కు ఎలా ఉన్నా నా బిడ్డ అందగాడు అని అక్కున చేర్చుకుంటుంది. ఓ అరుణాచలా ! నీవు అద్దం చేసే పనిచేయకు. అమ్మ చేసేపనిచేయి.

నాలో చెడ్డగుణాలు ఉన్నాయని నాలో జీవలక్షణాలు ఉన్నాయని నిన్ను చేరుకొనే అర్హత లేదని ఎంచకు. అమ్మలాగా ప్రేమతో నన్ను నీకృపతో కూడిన చేతులతో నన్ను హత్తుకో అరుణాచలా! నాలో ఉన్న జీవలక్షణాలను నేను నా తెలివితేటలతో తీసుకోగలనా. ఏమండి మనకున్న అజ్ఞానంతో అరుణాచలేశ్వరుడుని అందుకోగలమా. ముందు మనం తెలివితేటలు లేని వాళ్ళమే మాలో ఉన్నవన్నీ అవలక్షణాలే అని మనం అంగీకరించాలి కదా! మనమేమో మనకున్న జీవలక్షణాలన్నీ సుగుణాలు అనుకుంటున్నాము. మాకు ఉన్న తెలివితేటలే గొప్ప అనుకునేటంతగా మేము పాడైపోయాం అలా అని మమ్ములను వదిలిపెట్టేస్తావా అరుణాచలా!

నువ్వు కరుణా సముద్రుడివి, నాలో ఉన్న అవలక్షణాల న్నింటిని నాశనంచేసి నన్ను సుగుణాలతో అలంకరించ గల సమర్ధుడవు. నాకున్న స్వల్పత్వము, అల్పత్వం నా బుద్ధికి

అందేటట్లు చేసి నువ్వే నీ దయతో నన్ను అక్కున చేర్చుకో అద్దము చేసేపని చేయకు అమ్మ చేసే పనిచెయ్యి, నాకు నిన్ను పొందకలిగే అర్హతలు లేకపోయినా, నిన్ను వేడుకొంటున్నాను, నీవే శరణం అంటున్నాను. మరి నన్ను వదిలేస్తావా ! నాకు నిన్ను చేరుకునే అర్హత కలుగచేసి నీ వాడిగా చేసుకో అరుణాచలా! అంటున్నారు భగవాన్.

## 82 సత్యాహమున మనో మృదుపుష్పశయ్యపై మేన్గలయ కరుణిం పరుణాచలా

**భావం :** దేహమనెడు ఆలయములోగల అతి మృదవైన హృదయమనెడు పూలపాన్పుపై మనమిద్దరము సత్యమైన అద్వైత స్వరూపమున అభేదముగా ఏకమై కలియునట్లు అనుగ్రహించు అరుణాచలా !

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! ఈ మనస్సు గొడవ లేకుండా చేసేశావు. ఈ మనస్సు ఉంటే అన్నీ గొడవలే, నేను అంటుంది నాది అంటుంది దేవుడు అంటుంది. ప్రపంచము అంటుంది. ఈ గందరగోళములో నుంచి నన్ను తప్పించి, నా మనస్సును నా అహంకారగతమైన నేను నుండి నన్ను విడుదల చేసి నా హృదయంలో ఉన్న నువ్వే నీ హృదయంలో చోటిచ్చావు. ఇంక ఇద్దరం ఒకటయి పోయాం. నాహృదయం అనే పూలపాన్పు మీద మనిద్దరం ఒకటి అయిపోయాం, ఏమి దయ చూపించావు అరుణాచలా!

జీవుడికి పరిపక్వత వచ్చినపుడే పరమాత్మ హృదయంలో ఉన్నాడనే గ్రహింపు వస్తుంది. ఇది మన తెలివితేటలతో చేసే సాధన వల్ల వచ్చినది కాదు. ఈశ్వరుడు తన దయ, కరుణ మన మీద వర్షిస్తే అప్పుడు మనం మాయలోనుండి బయటపడతాం. నిరంతరం అనన్యశరణాగతితో ఎవరైతే నీపాదాల వద్ద తమ అహంకారం సమర్పిస్తారో వాళ్ళను నీ మాయ నుండి తప్పిస్తావు. నీవు మాయతో చెపుతావు వీడు నన్ను తెలుసుకోవటానికి కష్టపడుతున్నాడు. వీడు శరణాగతి భక్తితో నన్ను వేడుకుంటున్నాడు దారి ఇవ్వు అని, అప్పుడు ఈ జీవుడు హృదయగుహలో పడిపోతాడు. అక్కడ నిరంతరం అంతర్యామిగా ఉన్న నీతో కలిసిపోతాడు. హృదయం అనే పాన్పుపై ఇద్దరు ఒకటయిపోతారు. ఇంక దేహగతమైన నేను విడిపోయి సత్యం, నిత్యం అయిన నేనులో ఐక్యం అయి పోతాడు. ఎప్పుడైతే వేరు బుద్ధి నశించిందో అఖండమైన నేనుతో ఏకమవుతాడు జీవుడు. జీవులకు అట్టిస్థితి కలిగింపమని అరుణాచలేశ్వరుడుని భగవాన్ ప్రార్థిస్తున్నారు.

## 83 మీదు మీదుగ మ్రొక్కు భక్తుల జేరి, నీ వందితే మేలిమి యరుణాచలా

**భావం :** స్వాభావికముగ అణకువ, వినయం, మృదు స్వభావం గల సామాన్య భక్తులతో చేరి వారింకను ఎంతో వినయంతో అణిగిమణిగి నిను సేవించు వారి స్వభావం యొక్క సహకారం వల్ల నీ కీర్తిప్రతిష్టలు పెరిగినవి అరుణాచలా!

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! నాకు భక్తి అంటే తెలియదు. నేనేమీ మాణిక్యవాచకర్ లాగా నీమీద కీర్తనలు పాడలేదు. ఎంతో మంది భక్తులు నిన్న సదా హృదయములో నిలుపుకొని నిరంతరం నీ నామమే స్మరిస్తూ నీ కీర్తిని నలు దిక్కులా వ్యాపించేట్లుగా నిన్ను స్తుతించారు అందుకే నీ కీర్తి నీ దయ, స్వభావం అందరికి అర్థమయ్యింది. మరి నిన్ను నేనమయినా ప్రచారం చేసానా! పాటలు పాడానా! నా మీద నీ అపారమైన కరుణ చూపించావు కదయ్యా నీ ప్రేమ ఇట్టిది, నీదయ ఇట్టిది అని ఎంతోమంది శుద్ధ భక్తితో నిన్ను సుత్తించారు కాబట్టి నాకు ఎంతో కొంత అర్దమయింది అరుణాచలా !

ఆచార్యులవారు అన్నారు. అసలు భక్తికి ఏది సరి పోతుంది. భక్తిని మించిన లక్ష్మి ఉందా, భక్తిని మించిన సరస్వతి ఉందా, భక్తిని మించిన పార్వతి ఉందా అని, భక్తి అంటే త్రిమూర్తుల-త్రిశక్తుల అనుగ్రహం అన్నారు. ఎంతోమంది నీ స్మరణ చేస్తూ అందరిలోను ఉన్న ఈశ్వరుడినే చూస్తూ అందరి పట్ల సమభావంతో, ప్రేమభావంతో జీవించే భక్తుల హృదయంలో నీవు చేరి వారిలోని ప్రేమభావం, భక్తిభావం పెంచి వారిని నీలో ఐక్యం చేసుకుంటావు. నాకున్న శక్తి కొద్దిపాటిదే అయినా నీ అనుగ్రహంతో నిన్ను తలపెట్టుకొనేటట్లు చేసి, నాలో భక్తిని పెంచి నన్ను ఆత్మ సామ్రాజ్యానికి వారుసుడిని చేసేశావు అరుణాచలా ! ఎంత

కరుణ చూపించావు. నీ ప్రేమ ఇట్టిది అని తెలిసిన తరువాత నీ గురించి లోకానికి తెలియ చెప్పకుండా ఉండలేము అరుణాచలా! నీ కీర్తిని లోకానికి చాటించే గొప్ప వాళ్ళం కాదు, నీ శక్తిని, దయని నీవే ఎఱుకపరుస్తావు అంటున్నారు భగవాన్.

## 84 మైమైదణచి కృపాంజనమున, నీ సత్య
## వశ మొనరించితి వరుణాచలా ! ॥అరుణాచలశివ॥

**భావం :** అరుణాచలా! దట్టమైన కటిక చీకటి వంటి మనో మైకమును నీకృప అనెడు వశీకరణ శక్తిచే పోగొట్టి ఆ మనసును సద్వస్తువగు నీ పరమార్ధ స్వరూపమునకు వశ పరిచితివి.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! ఈ జీవుడు జన్మజన్మల నుండి తన జీవత్వాన్ని అంటిపెట్టుకొని సంసారచక్రంలో పడిపోతున్నాడు. అజ్ఞానాన్ని పదిలంగా చూసుకుంటూ దాన్నే ధనంలా కాపాడుకుంటూ ఈ అజ్ఞానంతోటి దేవుడిని తెలుసుకుందామని ప్రయత్నం చేస్తున్నాడు. అజ్ఞానాన్ని విడిచిపెట్టకూడదు, చీకటిని విడిచిపెట్టకూడదు ఏదీ విడిచి పెట్టకుండా మనకు దేవుడు కావాలని అనుకుంటున్నాము. దేవుడు మనలని కరుణించాలని అనుకుంటున్నాము ఇది సాధ్యం కాదు. దేవుడు అనే అనుభవం కావాలంటే అజ్ఞానాన్ని విడిచిపెట్టాలి. అజ్ఞానం విడిచిపెట్టకుండా ఆత్మానుభవం, అమృతానుభవం రాదు. నీ తెలివితేటలతో దాన్ని పొందలేవు.

అరుణాచలేశ్వరుడు తన కృపతో, దయతో నిన్ను అనుగ్రహించి నీకున్న అజ్ఞానాన్ని తొలగించి నీకు అమృతానుభవమం కలిగిస్తాడు. ఇది అంతా అరుణాచలేశ్వరుని యొక్క కృపావీక్షణముల ద్వారా జరుగుతుందే కాని నీబుద్ధితో దానిని పొందలేవు. సూర్యుడు ఉదయించిన తరువాత లోకంలో చీకటి ఎలా పోతుందో ఆ సత్యానుభవం ఒకసారి మీకు దొరికిందా మీ హృదయంలో ఉన్న చీకటి అంతా బయటకు పోతుంది. మీకున్న అజ్ఞానాన్ని నాశనము చేసి, మీ హృదయంలో ఉన్న చీకటినంతా పోగొట్టి హృదయంలో ఉన్న జ్ఞానసూర్యుడు నీకు అనుభవంలోనికి వచ్చేస్తాడు. పరమేశ్వరుడు మీ హృదయం లోనే ఉన్నాను అని చెపుతున్నాడు. ఆ అమృత హస్తాలతోటి మీ హృదయాన్ని తాకితే, మీ మనస్సుని తాకితే అప్పుడు ఒక్కసారిగా వెలుగు మీ హృదయమంతా నిండి పోతుంది. అప్పుడు మీరు జన్మలను దాటిపోతారు అని అంటున్నారు భగవాన్.

## 85 మొగ్గ (బోడి) పతిపి నను బట్టబయట నీవు నట్టాడు టేలకో యరుణాచలా

**భావం :** అరుణాచలా ! నేను నాది అను అహంకార మమకారాలను నాలో పూర్తిగా నిర్మూలించి దాని ఫలితముగ హృదయాకాశమున నీకే సొంతమైన హక్కుతో తాండవ మొనర్చితివి.


బుద్ధం శరణం గచ్ఛామి



**నాన్నగారు :** ఓ అరుణాచలా ! నేను నా అహంకారంలో కలిసిపోయి 'నాది' అనే మమకారపు వలలో చిక్కుకుపోకుండా నీ కృపను వర్షింపచేసావు. నాలో అంతర్యామిగా ఉన్న నీవు నాకు స్వరూపముగా అనుభవంలోనికి వచ్చావు. నేను ఈ ప్రపంచపు మాయామోహంలో కొట్టుకొనిపోకుండా నన్ను ఈ ఆకర్షణలలోనుంచి బయటకు లాగి నన్ను బోడిని చేసేసావు. నా అహంకారాన్ని ఇసుమంతయు నెప్పి లేకుండా తీసేసావు. ఎంత దయచూపించావు అరుణాచలా ! జీవితమంతా సాధన చేసినా పోగొట్టుకోలేని ఈ అహంకారాన్ని పూర్తిగా నిర్మూలించావు.

జీవులు లేచినది మొదలు రాత్రి నిద్రపోయే వరకు నేను, నాది, అనే అహంకార మమకారాలతోనే జీవితమంతా గడుపుతూ, ఈ జనన మరణ చక్రములో కొట్టుకుపోతున్నారు. ఈ జీవులను వీటినుండి విడుదల చేయగలవాడవు నువ్వే తండ్రి. నేను ఈ ద్వంద్వాల మధ్యన జీవిస్తూ నా హృదయం ముకుళించుకొని పోయింది. నువ్వే దానిని వికసింప చేయగల వాడవు. నీ పాదాలే శరణంటూ ఎవరైతే నిన్ను అనన్య శరణాగతి చేస్తారో వాళ్ళలో నాటుకుపోయిన ఈ 'నేను 'నాది' లను తొలగించి వారికి హృదయములో వెలుగుతున్న నీ స్వరూపాన్ని అనుభవంలోనికి తీసుకుని వస్తావు. ఈ జీవుడు అప్పుడు పూర్ణంగా నీలో ఐక్యం అవుతాడు. అటువంటి స్థితికి

భక్తులను చేర్చుమని భగవాన్ అరుణాచలేశ్వరుడుని వేడుకుంటున్నారు.

## 86. మోహముదప్పి నీ మోహ మొనర్చి, నా మోహము తీరదా యరుణాచలా

**భావం :** మొదట నాకున్న ప్రాపంచక వ్యామోహాలను నశింపచేసి నన్ను నీపై తీరని వ్యామోహమును పొందునట్లు చేసితివి పిదప నీపై కలిగిన ఆ వ్యామోహంను నీవే తీసివేయి అరుణాచలా !

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! నా మీద నేను మోహం విడిచి పెట్టుకొన్నాను. నా గురించి నేను ఆలోచించుకోవడం మానేశాను. నా మనసు నా దేహం మీద పెట్టటం మానేసి నీ మీద పెట్టాను. నీ మీద పెడితే నీమీద మోహం నాకు పోవడం లేదు. ఆ మోహం ఎప్పుడు పోతుంది అరుణా చలేశ్వరుడా అని అడుగుతున్నారు రమణస్వామి. నేను బ్రాహ్మీస్థితి పొందాలి అంటే నీ మీద కూడా నాకు మోహం పోవాలి. నీ మీద కూడా మోహం పోతేనే కాని నాకు ఆ ఫైనల్ స్టేట్ అయిన బ్రాహ్మీస్థితి కలుగుతుంది. మోహం అంటే ఏమిటంటే? అజ్ఞానం. దాన్ని పోగొట్టుకోవడం కోసం మనం ఏమైనా ప్రయత్నం చేస్తున్నామా? ఏమైనా సాధన చేస్తున్నామా. భగవాన్ చెప్పారు అందరూ గజ ఈతగాళ్ళే దిగారంట చెరువులో, ఎవరూ గజం కదలటం లేదు అంటండి అలా

ఉంది మన సాధన. ఎంతసేపూ మన స్వార్థం కోసమే పూజ చేస్తున్నాం. జపం చేస్తున్నాం, దానం చేస్తున్నాం కాని నువ్వు దానధర్మాలు చేస్తే గొప్ప లోకాలు రావచ్చుకాని మోహం మటుకు నిన్ను విడిచిపెట్టదు. ఎప్పుడు విడిచిపెడుతుంది? లోపల ఉన్న బ్రాహ్మిస్థితి తెలుసు కొనేవరకు ఏ జీవుడిని మోహం, బంధం విడిచి పెట్టవు, నరకం విడిచి పెట్టదు అజ్ఞానం విడిచిపెట్టదు. ఆ ఆనందస్థితి, ఆ చైతన్యస్థితి, ఆ శాంతిస్థితి, ఆ పూర్ణస్థితి అది నీ హృదయం లోనే ఉంది. ఆ స్థితి నీకు తెలిసే వరకు, నీ బుద్ధికి అందేవరకు, బయట ఉన్న ఈ లోకాన్ని మోహిస్తూనే ఉంటుంది. ఈ మోహంలోంచి నువ్వు బయటపడలేవు.

నీమీద నాకున్న మోహాన్ని నీవే దయతో తొలగించి అభిన్నభావనను నాకు ప్రసాదించు అరుణాచలా! భిన్నంగా వున్నావంటే నాకు నిన్ను ఏదో అడగాలని ఉంటుంది. నన్ను ఆస్థితి నుండి తప్పించాలి. నీవు నేను అభిన్నమైపోతే ఇంక నీ మీద మోహం కూడా పోతుంది. ఆ స్థితిని ప్రసాదించమని అరుణాచలేశ్వరుని వేడుకొంటున్నారు భగవాన్.

## 87 మౌని యై రాయిగా నలరక నున్నచో, మౌన మిది యగునో యరుణాచలా

**భావం :** అరుణాచలా ! ఒకడు నోటితో మాత్రమే మాట్లాడక, మనసున కూడా వికాసం లేక రాయివలె నుండి స్వచ్ఛమైన

స్వరూపానుభవ శాంతి లేక యుండినచో అది మౌనం అవుతుందా?

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! నీ మీద నాకు ప్రేమ ఉన్నప్పుడు నామీద నీకు ప్రేమ ఉన్నప్పుడు మాట్లాడు కోవలసిన పని లేదు హృదయం హృదయంతోటి మాట్లాడి నప్పుడు ఇంక మాటలెందుకు. నాపట్ల ఎఫెక్షన్ లేనప్పుడు మాటలు కావాలి అనిపిస్తుంది, నీవు నామీద ఆప్యాయత చూపించి నీ కరుణతో నన్ను ఇక్కడకు రప్పించి ఇప్పుడు నాతో మాట్లాడకుండా కొండలా రాయిలా కూర్చున్నావు ఏమిటి. పైకి అలా ఉన్నా నీవు కరుణాసముద్రుడివి దయా సముద్రడవి. నీ నిజస్థితిని నాకు అనుభవంలోనికి రప్పించ టానికే నీవు మౌనం వహించావు.

మనము మాట్లాడకుండా నోరుమూసుకొని కూర్చుంటే మౌనమని అనుకుంటున్నాము. కాని నిజమైన మౌనము అంటే తలంపులు లేకుండా, అంతర్ముఖమై ఆత్మానుభవమును అనుభవించు స్థితియే. ఓ అరుణాచలా ! నీ మౌనంను అర్థం చేసుకొనే బుద్ధికాని తెలివితేటలు కాని మాకు లేవు. మాకున్నది అజ్ఞానము, దేహాత్మబుద్ధి, మరి మౌనం కూడా అనుగ్రహమే అని మాకు అర్థమవ్వాలి కదా! నువ్వు ఏమి చేసినా మౌనంగానే చేస్తావు నువ్వు అనుగ్రహించాలి అనుకుంటే ప్రక్కవారికి తెలియకుండా కూర్చున్న వాళ్ళు నిల్చునే లోపు మోక్షాన్ని

ఇవ్వగలవాడవు. నీకు తాంతాంలతో పని లేదు. అంతా మౌనం గానే చేసేస్తావు. ఇది మా అల్పబుద్ధికి అందాలి అంటే నీ మీద సంపూర్ణమైన భక్తి, విశ్వాసములు కావాలి కదా, నీ అనుగ్రహంతో నాకు నీమీద పూర్తి విశ్వాసం, భక్తి ప్రవృత్తులు కలిగేటట్లు ఆశీర్వదించు అప్పుడు నీమౌనము గొప్ప అను గ్రహమని ఈ జీవుడికి అర్ధమవుతుంది.

నిజమైన మౌనం అనుభవములోనికి తీసుకువచ్చి నీ యొక్క స్వరూపానుగ్రహానికి పాత్రులను చేయి తండ్రి ! అంటూ అరుణాచలేశ్వరుడుని భగవాన్ ప్రార్థిస్తున్నారు.

## 88. ఎవరు నా నోటిలో మన్నును గొట్టి, నా బ్రతుకు హరించిన దరుణాచలా

**భావం :** అరుణాచలా ! అందరి మధ్యలో నేను కూడా ఒకనిగా జీవిస్తున్న నా బ్రతుకులో మన్నుగొట్టి, భవ్యముగా గడుపుతున్న నా జీవనమును, బ్రతకనీయక పాడుచేసి, నాశనం చేసేశావు.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! నా రాగద్వేషాలు, నా ఇష్టాఅయిష్టాలతో జీవితం గడుపుతున్నాను. అలాంటి నన్ను ఈ జీవితంతో, ఈ గుణాలతో, ఈ బంధాలతో ఎప్పటికి భగవంతుడిని తెలుసుకోలేనని ఈ జీవితం సున్న అని, ఎన్ని ఉన్నా భగవంతుడి ప్రేమ లేకపోతే బ్రతుకు వ్యర్ధమనే విషయం కూడా తెలియకుండా జీవిస్తున్న నా కళ్ళు తెరిపించావు. ఈ అసత్యమైన అబద్ధమైన జీవితం గురించి తెలియచేసి నా

నోట్లో మన్నును కొట్టి నన్ను అమృతమయుడిని చేసావు అంటున్నారు భగవాన్.

ఈశ్వరుడు మనలను నిజమైన జీవితం వైపు కళ్ళు తెరిపించటానికి కొన్ని సంఘటనలను క్రియేట్ చేస్తాడు. మనం నిజంగా మంచివాళ్ళం కాకపోయినా, చాలా మంచివాళ్ళుగా నటిస్తున్నామనుకోండి, మన కళ్ళు తెరిపించటానికి కొన్ని విషయాలను క్రియేట్ చేసి మనం ఇప్పటివరకు పామును చూసి తాడు అనుకుంటున్నాము అనే విషయం గ్రహింపునకు తీసుకొని వస్తాడు. అప్పటివరకు నాకున్న రాంగ్ థింకింగ్‌ని తీసేసి నానోట్లో మన్నుని కొట్టి నన్ను రైట్ థింకింగ్‌లోకి రైట్ పాత్‌లోకి నడిపించావు నా నోట్లో మైసూర్‌పాక్ పెట్టావు. ఇంక నన్ను ఈ లోకం ఏమి ఆకర్షిస్తుంది. నా అజ్ఞానం కూల్చేసి అమృతంతో నింపావు. ఆ అమృతం రుచి మరిగిన నన్ను ఇంక ఈ లోకం ఏమి ఆకర్షిస్తుంది అన్నారు భగవాన్.

అరుణాచలేశ్వరుడా ! ఏమి దయ చూపించావు. నిజమైన జీవితంలోకి అమృతత్వములోనికి పంపించేశావు. అప్పటివరకు విషయాలతో నిండిపోయిన మనస్సుకు ఈ విషయాలలోని విషం చూపించి దానిని బయటకు కక్కించి అమృతాన్ని పోసావు. ఇంక జీవుడికి ఇంతకన్నా గొప్పస్థితి ఏముంటుంది.ఈ ప్రపంచాకర్షణలకు దూరంచేసేసి నీ ఆనంద స్వరూపానుభవంను ప్రసాదించావని అంటున్నారు భగవాన్.

## 89 ఎవరు గనుక నాదు మదిని మైకపరచి, కొల్లగొనిన దెవ రరుణాచలా

**భావం :** అరుణాచలా! నాకు చాలా దగ్గర ఉన్న వాళ్ళు కూడా తెలుసుకోలేనట్లుగా నా బుద్ధిని మరల్చి, మైకపరచి, దోచుకొని పోయినది నీవు తప్ప వేరెవరు.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! ఒక జ్ఞాని ప్రభావం, భగవంతుడి ప్రభావం ఒక మహర్షి ప్రభావం నిశ్శబ్ధంగా భక్తుడి హృదయంలోకి రహస్యంగా చొరబడుతుంది. ఎవరికైతే సహాయం చేస్తున్నారో వాడు తన ద్వారా సహాయం పొందు తున్నాడు అన్న సంగతి వాడికే తెలియనివ్వడు. భక్తుడి హృదయంలోకి రహస్యంగా జొరబడతాడు. హృదయంలో భగవంతుడు జొరబడినట్లు వాడికే తెలియదు. వాడిని ప్యూరిఫై చేస్తున్నట్టు వారికే తెలియదు. ఆ ప్యూరిఫికేషన్ అంతరాంత రాళల్లోంచి వస్తుంది. జ్ఞానం అనేది పై నుంచి పోసేది కాదు, లోపల నుండి ఊరేది. అంటే వస్తువు మనకు అనుభవంలో ఉండాలి నాలోపల ఉన్న అమృతాన్ని నాకు అనుగ్రహించావు అరుణాచలా! ఇది అంతా ఎలా జరిగింది నీ డివైన్ ఇంటర్ ఫియరెన్స్ వల్ల నన్ను నాకు కాకుండా చేసేశావు. నా మనస్సుని నీ మైకంలో పెట్టి నాలో ఉన్న అజ్ఞానం కొల్లగొట్టావు. ఎంత దయ చూపించావు అరుణాచలా !

సద్వస్తువు ఒకటి హృదయంలో ఉందని కాని, అది అరుణాచలా! నీ స్మరణ మాత్రముననే లభిస్తుందని కాని

ఏమి తెలియని నాకు బంధువు ద్వారా అరుణాచలం పేరు వినేటట్లు చేశావు నాహృదయంలో దూరిపోయావు. జన్మాంతర అనుబంధంతో నిన్ను స్మరించేలాగ చేసి నా మనస్సు నీవు కొల్లగొట్టేసి నన్ను నీ హృదయములోకి తీసుకున్నావు. ఇది అంతా నాకు తెలియకుండానే నేనేమీ ప్రయత్నం, సాధన చేయకుండానే కేవలం నీ అనుగ్రహముతోనే నన్ను నీ ప్రేమ మైకంలో పెట్టేసావు అరుణాచలా! అని భగవాన్ అంటున్నారు.

## 90 రమణుడనుచు నంటి రోషము గొనక నన్, రమియింపజేయ రమ్మరుణాచలా

**భావం :** అరుణాచలా! రమణుడు ఇటువంటి నిందలు వేస్తున్నాడేమిటి ? అని కోపగించుకోకుండా నన్ను కూడా నీ అంతటివాడిని చేయి.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! ఏమిటి ఈ రమణుడు నామీద నిందారోపణలు చేస్తున్నాడని నామీద కినుక వహించకు. నీమీద నాకున్న ప్రేమ భావనతో నిన్ను ఏమైనా అన్నా అవి అన్నీ నీ హృదయంలోకి తీసుకుంటావా! చిన్న పిల్లవాడిని తల్లితండ్రి ఎత్తుకొన్నప్పుడు కాళ్ళతో తన్నుతుంటాడు. వాళ్ళు కినుక వహించరు కదా? ఆనందముగా గుండెలకు హత్తుకుంటారు కదా! అలా నేనేమయిన నీమీద నిందలువేసినా నిష్ఠూరాలు ఆడినా అవి అన్నీ నీవు చిన్న పిల్లల చేష్టలుగానే భావించు అరుణాచలా! నువ్వే నన్ను

దగ్గరకు చేర్చుకున్నావు మరి నన్ను కలవకుండా దోబూచు లాడుతున్నావేమిటి ? మరి భక్త సులభుడవయిన నీకు ఇది తగదు నన్ను అనుగ్రహించి నీలో ఐక్యం చేసుకో!

నేను నిన్నే నిజమైన నాథునిగా తలచుకొంటున్నాను, జీవులకు నిజమైన భర్త పరమాత్మయేకదా!. నాకు తల్లి, తండ్రి, గురువు, పతి, గతి, అన్నీ నీవేనయ్యా! అరుణాచలేశ్వరుడు నన్ను అనుగ్రహించి అంతరదృష్టిని ప్రసాదించాడని అందరికి నిన్ను బహిర్గతముగా చేస్తున్నందుకు నా మీద కోపము తెచ్చుకోకు. ఇది అంతా నీ అనుగ్రహమే కదా! నా ఈ పొరపాటుకు కినుక వహించకుండా నన్ను నీలో ఐక్యము చేసుకొని ఆనంద పరవశుడిని చేయి అరుణాచలా నీ ఆగ్రహము కూడా అనుగ్రహమే నాకు. నీవు నిజంగా ఆగ్రహిస్తే నేను తట్టుకోగలనా! నీ మీద ఉన్న ఇష్టాన్ని ఇలా ప్రదర్శించి నందుకు నా మీద ఆగ్రహము తెచ్చుకోకుండా నన్ను నీ పూర్ణ శాంతిలో, ఆ పరమసుఖస్థితిలో ఉండేట్లు కరుణించు అని భగవాన్ అరుణాచలేశ్వరుడుని వేడుకొంటున్నారు.

## 91. రేయింబవలు లేని బట్టబయటి యింట
## రమియింపగా రమ్ము అరుణాచలా !

**భావం :** అరుణాచలా! రాత్రి పగలు లేని సమయమున చిదాకాశ హృదయ మనెడి యింటిలో మనమిద్దరం ఒకటిగా కలసి ఆనందించెదము రమ్ము అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా! మనం పుట్టినప్పటి నుండి రాత్రిళ్ళు ఎలా ఉన్నాయో, పగళ్ళు ఎలా ఉన్నాయో చూస్తున్నాము. ఎన్నో పగళ్ళు, రాత్రిళ్ళు వెళ్ళిపోయినవి. రాత్రి పగలు లేని స్థితి ఎక్కడ ఉంటుందో అది ఎలా ఉంటుందో అది ఎప్పుడూ చూడలేదు. అక్కడికి తీసుకు పొమ్మంటున్నాడు. అరుణాచలేశ్వరుడిని ఎక్కడ రాత్రి లేదో, ఎక్కడ పగలు లేదో, ఎక్కడ అహంకారము లేదో, ఎక్కడ స్వార్థం లేదో, ఎక్కడ రాగద్వేషాలు లేవో అక్కడకు తీసుకు పొమ్మంటున్నారు. అక్కడకు మేల్కొల్పమంటున్నాడు. ఎక్కడా భయంలేని చోటుకు తీసుకువెళ్ళమంటున్నారు భగవాన్.

ఆ స్థితి ఎక్కడ వుంటుందండి. మనస్సు మూలములోనికి వెళ్ళిన వాడికి ఇంక రాత్రి, పగలు లేదు, మనస్సు లేనిస్థితి. ఆ ఆనందస్థితి, ఆ ప్రశాంతస్థితిలో, అద్వైతానుభూతిలో సుఖముగా ఉందాం అరుణాచలా! అంటున్నారు భగవాన్.

## 92 లక్ష్యముంచి యనుగ్రహస్తము వైచి, నన్
## కబళించి తుసురుతో నరుణాచలా

**భావం :** అరుణాచలా! ఎందరో ఉండగ నన్నే లక్ష్యముగా పెట్టి గురి ఏ మాత్రం తప్పకుండ కొట్టగల నీ అతి లక్షణమైన బ్రహ్మాస్త్రమును నా పై సంధించితివి నన్ను ప్రాణంతో సహా మింగితివి.

**నాన్నగారు :** ఓ అరుణాచలా!. నీకెవ్వరూ దొరకలేదా! ఏదో బడికి వెళ్ళే పిల్లవాడిని ఏవో ఆధారాలతో జీవిస్తున్న వాడిని, నాలాంటి వాళ్ళు ప్రపంచములో ఎందరో ఉన్నారు. కాని నన్నే లక్ష్యంగా చేసుకొని నా శరీరం ఈ భూమి మీద తిరుగాడు తుండగానే నాలో ఉన్న దేహభావనను గురిచూసి కొట్టి మరణానుభవం ద్వారా మరణం లేనిస్థితికి నన్ను తీసుకొని వెళ్ళావయ్యా ! ఏమి దయ చూపించావు అరుణాచలా! నా రాగద్వేషాల నుండి, నాకున్న అజ్ఞానం నుండి, నేను ఏమి సాధన చేయకుండానే, పూజలు, జపాలు చేయకుండానే నీ యొక్క కరుణతో అనుగ్రహమనే అస్త్రము సంధించి విముక్తిడిని చేసేశావు.

జీవుడికి గౌరవాలు, మానావ అవమానాలు ఉంటాయి. రమణస్వామి అరుణాచలం వెళ్ళిన రోజునే తనను అర్పించు కొని, అప్పా నీ ఆజ్ఞ మేరకు వచ్చాను. ఇది (ఈ శరీరం) నీది దీనిని నీవు ఎలా ఉపయోగించుకుంటావో నీ ఇష్టం అని శరణాగతి అయిపోయాడు. అరుణాచలేశ్వరుడు రమణ స్వామిని తన అనుగ్రహమనే అస్త్రాన్ని ప్రయోగించి దేహాత్మ బుద్ధిని తొలగించి జీవన్ముక్తిస్థితిని అనుగ్రహించారు. దేవతలకు కూడా అందని ఆ స్థితిని అరుణాచలేశ్వరుడు భగవాన్‌కు అనుగ్రహించారు.

ఎవరైతే ఈశ్వరకోటివాళ్ళో వాళ్ళ గురించి ఈశ్వరుడే చూసుకుంటాడు. ఎవరైతే పక్కానికి వచ్చారో వాళ్ళని డివైన్ ఇంటర్ఫియరెన్స్‌లోనే అనుగ్రహించేస్తాడు. తమ దేహాభిమానాన్ని విడిచిపెట్టి పని పని కోసమే చేస్తూ, అందరిలోనూ అంతర్యామిగా ఉన్న పరమాత్మను దర్శించాలి. తమ సమయాన్ని భగవంతుడిని తెలుసుకోవడానికే ఖర్చు పెట్టుకునే వారిపై అరుణాచలేశ్వరుడు తన అనుగ్రహం అనే అస్త్రాన్ని సంధించి తన స్వరూపానుభవం ఇచ్చేస్తాడు. జీవులకు ఆ బుద్ధి కలిగించమని భగవాన్ వేడుకొంటున్నారు.

## 93 లాభమీ విహపర లాభహీనునిజేరి, లాభమే మందితి వరుణాచలా

**భావం :** అరుణాచలా ! ఎవరు నిన్ను పొందుదురో వారికి నీవు పరిపూర్ణ మహదానందమైన పరమలాభమగుదువు. ఇహపరములలో ఏ లాభము కలుగచేయని నన్ను గుర్తించి యెంచుకొనుటలో నీవు ఎట్టి ఉపయోగం పొందితివి నావల్ల నీకు వచ్చిన లాభమేమిటి?

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా? నువ్వే నాకు లాభం లోకానికి అంతా నువ్వేలాభం, నిన్ను సంపాదించిన తరువాత నాకు ఇంక సంపాందించవలసినది ఏమీ మిగలలేదు. దేవుడుకంటే మించిన లాభం ఈ లోకంలో ఉందా? దేవుడిని పొందితేనే లాభం పొందుతాను అనే భావన జీవులలో ఎవరికి

అయినా ఉందా? ఎవరికీ లేదు. మనకి లోకానికి సంబంధించిన లాభం కావాలని అనుకుంటూ ఉంటాం కాని, నిజం అయిన లాభం ఏమిటి అరుణాచలేశ్వరుడే. ఆ దేవుడు ఎక్కడ ఉన్నాడు నీ హృదయంలో ఉన్నాడు. అరుణాచలేశ్వరుడు తిరువణ్ణామలైలోనే ఉన్నాడు అనుకోకండి మీ హృదయం లోనూ ఉన్నాడు. వాడిని పొందండి అప్పుడు తెలుస్తుంది. ఎంత లాభాన్ని పొందారో, ఎంత ఐశ్వర్యాన్ని మీరు పొందారో, పొందిన తరువాత తెలుస్తుంది.

ఈ లోకంలో ఏమీలేదట రమణమహర్షి అనే పెళ్ళి కూతురుకి పరలోకంలో ఏమీలేదు అంట. నన్ను ఎందుకు తీసుకున్నావు ? నన్ను హృదయంలోకి ఎందుకు లాక్కొన్నావు? నాకేమి సంపద ఉంది నాకు ఏమి ఐశ్వర్యం ఉంది. నన్ను తీసుకోవడం వల్ల నీకేమైనా లాభం వస్తుంది అనుకుంటు న్నావా! నువ్వే లాభానివి.

మీరందరూ పూజలు ఎందుకు చేస్తున్నారు పరలోకంలో సుఖాలు పొందవచ్చు అని యజ్ఞాలు చేస్తున్నారు, దానాలు, ధర్మాలు చేస్తున్నారు. ఈ రమణమహర్షి అనే పెళ్ళికూతురికి ఏ పుణ్యం లేదు. అలాంటి ఈ సున్నని నువ్వు తీసుకొంటావా అరుణాచలేశ్వరుడా! రమణమహర్షి వారు చెప్పింది ఏమిటంటే మన కర్తృత్వతోటి, అహంకారంతోటి జీవలక్షణాలతోటి ఏపని అయినా చేస్తాం. అందుచేత రమణ స్వామి ఇలా

కర్తృత్వంతోటి పనులు చేసి పోగొట్టుకోవటానికి ఏమీ లేదు. ఈ లాభనష్టాలు, రాగద్వేషాలు అన్నీ మనసు పరిధిలోనివి అహంకారంలేని వాడికి ఏమి ఉంటుందండి. ఉన్నది ఆత్మస్వరూపం. అహంకారం లేకుండా జీవించడం, ప్రేమపూరితంగా పని చేయడం ఈ రెండు పట్టుకొని జీవులందరూ జ్ఞానులు అయి పోవాలని ఇదే తపస్సు అని ఇంతకు మించిన తపస్సేమీలేదని ఈస్థితికి జీవులందరిని చేర్చమని భగవాన్ కోరుకుంటున్నారు.

## 94 రమ్మని యనలేదె వచ్చి నా వంతివ్వ, వెఱకు నీ తలవిధి యరుణాచలా

**భావం :** అరుణాచలా ! విధియొక్క చేతలచే, నీవే నన్ను బలవంతముగ నీ దగ్గరకు వచ్చునట్లు చేయలేదా? అందు వలన నీవు ఇప్పుడు నా యోగక్షేమములు తెలుసుకొని నన్ను భరింపుము ఇది నీ బాధ్యత అంటున్నారు భగవాన్.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! నేను నిన్ను పిలిచానా నీవే నా హృదయంలో దూరి నిన్ను తలపెట్టుకునేటట్లు చేశావు. చిన్న వయస్సులోనే నీ పేరు వినేటట్లు చేశావు. నీ అనుగ్రహం లేకుండానే నేను నిన్ను స్మరించానా ! నీవే నిన్ను తలపెట్టు కొనేటట్లు చేసి నన్ను ఈ ద్వంద్వాల నుండి విడుదల చేసి నీ సన్నిధికి చేర్చుకున్నావు. మరి నన్ను నీవు కోరితెచ్చుకున్నావు కదా! ఇప్పుడు నా యోగక్షేమాలు నీ బాధ్యతే కదా!

ఒకవేళ నాలో ఇంకా ఏమైనా లోపాలుంటే నీవే సవరించు అందులో ఏమైనా కష్టనష్టాలున్నా నీవే బాధ్యత వహించాలి కదా! ఇది నీవిధి (నీ విధ్యుక్తధర్మం) కదా! ఎవరైనా పెద్దమనిషి ఏదైనా సహాయం చేస్తాను రమ్మని చెప్పిన తరువాత ఆ సహాయం చేయటంలో ఏమైనా కష్టనష్టాలుంటే భరించాలికదా! అంటున్నారు భగవాన్.

భగవంతుడు కోరి మనలని తీసుకుంటే మన యోగ క్షేమాలన్నీ ఆయనే చూసుకుంటానని వాగ్దానం చేశాడుకదా! మనలని ఎన్ను కోవాలంటే మన భక్తి ఎలా ఉండాలండి. అన్యచింతన లేకుండా అనన్యచింతనతో ఆయనను శరణు వేడితే పరమాత్మ పాదాలు తప్పించి ఇంక ఏమీ ఈ ప్రపంచములో వద్దు అనే వైరాగ్యం ఉంటే, నీవే నాకు దిక్కు అని పార్థిస్తు వుంటే ఇంక ఆయనే మనలను వదిలిపెట్టడు అండి. మన యోగక్షేమాల గొడవ మనకు లేదు. ఆయనే చూసుకుంటాడండి. అది ఆయన విధి. ఆయన ధర్మం కదా! అలా భక్తుడు జీవిస్తూ ఉంటే ప్రారబ్ధం ఏమైనా దెబ్బలు కొట్టినా వాడు దాన్ని పాయసం తాగినట్లు తాగేస్తాడు. వారిని ఆత్మ సామ్రాజ్యానికి వారసుడుని చేసేస్తాడు. అలాంటి భక్తులందరిని కాపాడటం నీ ధర్మం ఇదే నీవు పనిగా పెట్టుకొన్నావు. భవిష్యత్తులోను నీ పని ఇదే, ఇదే నీ విధి అరుణాచలా ! అంటున్నారు భగవాన్.

## 95 రమ్మని లోదూరి నీ జీవ మిడునాడె
## నా జీవమును బాపి తరుణాచలా

**భావం :** అరుణాచలా! నీ కరుణతో నీనే నన్ను నీతో రమ్మని పిలుచుకొని, హృదయకుహరమున దూరి, నీ స్వరూప సాక్షాత్కార జీవితమును అనుగ్రహించిన ఆ దినముననే. నా దుఃఖమయమైన అహంకార జీవితమును పోగొట్టుకొంటిని.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! ఎంతపని చేశావయ్యా! నాకు తెలియకుండానే నీవు నాహృదయంలోనికి ప్రవేశించావు. ఏదో బడికి వెళుతున్న పిల్లవాడిని, ఆట పాటలతో కాలక్షేపం చేస్తున్న నన్ను బంధువు ద్వారా నీ నామాన్ని వినిపించి, నన్ను ఆ నామాన్ని తలపెట్టుకొనేటట్లు చేసి నీవు నా హృదయ గుహలోకి దూరిపోయావు. ఇంక నాలో ఉన్న రాగ ద్వేషాలకి కాని, నా అజ్ఞానానికి కాని అక్కడ స్థానం లేకుండా చేసేశావు ఎంత దయ చూపించావు. నీవు నీ కృపతో దయతో నన్ను నీహృదయంలోకి తీసుకొన్నావే కాని ఇక్కడ నా సాధన ఏదైనా ఉందా ? నాకు తెలివితేటలు ఉన్నాయని తీసుకున్నావా! ఏమీ లేని నన్ను ఎలా ఎన్నుకున్నావయ్యా! ఇది అంతా నీ కృపానుగ్రహమే కదా ! సూర్యకిరణాలు ప్రవేశిస్తే ఎన్నో సంవత్సరాల నుండి చీకటిగా ఉన్న గదిలోకి అక్కడ చీకటి ఉంటుందా పారిపోతుంది కదా! అలా నీవు జ్ఞానసూర్యుడి వలే నా హృదయంలోనికి ప్రవేశించి అక్కడున్న అజ్ఞాన అంధకారానికి రూపు లేకుండా చేసేశావు. నన్ను అమృత

మయుడిని చేశావు. సత్యజీవితంలోకి పంపేసావు. ఎంత కరుణ చూపించావు అరుణాచలా ! అంటున్నారు భగవాన్.

## 96 విడిచిన కష్టమౌ విడక నిన్నుసురును, విడువ యనుగ్రహిం పరుణాచలా ॥అరుణాచల శివ॥

**భావం :** అరుణాచలా ! నేను నిన్ను నా మదిలో తలచక ప్రాణం విడిచినచో, జన్మపరంపరలో పడిపోతాను. అట్లు కానీయక చివరి క్షణమున నీ స్మరణలో ప్రాణం వదులునట్లు అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! నిన్ను విడిచిపెట్టి నేను ఉండలేను నిన్ను విడిచిపెట్టకముందే నా ప్రాణం పోయేటట్లు చేయి. ఏమంటున్నారో చూడండి నిన్ను విడిచి పెట్టకముందే నా ప్రాణం పోవాలి. పరీక్షలు ఉన్నాయను కోండి. సంవత్సరం పొడవునా కష్టపడి చదువుతాం అనుకోండి తీరా పరీక్ష రాయటానికి వెళ్ళాక ఒక్కటీ జ్ఞాపకం రాదు అనుకోండి ఫెయిల్ అయిపోతాడు. అదే విధంగా జీవితం పొడవునా ఎవరైతే సాధన చేస్తున్నారో ఎవరైతే తపిస్తున్నారో వారు మాత్రమే ప్రాణం పోయేటప్పుడు పరమేశ్వరుని విడిచి పెట్టకుండా ఉండగలరు. రమణస్వామి 54 సంవత్సరాలు అరుణాచలంలోనే ఉన్నారు. అరుణాచలం విడిచిపెట్టి వెళ్ళాలనే తలంపు కూడా నాకు రాలేదు అన్నారు. అంతఇష్టం అరుణాచలం అంటే జన్మాంతరమైనటువంటి అనుబంధం

అరుణాచలంతోటి ఆయనకు ఉంది. రమణస్వామి రూపంలో నడిచింది అరుణాచలేశ్వరుడే. అరుణాచలం కొండే మానవ రూపం ధరించి వచ్చి తిరుచ్చుళిలో పుట్టి మళ్ళీ అరుణాచలం వెళ్ళి అరుణాచలంలో కలిసిపోయినది. ఏ జన్మలోనో మనకు అరుణాచలంతోటి అనుబంధం ఉంది. అరుణాచలం నుండి విడిపోయివచ్చాం. మళ్ళీమనందరం అరుణాచలం వెళ్ళటానికి ప్రయాణాలు చేస్తున్నాం.

సంవత్సరం పొడవునా జీవితమంతా సాధన చేసిన వారికే ఈశ్వరుడు జ్ఞాపకం వస్తాడో లేదో చెప్పలేం. మనకెలా జ్ఞాపకం వస్తాడండి. అందుచేత జీవితం పొడువునా సాధన చేస్తే అరుణాచలేశ్వరుడు మనకు గురురూపంలో వచ్చి మన ప్రాణప్రయాణ సమయంలో సద్భావనలతో కూడిన స్థితిని కలుగచేసి మనలను బంధంలోనుండి మోక్షంలోకి పంపిస్తారు. విడుదల చేస్తాడు. అటువంటి స్థితి జీవులకు కలిగించమని అరుణాచలేశ్వరుడిని వేడు కుంటున్నారు భగవాన్.

## 97 ఇల్లువిడువ లాగి లోనింటి లోజొచ్చి,
## యొగి నీదు యిలు జూపి తరుణాచలా

**భావం :** అరుణాచలా ! నీకృపాశక్తిచే నన్ను నా యింటి నుండి బలాత్కారముగ బయటకు లాగి మనస్సనెడు హృదయ గృహమున ప్రవేశించి మెల్లగ అతి సూక్ష్మమైన నీ కైవల్య పదమగు మోక్ష గృహమును చూపించి అను గ్రహించితివి.





**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! ఎంతపని చేశావు నా యింటిలో ఉన్న నన్ను బలవంతముగా బయటకు లాగేశావు. ఏదో నా కొంప, నా ఇల్లు, నా ఇష్టాఅయిష్టాలు, నా అజ్ఞానం, ఇవి అన్నీ కలుపుకొని జీవిస్తున్న నా మనసు అనెడి యింటిలో నుండి నేను నా దేహం నిజం, ఈ మనస్సు నిజం, ఈ దేహాత్మబుద్ధి అనుకునే యింటిలో జీవిస్తున్న నన్ను నీ యొక్క కృపానుగ్రహంతో బయటకు లాగేశావు. నా కొంపలో నుండి బయటకు లాగి నువ్వేం చేశావంటే నన్ను నీ హృదయమనే గుహ (యింటి) లోకి నన్ను చేర్చుకొని కైవల్యానికి దారి చుపించావు. ఎంత దయ చూపించావు, ఎంత కరుణ చూపించావు అరుణాచలేశ్వరుడా! జీవుడు ఎన్ని తపస్సులు చేసినా, యజ్ఞాలు చేసినా, యాగాలు చేసినా పోగొట్టుకోలేని ఈ మనస్సు అనే యింటి నుండి నన్ను వేరుచేసేశావు. ఈ మనస్సు అనే పంజరంలో బ్రతుకుతున్న నన్ను బయటకు లాగి నా హృదయగుహలోనికి నెట్టి అక్కడే నివాసముగా ఉన్న నీవు నన్ను నీలో ఐక్యము చేసుకొని నీ స్వరూపానుగ్రహాన్ని ప్రసాదించావు నీ ఇల్లే నా యిల్లు చేసేశావు. నేను లేకుండా చేసేశావు అరుణాచలేశ్వరుడా! అంటున్నారు భగవాన్.

## 98 వెలిబుచ్చితి న్నీ దుసేత కినియక, నీ కృప వెలిబుచ్చి కా వరుణాచలా

**భావం :** అరుణాచలా ! నీవు నామనసున రహస్యముగ చేసిన నీ అంతరంగ దైవలీలలను బయట పెట్టితినని నన్ను ద్వేషించి వదలకు. నీ కృపను చూపి సాయుజ్యపదవియగు కైవల్యం నిచ్చి నన్ను ప్రేమతో కాపాడుము !

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! నీవు అంతటివాడవు, ఇంతటివాడవు అని బయటకు చెప్పుట నీకు ఇష్టం ఉండదు. అయినా నా ఆనందాన్ని నీవు చేసిన అద్భుతాన్ని (ఈ జీవుడిని అమృతుడిని చేసిన) నా హృదయంలో దాచుకొనలేక అందరికి ఎఱుక పరుస్తున్నానని నా మీద కినుక వహించకు. నీవు ఇంత మహాద్భుతాన్ని చేసి కూడా ఏమీ చేయనివారివలే ఊరక వుండి పోయావు. కాని నేను పొందిన ఈ ఆనందాన్ని, ఈ శాంతిని, ఈ పరమస్థితిని, ఇతరులు కూడా పొందాలనే తాపత్రయముతో నీ లీలలను బహిరంగ పర్చాను కాని వేరు ఉద్దేశ్యం ఏమీ లేదు అని సర్వాంతర్యామి అయిన నీకు తెలియదా!

నీ కృప, అనుగ్రహం ఇట్టిది అని జీవుడికి అర్థమవ్వాలి కదా! ఎవరు సరిపోతారు నీ వైభవాన్ని చెప్పటానికి, నీవే నా యొక్క అహంకార గతమైన నేనుని నాశనం చేసి నా హృదయగుహలో కొలువై ఉన్న నీవు మరణానుభవం ద్వారా మరణం లేని స్థితిని అనుగ్రహించిన నీ లీల చెప్పగలిగే నోరుందా ! అది అనుభవైకవేద్యం కదా!

భగవాన్ చిన్ననాటి మిత్రుడు రంగన్ అతని అన్న ఇద్దరూ భగవాన్ దగ్గరకు వచ్చేవారు. వారిద్దరు ఆయన సన్నిధిలో పొందిన శాంతిని, ఆనందాన్ని దాచుకోలేక వాళ్ళ ఊరిలో అందరికి భగవాన్ గురించి చెప్పేవారు. వాళ్ళందరూ ఆయనను దర్శించటానికి వెళ్ళేవారు. ఒకసారి భగవాన్ రంగన్‌తో ఎందుకురా ఇలా యోగీ చేస్తున్నారు అని అడిగారు. అప్పుడు రంగన్ అంటాడు భగవాన్ మేము కాకులు చేసే పని అయినా చేయవద్దా. ఒక కాకికి అన్నం దొరికితే పది కాకులను పిలుస్తుంది. మరి మేము నీ సమక్షములో పొందే శాంతి జీవులందరికి అందాలని వారు కూడా ఆనందముగా శాంతిగా జీవించాలని మేము ఈ పనిచేస్తున్నాం అన్నారంట. మరి భగవాన్ కూడా అరుణాచలేశ్వరునితో అంటున్నారు. నీ లీలలు బయటపెట్టటం నీకు ఇష్టం ఉండదు. అయినా ఇలా చేసానని నా మీద కోపం పెట్టుకోకుండా నన్ను అనుగ్రహించు అంటున్నారు భగవాన్.

## 99 వేదాంతమున వేరులేక వెలింగెడు,
## వేద పదమ బ్రోవు మరుణాచలా

**భావం :** అరుణాచలా ! స్వయం ప్రకాశమైన ఏ అద్వైత వస్తువును గురించి వేదముల అంతిమ భాగంలో వర్ణింప బడినదో అట్టి పరబ్రహ్మ స్వరూపంను నాకు ప్రసాదించు.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! వేదాల యొక్క సారం వేదాంతం. వేదాంతంలో ఏముంది? బ్రహ్మం ఉంది. మీరు

భగవద్గీత చదువుతున్నారు. అక్షరమణమాల చదువుతున్నారు వేదాంతం వలన వచ్చే ప్రయోజనం ఏమిటి అంటే మీ లోపల ఉన్న బ్రహ్మస్వరూపం తెలుసుకోవాలి. ఆ వేదం యొక్క మూలం, అక్షరమణమాల యొక్క మూలం, భగవద్గీత యొక్క మూలం, ఉపనిషత్తుల యొక్క మూలం మీ హృదయంలోనే ఉంది. మీ హృదయాన్ని మీరు తెలుసుకోవటం కోసం ఏది సారం? వేదాలకేది సారం, వేదాంతంనకేది సారం? బ్రహ్మమే. బ్రహ్మంలోనుండే వేదం వచ్చింది, వేదాంతం వచ్చింది. వేదాంతం చదివి తెలుసుకోవలసినది బ్రహ్మమే. ఆ బ్రహ్మం ఎక్కడ ఉంది నీ హృదయంలోనే ఉంది. అది ఎలా వెలుగు తుంది దానికి వేరు లేకుండా అక్కడ వెలుగుతుంది అక్కడ రెండు లేదు, మూడలేదు. ఉన్నది ఒక్కటే ఆ స్థితికి భక్తుడు చేరుకోవాలి.

వస్తువు ఎక్కడ వుందో అక్కడ వెదకటం మానేశాం. ఎన్ని జన్మలు ఎత్తినా మనకు వస్తువు తెలియదు. ఇలా చస్తూ పుడుతూ ఉండవలసినదే వస్తువు ఎక్కడ వుంది? హృదయంలో ఉంది గుళ్ళు వెతుకుతున్నాం, కాశీలో వెతుకుతున్నాం, రామేశ్వరంలో వెతుకుతున్నాం, అరుణాచలంలో వెతుకు తున్నాం. హృదయంలో వెతకటం మానేసి లోకమంతా వెతుకుతున్నాం ఇదే మాయ. మాయ అంతా మనస్సులో ఉంది. అంతర్ముఖం అయిన మనస్సుకి వస్తువు తెలుస్తుంది. మీరు మనస్సుని బాహ్యాముఖం చేసుకుంటే ప్రకృతిలో

పడతారు. అంతర్ముఖం చేసుకుంటేనే మీకు వస్తువు తెలుస్తుంది. ఈ స్వాతంత్ర్యం, ఈ స్వేచ్ఛ మీకే ఇచ్చేశాను అన్నాడు భగవంతుడు. మనస్సు బహిర్ముఖం అయితే సంసారంలో పడిపోతాం. కాబట్టి మనస్సుని అంతర్ముఖం చేసుకొని అక్కడున్న వస్తువుని పొంది మృత్యువు లేని స్థితిని ఆ పరమస్థితిని పొందటానికి అరుణాచలేశ్వరుడి యొక్క కృపను అనుగ్రహింపమని భగవాన్ వేడుకుంటున్నారు.

## 100 నింద నాశీస్సుగా గొని దయాపాత్రుగ, జేసి విడక కావు మరుణాచలా

**భావం :** అరుణాచలా ! నిన్ను స్తుతించుట తెలియని నా నిందలను నిన్ను పొగిడే స్తోత్రములుగా నెంచి, నీ యనుగ్రహం పొందునట్లు చేసి నీ కరుణతో నన్ను ఎప్పుడు విడువక ప్రేమతో కాపాడి రక్షించు.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! నీవు నా మీద చూపించిన వాత్సల్యంతో నీ మీద నాకున్న చనువుతో, నీ మీద ప్రేమతో నేను నీకు ఇష్టం లేని మాటలు మాట్లాడానేమో. అవి కూడా నీ మీద ప్రేమ అధికమై నాలో పొంగిపొర్లిన అనురాగమే కాని వేరు కాదు, ఒకవేళ ఆ మాటలలో ఏమైనా నిందలు ఉన్నా అవికూడా నీ మీద స్తోత్రాలుగా తీసుకోవయ్యా! నేను నీకన్నా చాలా అల్పుడని మరి ఈ అల్పుడి మాటలో ఏమైనా తప్పులుంటే వాటిని ఒప్పులుగా చేసి నీ దయకు పాత్రునిగా చేసి నీ అనుగ్రహంతో ఆశీర్వదించు అరుణాచలా!

ఒకోసారి భక్తుడు భగవంతుడిని నిందారోపణలు చేస్తాడు. వారి భక్తికి భగవంతుడు కరగకపోతే వారిని ఇంకా కష్టాలపాలు చేస్తుంటే భరించలేక అప్పుడు భక్తుడు పరమాత్మని రామదాసు లాగా దెప్పిపొడుస్తాడండి. రామదాసుకు రాముడు మీద విపరీతమైన భక్తి, ప్రేమ ఆ ప్రేమతోనే గుడి కట్టిస్తాడు. దాని కారణముగా జైలుపాలు అవుతాడు. అక్కడ పెట్టే హింసలు తట్టుకోలేక సీతమ్మను అడుగుతాడు రాములవారికి నీవైనా సిఫార్స్ చేయుమ్మా అని ! కాని కరగలేదు రాములువారు. అప్పుడు రామదాసు రాముడినే నిందిస్తాడు. అయినా ఆ నిందలనే స్తోత్రాలుగా తీసుకుని రాముడు అనుగ్రహించాడు కదా! మరి భక్తుడి బాధ భగవంతుడు కాక ఇంకెవరు తీరుస్తారు అరుణాచలా! నన్ను నీవే ఎన్నుకొన్నావు. నా తప్పులేమన్నా ఉంటే వాటిని ఒప్పులుగా చేయి. నిందలను కూడా స్తోత్రాలుగా తీసుకొని నన్ను విడిచిపెట్టకుండా ఏలుకో అరుణాచలా! అంటున్నారు భగవాన్.

## 101 నీట హిమముగ ప్రేమాకారు నీలోనన్, ప్రేమగ కరిగి బ్రో వరుణాచలా

**భావం :** అరుణాచలా! నీటిచే రూపమొందిన మంచుగడ్డ వెచ్చదనముచే కరిగి నీరగునట్లు, ప్రేమ స్వరూపుడవగు నీవు నా అహంకారమును ప్రేమతో కరిగించి అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! మంచుగడ్డ నీటిలో వేస్తే ఏవిధంగా అయితే నీరు అయిపోతుందో, మంచుగడ్డ

ఏమిటి? నీరే, ఊరికే గడ్డ కట్టింది కాబట్టి ఆలా అనిపిస్తుంది. మంచు గడ్డ అంటే అహంకారం. మీరు దేవుడిని ధ్యానం చేస్తే ఏమి అవుతుంది? మంచుగడ్డ నీటిలో ఏవిధంగా విడి పోతుందో ఈ అహంకారము కూడా విడిపోతుంది. నాకు అహంకారం ఉంది కాబట్టి నేను జీవుడి క్రింద కనిపిస్తున్నాను. నా అహంకారం కరిగిపోయింది అనుకో నువ్వు వేరు నేను వేరు కాదుకదా ! నా అహంకారం ఎప్పుడయితే కరిగి పోయిందో అప్పుడు నువ్వు నేను ఒక్కటే అరుణాచలేశ్వరుడా! నీతో నేను కరిగిపోవాలి. మీ హృదయంలో ప్రేమ లేకపోతే, శాంతి లేకపోతే, క్షమలేకపోతే, మీరు పాపంతోటి పోరాడ లేరు. ఇంద్రియాలతోటి, అహంకారం తోటి పోరాడలేరు. శాంతిలో మీరు ఎప్పుడైతే కూరుకుపోయారో అపుడు మీ ఇంద్రియాలు యొక్క వేదనతోటి, మీ భోగాలతోటి, మీ అహంకారంతోటి పోరాడేశక్తి వస్తుంది. శాంతి లేకపోతే పాపంతో ఎవరూ పోరాడలేరు.

అరుణాచలేశ్వరుడా ! నీవు ప్రేమ స్వరూపుడివి అయ్యా, అంత ప్రేమస్వరూపుడను నన్ను చెయ్యి ప్రేమ ముద్దవు నీవు, నీలో ఎంత ప్రేమ ఉందో అంత ప్రేమను నా హృదయంలో నింపి, వెలుగుతో, కాంతితో, ప్రేమతో, శాంతితో నా హృద యాన్ని నింపు. నీయొక్క గొప్ప గుణాల తోటి నాహృదయాన్ని అంతా నింపి నీ అంతటి వాడిని చెయ్యి. నీప్రేమని నాకిచ్చి నీలో నన్ను కలిపేసుకో అరుణాచలేశ్వరుడా! అటువంటి

ప్రేమను నాకు ఇవ్వకపోతే నేను ప్రేమలేని వాడ్ని అనుకో నువ్వు నన్ను తీసుకుంటావా? కాబట్టి నన్ను ప్రేమలో ముంచేయి. వెలుగుతోటి ముంచేయి. నీలో ఎంత జ్ఞానం ఉందో అంత జ్ఞానిగా నన్ను చేసేయ్. అరుణాచలం అంటేనే ప్రేమ ముద్ద అది ప్రేమాచలం. ప్రేమ రూపంలో ఉండి మనలను అందరిని ఆకర్షిస్తుంది. మనల్ని ప్రేమిస్తుంది. అరుణాచలం మనల్ని ప్రేమిస్తుంది కాబట్టే దాని మీద మనకి ప్రేమ కలుగుతుంది అంటున్నారు భగవాన్.

## 102 అరుణాద్రియననే కృపావలబడితి,
## తప్పునే నీ కృపావలయరుణాచలా

**భావం :** అరుణాచలా ! అని స్మరించినంత మాత్రమునే నీ దయ అనే వలలోపడి తప్పించుకోలేని విధంగా చిక్కుకుంటిని, దీనినుండి తప్పించుకొనుట నా తరమా!

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! అరుణాచలం అంటే సాక్షాత్తు భగవంతుడే అన్న స్పృహ నాకు నువ్వే కలిపించావు. చిన్న వయస్సులోనే ఒక బంధువు ద్వారా అరుణాచలం అనే క్షేత్రం ఒకటి ఉన్నదని, అక్కడ దేవుడి పేరు అరుణాచలేశ్వరుడు అని, కొండపేరు అరుణగిరి అని తెలుసుకున్నాను. ఆ అరుణాచలాన్ని తిరువణ్ణామలై అంటారని కూడా తెలుసు కున్నాను. ఆ తిరువణ్ణామలైలో ఉన్న అరుణాచలం నిజం

కాదు. నిజమైన అరుణాచలం నీ హృదయంలోనే ఉంది అనే అనుభవాన్ని నువ్వే నాకు కలిగించావు. అరుణాచలం ఒకటి ఉంది అని అందరూ ఎందుకు పరుగుపెడుతున్నాం.

ఈ శవాన్ని నేను నేను అని మోసుకు తిరుగుతున్నాం. ఈ శవాన్ని చచ్చిపోతే నలుగురు మోస్తున్నారు వల్లకాటిలోకి, బ్రతికుండగా ఎవరి శవాన్ని వాడే మోసుకుంటున్నాడు. ఈ శవాన్ని నేను అంటూ తిరుగుతున్న నన్ను మరణానుభవం ద్వారా మరణం లేని స్థితికి నన్ను తీసుకు వెళ్ళావు. ఎంత కృప చూపించావు అరుణాచలా! ఎంత దయ చూపించావు. జీవులందరూ ఏ స్థితికోసం ఏ మోక్షం కోసం ఏ నిర్వాణసుఖం కోసం నిన్ను స్మరిస్తున్నారో అవి ఏమీ తెలియని నన్ను నీ కృప అనే వలలో చిక్కుకొనేటట్లు చేశావు. నీ యొక్క కృపతో నన్ను నీ అంతటి వాడిని చేసేశావు అరుణాచలా ! స్మరణ మాత్రమునే మోక్ష సుఖమిచ్చే దేవుడివి అని కూడా నాకు తెలియకుండానే నిన్ను సర్మించేటట్లు చేసావు అంటున్నారు భగవాన్.

## 103 చింతింప కృపపడ సాలీడువలె గట్టి,
## చెరపెట్టి భక్షించి తరుణాచలా

**భావం :** అరుణాచలా ! నీవు సాలీడు వలె నీ అనుగ్రహమనే వల అల్లి నన్ను దానిలో చిక్కుకునే విధంగా నువ్వు బంధించి నన్ను భక్షించావు.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! నిన్ను స్మరించే కొద్ది నీ దయ నా మీద వర్షించి ఈ దేహాత్మభావం అనే బంధం తెగిపోతుంది. నిన్ను నిరంతరం చింతించటం వలన కలిగే లాభమిది. నీ దయ నా మీద పడకుండా ఈ చీకటిలో నుండి బయట పడలేను. ఈ సర్జరీలో నా సాధన కంటే నీదయే చాలాముఖ్యం అరుణాచలా ! అన్నారు భగవాన్.

నీవు ఏ కారణం చేతనయినా బెంగ, ఆవేశం, ఆందోళన పడతున్నావంటే నీకు శరణాగతి భక్తి లేదని అర్థం. ఈశ్వరుడే కర్త అని పూర్ణ విశ్వాసం లేనప్పుడే ఈ బెంగలు ఆవేశాలు, ఆందోళనలు వస్తాయి. విశ్వాసం ఉన్నవాడు శరణాగతి భక్తి ఉన్నవాడు ఏ ఆందోళన, బెంగలు, పడనవసరం లేదు.

ఎవరైతే అరుణాచలేశ్వరుడుని నిరంతరం చింతన చేస్తూ ఉన్నారో, శరణాగతి కోరుతున్నారో వారిని అరుణాచలేశ్వరుడు ఎలా అనుగ్రహిస్తాడు అంటే సాలీడు గూడు అల్లి ఎలా కీటకాలను ఆకర్షించుకొని భక్షిస్తుందో, అలా వలపన్ని జీవులు దానిలో చిక్కుకోనేటట్లు చేసి అప్పుడు వాళ్ళలో ఉన్న దేహాత్మ బుద్ధిని భక్షించేస్తాడు. మన అహంకారం అనే అజ్ఞానాన్ని భక్షించగలవాడు ఒక భగవంతుడు, గురువు మాత్రమే ఇది అంతా కృప వల్లనే సాధ్యమవుతుంది. జీవులు ఎవరి అహంకారాన్ని వాళ్ళు తీసుకోలేరు. వాళ్ళ అహంకారం వాళ్ళకు ఇష్టం. దాన్ని విడదీసుకోలేక జననమరణ చక్రంలో పడి

పోతున్నారు. ఎవరైతే అరుణాచలేశ్వరుడుని త్రికరణ శుద్ధిగా శరణు వేడుకుంటున్నారో, చింతిస్తున్నారో వారిపైన కృప అనే వలను వేసి దేహాత్మబుద్ధిని భక్షించి, జననమరణ చక్రంలోంచి తప్పిస్తాడు అరుణాచలేశ్వరుడు అని అంటున్నారు భగవాన్.

## 104 ప్రేమతో నీనామ మాలించు, భక్తభ క్తుల భక్తుగా బ్రోవు మరుణాచలా

**భావం :** అరుణాచలా ! సదా నీ పవిత్ర నామము చెవులతో విని హృదయము ద్రవించి ఆనందించు దాసదాసునిగా నీ దాసుడనగు నేను దాసుడగునట్లు నీవు అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! కొంతమంది అరుణాచలం అరుణాచలం అరుణాచలం అంటారు. కొంతమంది అనరు, వింటారు అరుణాచలం అని ఎవరైతే అంటుంటే వింటున్నారో, ఆ వినేవాళ్ళకి భక్తులు ఉంటారు. ఆ భక్తులకు భక్తుడిగా నన్ను చేయి. అరుణాచలేశ్వరుడు వేరు, భక్తులు వేరు కాదు. దేవుడు వేరు, భక్తులు వేరుకాదు. దేవుడి యొక్క భక్తులకి మీరు ఏదైనా ఉపకారం చేస్తే, ఏదైనా సేవ చేస్తే, దేవుడికి చేసినట్లే. భక్తులను కూడా మనం గౌరవించాలి. భక్తులు అంటే ఎవరు ? భగవంతుడి యొక్క ప్రతీకలు వారు. మీరు చేయలేకపోవచ్చు, ఎదుటి వాళ్ళు ఎవరైనా మంచి పని చేస్తుంటే మీరు చూసి సంతోషించాలి. మీరు అలా సంతోషిస్తారు అనుకోండి, ఆ చేసే వాళ్ళలో నుండి

అర్ధరూపాయి వాటా మీకు పెట్టేస్తాడు భగవంతుడు. వాళ్ళను ద్వేషిస్తారు అనుకోండి, ఆ మంచి పని చేసేవాళ్ళకు పూర్వ జన్మలో ఏమైనా పాపం ఉంది అనుకోండి, ఆ పాపం వచ్చి మీ కంటుకుంటుంది. రాగాలు, ద్వేషాలు, కక్షలు, కార్పణ్యాలు, కామాలు, క్రోధాలు, లోభాలు ఇవి అన్ని మన శరీరంలో కాపురము ఉంటాయి. మన శరీరంలో రక్తం, మాంసం, ఎముకలు ఉన్నాయి అనుకుంటున్నాం. ఇవి కూడా ఉన్నాయి. కాని శరీరంలో ఉన్న ఎముకలు, మాంసం, రక్తం స్మశానంలో కాలిపోతాయి కానీ ఈ లోపల ఉన్నటువంటి అరిషడ్వర్గాలు కాలవు. అయ్యే పునర్జన్మలు తీసుకువస్తాయి

అరుణాచలేశ్వరుడా, నేను జీవించి ఉండగానే, ఈ శరీరంలో ప్రాణం ఉండగానే వాటినుండి బయటకు తప్పుకునే దారి చూపించు ఈ అహంకారం నుండి ఈ అసూయ నుండి నేను బయట పడలేను నువ్వే దారి చూపించు. చేసిన తరువాత పారిపోవటానికి అవకాశం లేదు. చేసిన మంచిపనికి, చెడ్డపనికి సమాధానం చెప్పి తీరాలి. ప్రేమ వచ్చినా, కష్టం వచ్చినా తలంపుల రూపంలో వస్తుంది. అందుచేత ఈ తలంపు రూపంలో నుంచి బయట పడే దారి చూపించి నన్ను అనుగ్రహించు అరుణాచలా అంటున్నారు భగవాన్.

## 105 నను బోలు దీనుల నింపొందకాచుచు, చిరంజీవివై బ్రోవు మరుణాచలా

**భావం :** అరుణాచలా ! నన్ను ఏవిధంగా రక్షించావో అదేవిధంగా నీ పొందు కోరి వచ్చే నాలాంటి దీనులను రక్షిస్తూ నీవు కలకాలం చిరకాలం చిరంజీవిగా నిలిచిపో.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరా ! శరీరంతోటి వేరు కాపురం ఎవరికీ ఇష్టం ఉండదు. ఎవరికీ శరీరం విడిచి పెట్టడం ఇష్టం లేదు. కాని శరీరం మనలని విడిచి పెట్టేస్తుంది. నా శరీరం నా శరీరం అని గట్టిగా పట్టుకున్న శరీరం మనల్ని విడిచి పెట్టేస్తుంది. అందుచేత నేను శరీరం విడిచి పెట్టి వెళ్ళి పోయాననుకో నువ్వు శాశ్వతంగా ఉండు అరుణాచలేశ్వరుడా! నువ్వు ఏ విధంగా అయితే నన్ను బాగు చేశావో, ఏ విధంగా అయితే నన్ను జ్ఞానిని చేశావో, ఏవిధంగా అయితే నన్ను ఉన్నతస్థితికి, ఉజ్వలస్థితికి, ఉదాత్తమైనస్థితికి తీసుకు వచ్చావో అదే విధంగా మిగతా జీవులని ఈ ప్రపంచములో ఉన్న మనుషులందరిని కూడా అటువంటి గొప్ప స్థితికి తీసుకురా అరుణాచలేశ్వరుడా!

ఏమి అపూర్వం, ఏమి ప్రేమ నన్ను బాగుచేశావు. నాకు జ్ఞానం ఇచ్చావు, అక్కడితో నీపని పూర్తి అయిపోయింది అంటే మరి మిగతా వాళ్ళ మాట ఏమిటీ? నీ అనుగ్రహంతోటి, నీ కరుణతోటి ఏ విధంగా అయితే నన్ను తడిపావో, అదే విధంగా

లోకంలో ఉన్న సమస్త జీవకోటిని కూడా తడుపుతూ లోకంలో ఉన్న సమస్త జీవులను అనుగ్రహిస్తూ, వారికి శాంతిని, కాంతిని ప్రసాదిస్తూ నువ్వు మటుకు శాశ్వతంగా ఉండు అరుణాచలేశ్వరుడా?

ఏమండీ మనకు లాభం ఏమీ లేకపోతే పని చెయ్యం మీ ఇంటికి వస్తే నాకేమి ఇస్తావు. మా ఇంటికి వస్తే నువ్వు ఏమి తెస్తావు. అనే మనుషులం. కాని ఎవరైతే ప్రతిఫలం ఆశించ కుండా పని చేస్తున్నారో వారిని జ్ఞానం వరిస్తుంది. మన మనస్సుని మర్చిపోయి, డబ్బుని మర్చిపోయి. కులాన్ని, మతాన్ని మర్చిపోయి ఏదైనా ఒకమంచి పనిచేస్తే మనం పవిత్రులం అవుతాము. మనం ఎప్పుడైనా కొన్ని సెకనులు గాని, కొన్ని నిమిషాలు కానీ మనల్ని మనం మర్చిపోయి జీవితంలో గడిపామా? మనం ఇంత ప్రేమిస్తున్న దేహం ఎదో ఒకరోజున మనల్ని దగా చేసి విడిచిపెడుతుంది. ఈ దేహాత్మబుద్ధిని శరీరం ఉండగానే ఎవరైతే విడిచి పెడుతున్నారో వారు చిరంజీవులు అవుతారు అంటున్నారు భగవాన్.

## 106 ఎముకలరుగు దాసు మృదువాక్కు వినుచెవిన్,
## గొనుమ నా యలోక్తు లరుణాచలా

**భావం :** అరుణాచలా ! భక్తితో ఎముకలను కూడా కరిగించ గల పాటలు భక్తులు పాడగా విని సంతోషించిన నీ చెవులతో, రసహీనమైన, రుచిలేని అల్పములైన నామాటలు విని సంతోషించి నన్ను అనుగ్రహింపుము.

**నాన్నగారు :** ఓ అరుణాచలా ! పూర్వం మాణిక్యవాచకర్ జ్ఞాన సంబంధర్ వాళ్ళ స్తోత్రాలు కనుక వింటే ఎముకలు కూడా కరిగిపోతాయి. స్మశానంలో నిప్పు కూడా కొన్ని ఎముకలని కాల్చలేదు. వాటిని అస్థికలు అంటారు తీసుకెళ్ళి గోదావరిలో కల్పుతారు. కాని అరుణాచలేశ్వరుడి మీద కొంతమంది ఎటువంటి స్తోత్రాలు చేశారు అంటే మొత్తము మన ఎముకలు కూడా కరిగి పోతాయట.

మాణిక్యవాచకర్, జ్ఞానసంబంధర్, సుందరమూర్తి మొదలగు శివభక్తులు ఎంతోమంది అరుణాచలేశ్వరుడి గొప్పతనం గూర్చి అరుణాచలేశ్వరుడి ఔన్నత్యం గురించి, అరుణాచలేశ్వరుడు ప్రజలకు చేసిన ఉపకారం ఏమిటి, ఇదంతా వర్ణిస్తూ గొప్పగొప్ప కవులు, గొప్ప, గొప్ప రచయితలు నీ మీద స్తోత్రాలు చేశారు అరుణాచలేశ్వరుడా.

కాని నాకు అంత కవిత్వం చేతకాదు. అంత ఊహ నాకు లేదు. నేను చెప్పే చిన్న చిన్న మాటలు పొట్టి పొట్టి మాటలు ఇవి కూడా విను. మాట్లాడేటప్పుడు మనసు ఉండాలి. వినేటప్పుడు మనసు ఉండాలి. ఎక్కడ ఏ పని చేస్తూన్నామో అక్కడ మనసు ఉండాలి. వారే జీవితంలో రాణిస్తారు. ఓ అరుణాచలేశ్వరుడా ! ఎముకలు కరిగిపోయే కవిత్వం చెప్పారు నీ గురించి అటువంటి కవిత్వాలెన్నో నువ్వు చెవులతోటి విన్నావు కాని నేను చెప్పే కవిత్వం అంత గొప్పగా

వుండదు. నీకు కష్టంగా ఉండచ్చు. పూర్వ కవులతోటి పోల్చు కుంటే నాది ఓ కవిత్వమా! అయినప్పటికి నేను కూడా చెబుతున్నాను కాబట్టి, నీకు కష్టంగా ఉన్నప్పటికి, నీకు ఇష్టంగా లేనప్పటికి నా కవిత్వం నీకు నచ్చక పోయినప్పటికీ నేను చెప్పేమాటయందు నీకు రుచి లేకపోయినప్పటికీ నీచెవులతోటి శ్రద్ధగా విని, నన్ను ఆశీర్వదించు అరుణాచలేశ్వరుడా ! అంటున్నారు భగవాన్.

## 107 క్షమగల గిరి యల్పవాక్కు సద్వాక్కుగ గొని, కావు మరి యిష్ట మరుణాచలా

**భావం :** అరుణాచలా ! నువ్వు పైకి కొండరూపంలో కనిపిస్తున్నప్పటికి గొప్ప ఓర్పుగలవాడివి కదా ! కనుక నేను చెప్పే ఈ చిన్ని చిన్ని మాటలు కూడా ఇష్టంగా స్వీకరించు.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా! నువ్వు క్షమగల హృదయుడివి మనం ఏమి అనుకుంటున్నాం? అరుణగిరి అరుణగిరి అంటున్నాం. భగవాన్ అంటున్నారు నువ్వు ఎంతో ఓర్పు కలవాడివి అనే గొప్ప పేరు ఉంది లోకంలో, అందుచేత నా వాక్కులో గొప్పతనం లేకపోయినా, లోతులు లేకపోయినా స్వీకరించు. కొంతమంది మనషులు లోతుగా ఉంటారు. కొంతమంది చాలా విశాలంగా ఉంటారు. ఈ లోతు, విశాలం రెండూ ఉన్న మనిషికి జ్ఞానం వస్తుంది. ఓ క్షమాచలమా! నువ్వు నేను చెప్పే అల్పవాక్కుని సద్వాక్కుగా తీసుకో!. నా

మాటలలో వ్యాకరణం లేకపోవచ్చు, నా మాటలలో కవిత్వం లేకపోవచ్చు, నా మాటలలో అందం లేకపోవచ్చు అయినప్పటికి నావి గొప్ప మాటలుగా రమణస్వామి ఎంత బాగా చెబుతున్నాడు, ఎంత గొప్పగా చెబుతున్నాడు అని చెప్పకపోయినా సరే సద్వాక్కుగా తీసుకొని నన్ను రక్షించు అరుణాచలేశ్వరుడా!

ఈ రమణమహర్షి తన జీవితాన్ని ధారపోశాడు, తన సర్వస్వం ధారపోశాడు. ఆయన గౌరవాన్ని ఆయన అగౌరవాన్ని ధారపోసి నేను అనేది, నాది అనేది లేకుండా చేసి, గొప్ప గొప్ప కవిత్వాలు చెప్పి జీవితం అంతా యాభై నాలుగు సంవత్సరములు ఆయన పాదాల దగ్గరుండి ఆయన పాదాలు విడిచి పెట్టకుండా నాకు ఏమీ వద్దు నీ పాదాల దగ్గర భక్తి ఇవ్వు, నీ పాదాలయొక్క సౌందర్యం నాకు చూపించు నీ పాదాలు నా శిరస్సు మీదపెట్టి నా అహంకారాన్ని తొక్కేయ్ అని చెప్పి, జాగ్రదావస్థలో, నిద్రావస్థలో, స్వప్నావస్థలో, అరుణాచలేశ్వరుడే త్రికాలాలలో అరుణాచలేశ్వరుడిని స్మరిస్తూ, అరుణాచలేశ్వరుడే ప్రాణం, అరుణాచలేశ్వరుడే మనస్సు, జీవితమంతా ధారపోసి, నిన్ను రక్షించమని నేను అడుగుతున్నాను. ఒకవేళ రక్షించకపోతే నేను కోపం తెచ్చుకోను. అది నీ ఇష్టం, అది నీ ఇష్టానికే వదిలేశాను, అని తనని సర్వస్య శరణాగతి చేసుకున్నారు భగవానులు.

## 108. మాలను దయచేసి యరుణాచలరమణ, నామాల దాల్చిబ్రో వరుణాచలా

**భావం :** అరుణాచలా ! నీ అనుగ్రహం అను మాలను నాకు ప్రసాదించి ఈ అరుణాచలరమణులు అక్షరములతో కూర్చిన ఈ పెండ్లిమాలను నీవు స్వీకరించి నన్ను కాపాడు.

**నాన్నగారు :** ఓ అరుణాచలేశ్వరుడా ! నీ మాలను నాకు వెయ్యి, నీ అనుగ్రహాన్ని, ప్రేమను నాకు దయచేయి నీ స్వరూపాన్ని నాకు ప్రసాదించు. పెళ్ళిళ్ళలో పెళ్ళికూతురు చేత పెళ్ళి కొడుకుకి మళ్ళీ పెళ్ళికొడుకు చేత పెళ్ళికూతురుకి దండ వేయిస్తారు. దాని అర్థం ఏమిటంటే వాళ్ళు ఒకళ్ళకి ఒకళ్ళు దండలు మార్చుకొని, ఒకళ్ళకి ఒకళ్ళు ఒకే శరీరంగా, ఒకే మాటగా, ఒకే మనసుగా, ఐకమత్యంగా ఉండమని చెప్పటం అర్థం అది. దండలు అలంకారం కోసం, ఫోటోలు తీయించుకోవడానికి కాదు. దండలు ఎందుకంటే నువ్వు నేను కలిసి ఉండటంకోసం నువ్వు దండవెయ్యి అరుణాచలేశ్వరుడా! నువ్వు నా మెళ్ళో ఏమి దండ వేస్తావు. నీ ప్రేమ అనే దండ వెయ్యి, నీ ఐశ్వర్యం అనే దండ వెయ్యి, ఏది ఐశ్వర్యం ఆత్మే ఐశ్వర్యం అందు చేత నీ అనుగ్రహం అనే దండ వెయ్యి నీ యొక్క కరుణ అనే దండ వెయ్యి, పూసల దండ కాదు నాకు వేయవలసింది అరుణాచలేశ్వరుడా! పువ్వుల దండ కాదు, పువ్వులు వాడిపోతాయి. మోక్షం అనే దండ, కరుణ అనే

దండ, ప్రేమ అనే దండ మంచి గుణాలతోటి ఆ దండని నాకు అలంకరించు అరుణాచలేశ్వరుడా. అక్షరమణమాల, ఇది అక్షరాల తోటి తయారు చేసిన మణమాల ఇది పెండ్లి మాల. ఈ అరుణాచలరమణుడు వేసే దండను నువ్వు స్వీకరించు అరుణాచలేశ్వరుడా ! అని రమణమహర్షి వేడుకుంటున్నారు.

**అరుణాచలశివ - అరుణాచల శివ ।**
**అరుణాచలశివ - అరుణాచలా ॥**
**అరుణాచలశివ - అరుణాచల శివ ।**
**అరుణాచలశివ - అరుణాచలా ॥**

**మంగళం అరుణాచలమునకు**
**మంగళం భక్తశ్రేణికిని**
**మంగళం అక్షరమణమాలకును**
**జయ మంగళం నిత్య శుభ మంగళం**
**జయ మంగళం నిత్య శుభ మంగళం**

# మనవి

సద్గురు శ్రీనాన్నగారు అర్ధశతాబ్దం పైగా ఎన్నో అనుగ్రహ భాషణలు చేశారు. వారి అనుగ్రహ భాషణలలో అప్పుడప్పుడు అలవోకగా జారిపడిన ఆణిముత్యాల వంటి అక్షరమణమాల ద్విపదల యొక్క భావములన్నింటిని ఒక మాలగా గుచ్చి పారాయణం చేసుకొనుటకు వీలుగా అందించాలనే సంకల్పం నాన్నగారి అనుగ్రహం వలన కలిగించారు. ఈ అక్షరమణమాలను భక్తులందరూ శ్రద్ధగా చదువుకొని అందులోని లోతైన భావములను అర్ధము చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఎప్పుడైతే మనకు అర్ధం అవుతుందో ఆచరించాలనే కాంక్ష వస్తుంది. జీవితంలో మనం తరించడానికి ఈ అక్షరమణమాల ఒకటి సరిపోతుంది అని నాన్నగారు చెప్పేవారు. మా ఈ ప్రయత్నంనకు సహకరించిన భక్తులందరికీ హృదయ పూర్వక ధన్యవాదములు తెలియచేస్తున్నాము.

**సర్వం శ్రీనాన్నార్పణమస్తు**

**ఓం శాంతి శాంతి శాంతి**





అక్షరమణమాల

